# ప్రశ్నోత్తరములు

శ్రీ అచ్యుతాశ్రమము I.L.T.C. Training సమయమున వివరించబడిన ప్రశ్నలు మరియు ఉత్తరములు – ఆశ్రమ గ్రంథముల నుండి సేకరించబడినవి.

1. కాయము – క్షేత్రము అనగా నేమి ?

కాయము – క్షేత్రము అనగా దేహము. దీని విషయమై వివరముగా తెలిసికొనుట అవసరము. కేవలము మానవ దేహము మాత్రమే కాయమని చెప్పబడలేదు. భూత ధాతువుల యొక్క సంయోజనముచే ఏర్పడిన ప్రాణుని దేహమునకు కాయమని చెప్పబడినది. మనము ముఖ్యముగా తెలిసికొనవలసినది మానవ దేహము. దీనిని తెలిసికొనుటకు ముందు మనలను మోసికొని తిరుగుచున్న భూమాత విషయమై కొంత తెలిసి కొనవలెను.

ఈ స్థూల రూపమైన పృధ్వి మనము ఉండునట్లు ఒక చైతన్య ప్రభావానికి దొరికి సాగుచున్నది. ఈ జగత్తు చక్రము యొక్క పాలనలో ఒక దానికి ఒకటి మిత్రత్వము, శత్రుత్వము మరియు సమత్వములున్నవి. కేవలము ఈ విషయమై స్థూలదృష్టితో తెలిసికొనుట సాధ్యము కాదు. మన దేహములో పంచమహా భూతములు మిలనమై యున్నను వీటియందు గల శక్తి తృణ పరిమాణము. తనలో తాను తెలిసికొన్న విజ్ఞానం వ్రాసి పెట్టిన గ్రంథములనే జ్యోతిశ్శాస్త్రము, వైద్య శాస్త్రము (ఆయుర్వేదము) అని చెప్పబడుచున్నవి. అయితే మహర్షుల దృష్టిలో వీటన్నింటిని స్థూలాంశములని చెప్పియున్నారు. మన దృష్టికి దొరకని ప్రాణశక్తిని మాత్రం వారు సూక్ష్మంలో చేర్చియున్నారు.



"ఇదం శరీరం కౌన్తేయ క్షేత్ర మిత్యభిధీయతే
ఏతద్యో వేత్తి తం ప్రాహుః క్షేత్రజ్ఞ ఇతి తద్విదః"

(భగవద్గీత –13వ అధ్యా. 1వశ్లోకం)

ఈ మానవశరీరమే క్షేత్రమని తెలిసినవారు చెప్పుచున్నారు,. ఈ దేహంలో అంగాంగములున్నట్లే జగత్తులో వస్తువులున్నవి. మన ఇంద్రియ వృత్తులు ఉన్నట్లే ప్రాణులు, మానవులు, దేవతలు ఉన్నారు. మన దేహములో వాయువు ఉత్పత్తి అగుటకు శాకము, జలములు ఉన్నట్లే, సృష్టి కారణమైన "విశ్వాత్మ" (పరమాత్మ మరియు సృష్టి సాధనమైన ప్రాణచేతనము అక్షరము – అవ్యక్తము అన్నారు) అని ఉన్నది.

ఈ దేహము ఉత్పత్తి అగుటకు ముందుగా దీని జననమునకు కారణమైన తండ్రి దేహములో ప్రాణశక్తి ఉండి, అనంతరం ఆత్మ వచ్చి మూడునెలల కాలము తండ్రి దేహములో వసించి, దంపతులు మిలనకాలములో తండ్రి యొక్క ప్రాణాంశము శుక్లముతో పాటు మాతృ గర్భమును చేరి ఈ దేహమును నిర్మించుకొన్నట్లే, మూలము నుండి అనగా "విశ్వాత్మ" నుండి ప్రాణశక్తి బయటకు వచ్చి భూత ధాతువుల ఉత్పత్తికి కారణమైనది. ఇంతవరకు అయిన క్రియ సహజమైనది. అనగా సంకల్పము లేనిది. "విశ్వాత్మ"లో ఇచ్ఛలేదని అర్థము చేసికొనవలెను. అస్తిత్వానికి వచ్చిన ప్రథమవ్యక్తి (ఆది పురుష – విరాట్ పురుష – పరమేష్ఠి – పరబ్రహ్మ ఋషి – హిరణ్య గర్భ – ఏకర్షి) ఈయన వలననే సంకల్ప సృష్టి నడచినది.

బృహత్ పరిణామమునకు కారణమైన మహాత్ములు అనగా గొప్ప మనశ్శక్తి, సంకల్పశక్తి (will power) ఉన్నవారిని బ్రహ్మలని పిలిచియున్నారు. ఇటువంటి అనేక బ్రహ్మలను సృజించి వారికి

సృష్టికార్యమును చేయుటకు కర్తవ్యాన్ని, అదేవిధంగా తనవలన సృజింపబడిన లోకముల కర్తవ్యాన్ని వీరికి బాధ్యత కలుగజేసి తాను అలిప్తస్థితిలో ఉన్న ఆది పురుషుడినే పరబ్రహ్మ, పరమేష్ఠి, పురుషః ఇత్యాదిగా చెప్పుచున్నారు. ఈ పురుషుని అస్తిత్వానికి కారణమైన మూలచేతనాన్ని పురుషః పరః, పురషోత్తమ, పరశ్రేష్ఠ, పరంబ్రహ్మ, పరంజ్యోతి, స్వరాట్, చిన్మయ, Lord lagoes, ఖుదా ఇత్యాదిగా చెప్పుచున్నారు. ఈ క్షేత్రజ్ఞుని విషయమై ఋషులు అనేక విధాలుగా వర్ణించియున్నారు. బ్రహ్మసూత్రములు మొదలగు గ్రంథములలో చెప్పబడి యున్నది.

పంచ మహాభూతములు, అహంకారము, బుద్ధి, అవ్యక్తము (ప్రాణము), దశ ఇంద్రియములు, మనస్సు, ఐదు ఇంద్రియ వృత్తులు, ఇచ్ఛ, ద్వేషము, సుఖము, దుఃఖము, చేతనము (ఆత్మ – ప్రత్యగాత్మ – మనుష్య దేహములో ఉన్నది) నిష్ఠ, వీటన్నింటి కలయికే క్షేత్రము (దేహము) ఇది వికారముతో కూడి యున్నది.

ఇచట దేహ నిర్మాణానికి కారణమైన పంచమహాభూతములు (పృథ్వి, ఆప్, తేజస్సు, వాయు, ఆకాశ) వీటి ఉత్పత్తికి కారణమైన అవ్యక్తము (ప్రాణము). ఈ ప్రాణశక్తి మూలకముగా ఐదు కర్మేంద్రియములు, ఐదు బ్రహ్మేంద్రియములు. ఇంద్రియములను నడిపించు మానవ దేహములో ఉన్న అధిష్ఠాన చేతనము "ఆత్మ" ప్రాణాన్ని శరీరాన్ని నియంత్రించుచున్నది. దేహము నందు అహంకారము, బుద్ధి (విచార శక్తి), నిష్ఠ, ఇచ్ఛ, ద్వేషాదులు ఉన్న మనస్సు చేరియున్న దేహాన్ని క్షేత్రము అనుచున్నారు.

ఈ దేహములో చేరియున్న ప్రకృతి దోషము నశించి క్షేత్రజ్ఞుడైన ఆత్మకు సహజత్వము అనుభవానికి వచ్చినపుడు నిరీంద్రియానందము తదితరములు కలుగుచున్నవి. దీనినే స్వరూప జ్ఞానము (ఆత్మాను భవము)



Know Thy Self మరియు లాటిన్ భాషలో KNOTHI అనుచున్నారు. ఈ అనుభవము రావలయునన్నచో సాధన చేయవలెను. ఈ విద్యవలన కల్మషములు నశించుచున్నవి. కావున దీనిని యజ్ఞము అన్నారు. భగవద్గీతలో దీనిని "యజ్ఞ క్షపిత కల్మషః" అన్నారు ఈ సాధన యజ్ఞము చేయని జీవితము వ్యర్థమని జ్ఞానులు అన్నారు.

2. దేహమునందు ప్రాణ సంచార విషయమై ఉపనిషత్తు లందు వివరించిన విషయములను తెలియజేయుడు ?

మన దేహమునందు ఉన్న ప్రాణశక్తిని భారతదేశపు తత్త్వజ్ఞులు ఆదిశక్తి అన్నారు. ఉత్పత్తియైన శక్తిలో మొదటిశక్తి కావడం వలన ఆ విధంగా పిలిచియున్నారు. ఆదిభూతమని కూడా అన్నారు. ఇది ఎచ్చటి నుండి ఉత్పత్తి అయినది అను విషయమై ఉపనిషత్తులలో "జ్యేష్ఠ శ్రేష్ఠ ప్రజాపతిః" అన్నారు. ఇది జీవులకు అత్యంత ముఖ్యమైనది. ఒక విధముగా ఆలోచించినచో విద్యుత్‌వలెనున్న స్థూలశక్తి అని చెప్పవచ్చును. ఎందుకనగా ఇందులో కేవలము క్రియ ఉన్నది. జ్ఞానము లేదు. ఈ ప్రాణునందు సృష్టి ప్రాణశక్తి జ్యేష్ఠమైనదే. ఆదిలో ఉత్పత్తి అయినదే. జ్ఞానము లేదు గనుక దీనిలో శ్రేష ఠత్వము లేదని శ్రీ అచ్యుతులవారిబోధ. సృష్టిలో ప్రాణశక్తి తరువాత పూర్ణచేతనము నుండి (Absolute) ఉత్పత్తి అయిన (emitted) "ఆత్మయే" జ్ఞానమున్న చేతనమని అందువలన శ్రేష్ఠమైనదని శ్రీగురువుగారు చెప్పియున్నారు. ఆశ్రమ శాంతి మంత్రాలలో "ఆత్మసర్వోత్తమః" అని చెప్పబడినది.

పాశ్చాత్య తత్త్వవేత్త "ప్లాటినస్" అను ఆయన ఈ ప్రాణాన్ని "నౌస్" అని చెప్పియున్నాడు. ఈప్రాణుడు వాయుగతుడు. ఆత్యంతికమైన సత్యానికి అనగా పూర్ణత్వానికి "సత్" (శాశ్వతమైనది) అనుచున్నారు. పూర్ణత్వమనే

ఇది అనాది కాకపోయినను శాశ్వతముగా ఉండునది అని చెప్పుట మాత్రము నిజము.

"ద్వా విమౌ పురుషౌ లోకే క్షరశ్చాక్షర ఏవచ
క్షరః సర్వాణి భూతాని కూటస్థోఽక్షర ఉచ్యతే॥"

(భగవద్గీత – అధ్యా.15.శ్లోకం.16)

జీవాత్మ, పరమాత్మల సంయోగానికి కూటస్థుడయిన (సూత్రము వలె చేర్పించు) ప్రాణము నాశరహితమైనదని చెప్పబడినది. ప్రాణము పోయినదానిని చనిపోయినది అనుచున్నారు. స్థూలప్రపంచ నిర్మాణానికి దీనివల్ల భూతధాతువులు కారణమగుట వలన దీనిని బ్రహ్మ అన్నారు (పెద్దది). మాతరిశ్వః అనికూడా అన్నారు. మాతరిశ్వః అనగా వాయుజనకుడు. దేహమునందలి వాయువును ప్రత్యక్ష బ్రహ్మ అన్నా వారు ఈ ప్రాణాన్ని పరబ్రహ్మ మనియు దీని ఉత్పత్తికి కారణమైన మూలచేతనాన్ని "పరంబ్రహ్మ" ఆత్యంతికమైన పెద్దది అన్నారు. ఇది పోయిన తరువాత జీవుని గతి ఏమి ? అనే ప్రశ్నకు అది ఉన్నపుడే కావలసిన సాధన ఆచరించితే తర్వాతగతిని తెలిసికొనుట సాధ్యమని ఆశ్రమ గురువులు అన్నారు.

3. ఈ ప్రాణశక్తి మానవదేహములో ఎక్కడి నుండి ఎక్కడి వరకు చలిస్తుంది ? ఈ ప్రాణశక్తికి బలము చేకూర్చునది ఏది? వివరింపుము ?

"ఊర్ధ్వం ప్రాణ మున్నయత్యపానం ప్రత్యగస్యతి
మధ్యే వామన మాసీనం విశ్వే దేవా ఉపాసతే॥"

(కఠోపనిషత్తు -2-5-3)

ఇది ప్రాణవాయువును పైకి లాగుచున్నది. అపాన వాయువును



విరుద్ధ దిశలో క్రిందకు నొక్కుచున్నది. దేహము మధ్యలో ప్రతిష్ఠితమైన వామనుని విశ్వములో ఉన్న దేవతలందరూ ఉపాసించుచున్నారు. ఇచ్చట "వామన" అని చెప్పబడినది పంచవాయువుల ఉత్పత్తికి కారణమైనది ప్రాణచేతనమే. ఈ ప్రాణుడు మధ్యలో కూర్చున్నాడు అనగా భ్రూమధ్యము నుండి బ్రహ్మరంధ్రము క్రింది భాగములో అనగా సుషుమ్నలో అని తెలిసికొనవలెను. తాను కూర్చున్న స్థలము నుండి బ్రహ్మరంధ్రము వరకు ఆత్మ ఉండు స్థలము వరకు ఈ ప్రాణశక్తి చేరవలెను. అపుడు ప్రజ్ఞ మెలకువ అగుచున్నది. ఇదే యోగస్థితి. అయితే ఇది ఏవిధముగా సాధ్యము ? మనస్సు వలననే కేవలము సంకల్పము వలన సాధ్యము కాదు. ఈ ప్రాణుడు ఊర్ధ్వగమనమునకు బలము చేకూరవలెను. ఈ ప్రాణుడు అశనాధారి. అయితే అశనము అనగా స్థూలహారము కాదు. దీనిని పంచాగ్ని పూజవలన అనగా పంచాగ్ని హోత్ర అనగా పంచవాయువులను కలిపే ప్రాణ పానగతిలో దేహమునందు మూడు గతులతో మథించవలెను. ఈ మథనములో వాయువు యొక్క శుద్ధసారమైన "అశనము" అను సూక్ష్మాంశము పైకి వెళ్లి ప్రాణునిచే గ్రహించబడుచున్నది. ఈ అశనమునే "పృథివ్యాం పుణ్య గంధోస్మి" పృథివిలో ఉత్పత్తియైన పుణ్యగంధమని చెప్పబడినది. సాధన చేసినచో ఈ అనుభూతి తెలియనగును.

"గంధద్వారాన్ దురాధర్షాన్ నిత్య పుష్టాం కరీషిణీం
ఈశ్వరీం సర్వభూతానామ్ తామిహోప అశ్వయేశ్రియం॥"

(శ్రీ సూక్తము – ఋగ్వేదము)

అనగా సర్వత్ర వ్యాప్తమై గూఢముగా ఉన్న విభూతి (గంధం) ద్వారాన్ని తెలుసుకొన్నచో శాశ్వతమైన చైతన్యాన్ని తెలియజేస్తుందని

చెప్పబడినది. గంధము అనగా అశనమని తెలిసికొనవలెను. ఈ గంధమును ప్రాణుడు గ్రహించినపుడు ఆ ప్రాణునికి బలము చేకూర్చబడి ఊర్ధ్వగమనము ప్రాప్తించి బ్రహ్మరంధ్రములో ఉన్న ఆత్మను (ప్రత్యగాత్మ) చేరినపుడు యోగస్థితి కలుగుచున్నది. కేవలము వాయు మథనమే యోగము కాదు. మరియు కేవలము మానసిక చింత, చింతనములు యోగక్రియ కాదని మన గురువులు అన్నారు.

బ్రహ్మరంధ్రములో ఉన్న ఆత్మనితో ప్రాణప్రతిష్ఠుడైనపుడు అనుభవమయ్యేది ఆనందమన్నారు. దీనినే సుఖప్రాప్తి అన్నారు.

4. మనస్సును ఏది బంధించుచున్నది ?

"తన్మనో దిశం దిశం పతిత్వాన్యత్రాయతన
మలబ్ధ్వా ప్రాణ మేవోపశ్రయతే
ప్రాణబంధనం హి సోమ్య మన ఇతి"

(ఛాందోగ్య -6-8-2)

మనస్సు నల్దిక్కులకు వెళ్లి చాంచల్యమునకు లోనై ఎచ్చటనో ఆశ్రయించకుండా ప్రాణాన్నే ఆశ్రయిస్తుంది. మనస్సును బంధించునది ప్రాణమే. అపుడే మనస్సు యొక్క చంచలత తప్పునది. మనస్సు ప్రాణములో లీనమైన తరువాత అంతర్ముఖతలో ఆనందము ప్రాప్తించును.

మనదేహములో బ్రహ్మపురి (బ్రహ్మరంధ్రము) అనే చిన్న కమలం ఒకటి ఉన్నది. అందులో సూక్ష్మమైన స్థానమున్నది. దీనినే ఆకాశం అన్నారు. దీనినే కొంతమంది దహరాకాశం అన్నారు. ఇందులో ఏమున్నదని తెలిసికొనవలయును. దీనిని తెలిసికొను సాధనమైన ప్రాణవిద్యను దహరవిద్య అని పిలిచియున్నారు. ఇచ్చట కమలమని చెప్పిన దానిని "సహస్రార" మని కొందరు చెప్పియున్నారు. అంతరాకాశములో



(బ్రహ్మరంధ్రములో) ఆత్మ ఉన్నది. ఈ ఆత్మ పాపరహితుడు ఐనను ఇతడు మాయావృతుడై అజ్ఞానములో ఉన్నాడు. ఇతడు స్త్రీకాదు. పురుషుడు కాదు.

5. జీవి దేని వలన జీవించుచున్నది ?

"న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన
ఇతరేణతు జీవంతి యస్మిన్నేతా వుపాశ్రితౌ॥"

(కఠోపనిషత్తు -2-5-5)

జీవి ప్రాణవాయువుతో గాని అపాన వాయువుతోగాని బ్రతుకలేదు. ఈ రెండు దేని ఆశ్రయములో ఉన్నవో దాని (ప్రాణము) బలమునుండి చెప్పబడినది. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానమని పిలువబడు పంచవాయువులు ప్రాణచేతనము నుండే ఉద్భవించినవి. "ప్రాణాద్వాయు రజాయతే" భూత ధాతువుల నుండి ఆ వాయువులు దేహము నందు ప్రాణమున్నంతవరకు మాత్రము దేహయంత్రాన్ని నడుపుచున్నవి. కాని దేహములను బ్రతికించు శక్తి దీనికి లేదని తెలిసికొనవలెను.

6. మనస్సు విషయమై మహర్షుల అభిప్రాయము తెలియ జేయుము?

మనస్సునకు వికల్పము (చాంచల్యము - భ్రాంతి) లేక "సంకల్పస్థితి"కి రావలయునన్న ఇంద్రియ మూలకముగా ఆకర్షణ తప్పుకొనుట అవసరము. అందుకు వాయుసేవనయే (ప్రాణా యామము) సాధనము. బంధానికి మోక్షానికి మనస్సే కారణమని చెప్పియున్నారు. మనస్సును క్రింది స్థాయిలో మనేంద్రియమని పై స్థాయిలో మనస్తత్వమని చెప్పిరి. ఈ విధముగా చెప్పుటకు కారణమేమనగా ఇంద్రియలిప్తమైనపుడు బంధనానికి, ఆ లిప్తతనుండి విడివడిన తర్వాత సర్వాన్ని తెలిసికొని మోక్షానికి కారణమగునని మన గురువుగారు చెప్పియున్నారు. ఇచట మనస్తత్వ మనగా జ్ఞానశక్తి. ఆత్మ యొక్క ప్రధానశక్తి.

"మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః
మనః షష్ఠానీంద్రియాణి ప్రకృతి స్థాని కర్షతి॥"

(భగవద్గీత – అధ్యా. 15–శ్లో. 7)

ఆత్మనే (ప్రత్యగాత్మ – మానవదేహమునందున్నది) జీవభూతం అన్నారు. మనస్సును వృత్తిపరంగా ఆరవ ఇంద్రియమన్నారు (ఐరినిశినీ రీలిదీబీలి). ఈ మనస్సు అన్ని ఇంద్రియాలను స్వాధీనంలో ఉంచుకొని ఆడించుచున్నది. మన దేహము నందలి ఆత్మ ప్రాణాన్ని శరీరాన్ని నియంత్రిస్తుంది. "ప్రాణ శరీరనియతా ప్రతిష్ఠితోన్నే హృదయం సన్నిధాయ" అనగా ఈ ఆత్మ బ్రహ్మరంధ్రములో ఉండును.

7. స్వధన మనగా నేమి ? ఇది మానవులకు ఏ విధముగా ఉపయోగపడుతుంది ?

"స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః"

(భగవద్గీత – అధ్యా. 3 – శ్లో. 35)

అశనోత్పత్తి (ంచిళిదీలి జిరిదిలి) మన దేహములో వాయుమథనము వలన కలుగుచున్నది. ఇది కేవలము మానవులకు మాత్రం సాధ్యము. ఇతర ప్రాణులకు అశనోత్పత్తి తమ దేహము నుండి కాక బయట ఉన్న వాయువుపై ఆధారపడవలసి యున్నది. అందువలన మానవులకు ఇది పరధర్మం. కావున దీనిని ఆశించకూడదని ఋషులు అన్నారు. వాయు మథనం నుండి తన దేహములోనే అశనోత్పత్తి చేసికొనుసాధనమునకు ప్రాణవిద్య అని చెప్పబడినది. దీనిని తెలిసినవారి వద్ద నుండి పొంది అభ్యసించవలెను. శబ్దములతో ఎంత వర్ణించినను సాధ్యముకాదు. బోధపడదు. ఈశావాస్య ఉపనిషత్తులో ఈ విషయమై వివరించబడినది.



"ఓం ఈశావాస్య మిదం సర్వం యత్కించజగత్యాం జగత్
తేన త్యక్తేన భుంజీథా మాగృధః కస్యస్విద్ధనమ్ ।
కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతం సమాః
ఏవం త్వయి నాన్యథేతోస్తి నకర్మలిప్యతే నరే॥"

పరశ్రేష్ఠుని నుండి వచ్చిన ఈశ, ఈశ్వర అని చెప్పబడిన ఈ చేతనము జగత్తు అంతయు నిండియున్నది. మన దేహమునందు కూడా ఉన్నది. ఇచట స్వధనమనగా వాయు మథనము చేత ఉత్పత్తి అయిన అశనము. ఈ అశనాన్ని తప్ప వేరే దానిని భుజించకూడదు. ఈ వాయు మథనం మానవుడు జీవితాంతము అనగా 100 సంవత్సరములు జీవించి చేయవలెనని భావము. ఇచట ముఖ్యముగా గమనించవలసినది ఏమనగా ముక్తికి కర్మత్యాగము మార్గము కాదు. లిప్తత కాని రీతిలో ఈ కర్మను చేస్తూ 100 సంవత్సరాలు జీవించినచో మోక్షసాధన సాధ్యమని చెప్పబడినది.

ఈ అశనాన్ని స్వీకరించే ప్రాణశక్తి జడమైనది కాదు. ఇది శక్తి యగుటవలన సదా చలించుచున్నది. ఇది మన దేహములో ఏ స్థానము నుండి ఏ స్థానము వరకు చలించుచున్నదను విషయము అనుభవమునకు రావలెనన్న సాధన చేసి అనుభవించవలెను. మన గాఢ నిద్రలో సుషుప్తి అను స్థితిలో ప్రాణము చలించి ఊర్ధ్వగమనము చెంది దేహములో మూర్ధ్నము (బ్రహ్మరంధ్రం) అను స్థానమును చేరును. మరల అచ్చటి నుండి క్రిందకు దిగివచ్చిన తర్వాత మనకు స్వప్న స్థితి కాని, మెలకువస్థితి గాని కలుగును. గాఢ నిద్రలో పని చేయుటకు గమనించుటకు ముఖ్యమైన మనస్సునకు మెలకువ లేనందువలన ఈ ప్రాణశక్తి చలనము తెలియదు. కాబట్టి ఆ ప్రాణశక్తి చలించదు అని సామాన్యుల దృష్టిలోచెప్పుచున్నాము.

ఈ ప్రాణము మన దేహములో ఉన్న జీవాత్ముల సమీప స్థితిలో ఉన్నట్లుగా ఉంటున్నది. అయినను మెలకువ లేనందువలన అది తెలియబడదు. కావున అది దూరముగా ఉన్నదని భ్రమించుచున్నాము. దేహములో జీవాత్ముని స్థానము బ్రహ్మరంధ్రమని యోగ విద్యా సాధనలో అనుభవము నుండి తెలిసికొనవలెను. యోగ విద్యలో సాగి అనుభవము నుండి ఉపనిషత్ ఋషులు ప్రాణుని గమన విషయమై చెప్పియున్నారు. ఆ విద్య తెలియని వారికి ఉపనిషత్తు వాకార్థములు ఎట్లు తెలియును? కావున విద్య తెలియనివారు గ్రంథ పాండిత్యముపై ఆధారపడి ఒక్కొక్కరు ఒక్కొక్కరీతిగా బోధించుటవలన అనేక మార్గములు ఉన్నవనడానికి కారణమైనదని మన ప్రభువులు విశదీకరించినారు. ఇట్టివారి సంఖ్య ఎక్కువై భ్రమలోపడి, కొన్ని సంవత్సరాల క్రితమే తెలిసికొన్న మహనీయులు కలికాలములో నిజమైన విషయములు ప్రజానీకానికి పలుమార్లు చెప్పినను విను వారుండరని శ్రీ విజయీంద్రులవారు వాపోయినారు. ఇక గత్యంతరం లేక రుద్రదేవా నీవు మూడవకన్ను తెరిచి ఇట్టి వారిని భస్మీపటలం చేస్తేనే తత్త్వస్థాపనకు భంగము వాటిల్లదని దేవుని ప్రార్థించినారు.

8. రతనాభి అనగా నేమి ? అది మనదేహములో ఎక్కడ ఉన్నది?

ఉపనిషత్‌లో ఋషులు ప్రాణుని నివాసస్థానము శరీర శాస్త్రజ్ఞులు చెప్పిన హృదయము (Heart) కాదు. ఎక్కడ దేహమందలి నరనాడులు చేరునో అది సుషుమ్న స్థానము. మెదడు మధ్యలో ఉన్నది. దానినే రతనాభి అని అందురు. బండి చక్రములో మధ్యలో ఉండు కుంబి (చక్రములో ఆకులు చేర్చబడిన స్థానము) సామాన్యముగా చెప్పు వాయువుగాక దీని జనకశక్తి ప్రాణము ఈ హృదయ స్థానములో ఉన్నదని చెప్పబడినది. ఇది పంచవాయువుల కంటె భిన్నమైనది. ముఖ్యప్రాణుడని చెప్పియున్నారు.



వాయుమథనము వలన ఉద్భవించు అశనమును బ్రహ్మ రంధ్రము నుండి సుషుమ్న స్థానము వరకు సంచారమున్న ప్రాణుడు స్వీకరించు చున్నాడని సాధనలో తెలియనగును. ఈ విధముగా సాగునపుడు అశన స్వీకారము నుండి పరిపుష్టు డైన ప్రాణచేతనము పైకి ఎక్కుచూ తన మూలస్థానమైన బ్రహ్మరంధ్రములో ఉన్న అధిష్ఠాన చేతనమైన ఆత్మతో చేరినపుడు అమృతపానమై ఆనందానుభవ మగును. ఈ ఆనందాను భవమును అమృతపానమును మహర్షులు యోగమని చెప్పలేదు. దీనిని ఆత్మ సహజావస్థ అన్నారు. యోగము అనగా గీతలో "సమత్వం యోగ ముచ్యతే" అన్నారు. యాజ్ఞవల్క్య మహర్షి "సంయోగ యోగ ఇతి ఉక్తో జీవాత్మ పరమాత్మనో" అని చెప్పబడినది. అనగా మానవ దేహమందలి జీవాత్మ పరమాత్మతో కలియుట అని అర్థము. ఇది ప్రాణవిద్యా సాధనవలన గాని తెలిసికోలేమని మన గురువుగారు విశదీకరించినారు.

9. గురుస్థానము మనదేహములో ఎచ్చట ఉన్నది ? వివరింపుము.

మనదేహమందలి ప్రాణుని గురువు అన్నారు. మనదేహములో గంట ఆకారమువలెనున్న ఒక స్థానము నుండి అనగా కొండనాలుకపై భాగమును గురుస్థానము అన్నారు. ఇది వాయువును మథించు స్థానము. భ్రూమధ్యము క్రింది నుండి కన్ను, చెవులు, ముక్కు, శ్వాసకోశం వగైరా వరకు ఉన్న వాయువులను పంచవాయువు లన్నారు. పంచవాయువుల క్రియలను బట్టి వాటికి ఆ పేరు వచ్చింది.

10. తనను తాను తెలిసికొనుట అనగా నేమి?

స్వరూప జ్ఞానము Know Thy Self అని అనుచున్నారు. ఇది ఆత్మానుభూతిని పొందినపుడు తెలియనగును. భక్తియే ముక్తి మార్గమని మధ్వాచార్యులు బోధించియున్నారు. వారు భక్తి యనగా స్వస్వరూప

జ్ఞానయుక్తమైన పరమాత్ముని విషయమైన స్నేహమని నిర్వచించియున్నారు. మన దేహములో ప్రవేశించిన కొన్ని ప్రకృతి దోషములు లేనపుడు అనగా మమకారం, అహంకారం వగైరా లేనపుడు మాత్రమే ఆత్ముని సహజత అనుభవమగును. దీనినే స్వరూప జ్ఞానమని ఆధ్యాత్మ అనుభవమగును. ఈ అనుభవము కలుగుటకు యజ్ఞము చేయవలెను. భగవద్గీతలో "యజ్ఞ క్షపిత కల్మషః" అని చెప్పబడినది. కల్మషములను నాశనము చేయునది యజ్ఞము అన్నారు. యజ్ఞము అనగా ఇచట ప్రాణయజ్ఞమని తెలిసి కొనవలెను. అనగా జపము చేయవలయును. ఈ కల్పషములను నాశనము చేయు యజ్ఞం యొక్క చివరి స్థితిలో (సమాధి) ప్రాణము ఆత్మలో చేరినపుడు, అమృతం ఉత్పత్తియై, దేహమంతయు వ్యాప్తి చెంది, సాధకుని మృత్యువు నుండి దూరము చేయుచున్నది. అనగా ఇచ్ఛామరణస్థితి పొందవచ్చును. దేహత్యాగానంతరము శాశ్వతమైన బ్రహ్మలో చేరునని వివరించబడినది.

11. అశనము – అన్నము దీనిని పరబ్రహ్మ స్వరూపమని ఎందు కన్నారు? వివరింపుము.

ఉపనిషత్ ఋషులు, అన్నాన్ని అనగా అశనాన్ని ఉదాసీనం చేయగూడదని అన్నారు. ఇది పరబ్రహ్మ స్వరూపమని అన్నారు. శరీరానికి బలము చేకూర్చునది ప్రాణశక్తి. ఈ ప్రాణశక్తి శరీరములో వసించుచున్నది. దీని ఆహారం అశనం. బైబిల్‌లో ఈ అశనాన్ని మన్నా అన్నారు. దేహములో వాయు మథనము వలన ఇది ఉత్పత్తి యగుచున్నది. ఇది కూడా వాయు రూపమే. ఇది తక్కువైనచో శరీరం నీరసిస్తుంది. కావున ఈ శరీరం ప్రాణముల పరస్పర సంబంధాన్ని తెలిసికొని అశనాన్ని సమృద్ధిగా చేసికొని ఆ ఫలితాన్ని పొందవలెనని మన గురువుగారు తెలియజేసియున్నారు.



సృష్టి ఆదిలో ఈ అన్నం ఆప్ (నీరు) నుండి ఉద్భవించినది. ఇప్పుడు కూడా విద్యలో సాగువారు మొదట దేహములో ఆప్ ఉత్పత్తి ఎక్కువ అయిన తర్వాత దేహములో అశనోత్పత్తి అగుచున్నది. ఇది అనుభవములో తెలియనగును. ఈ అశనాన్ని తేజస్సు గ్రహించి (దేహము నందు గల విద్యుత్) ప్రాణునిలో చేరును. కాబట్టి జ్యోతి యందు ఈ అశనము ప్రతిష్ఠితమని ఉపనిషత్కారులు చెప్పియున్నారు. ఈ అగ్ని నుండి ఆప్ తత్త్వము మన దేహములో ఉత్పత్తి యగుటవలన జ్యోతిలో ఆప్ ప్రతిష్ఠితమని ఉపనిషత్తుల యందు వివరించబడినది. కావున సాధన చేయువారు శ్రేష్ఠులగుచున్నారని ఉపనిషత్కారుల నిర్ణయము. స్థూలాహారము అతిథులకు, సూక్ష్మతః అశనము తనకు అన్నారు పూజ్యులు. అందువలననే ఈ అశన స్వీకారం చేయువారు సుఖాలను అనుభవిస్తున్నారు. 'అన్నదాతా సుఖీభవ' అన్నారు.

12. భగవద్గీతలో సాధనాపరముగా వివరించిన విషయములు తెలియజేయుము? (అధ్యా. 18–శ్లో. 61)

గీతలో "ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి" అని హృదయములో ఉన్నట్లు చెప్పబడినదే కాని ప్రాణము అని చెప్పలేదు. ఈ ప్రాణమెచ్చట నున్న విషయాన్ని చెప్పలేదు. అయితే ఈక్రింది శ్లోకములో

"సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ
మూర్ధ్న్యా ధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్"
(అధ్యా. 8 –శ్లో. 12)

సర్వద్వారములను సంయమించి మనస్సును హృదయము నుండి నిరోధించి అనగా ప్రతిష్ఠించి ప్రాణాన్ని ఆత్మవద్దకు మూర్ధ్నములో చేర్పించినచో యోగధారణ మగునన్నారు అని అర్థమగుచున్నది.

ఈ శ్లోకానికి వ్యాఖ్యాతలందరు మనస్సును హృదయములో నిలిపి అనే అర్థాన్ని వ్రాసిరి. కానీ హృదయం నుండి మనస్సును నిరోధించవలెనని వ్రాయలేదు.

13. మనస్సును హృదయమునందు ఉంచిన ఏమగును?

"భ్రామయన్ సర్వభూతాని యంత్రారూఢాని మాయయా" అన్నట్లు మాయాజాలానికి దొరికి భ్రమకు లోనగునదే సత్యము. మోహస్థితి నుండి ప్రాజ్ఞస్థితిని పొందవలెనన్న ప్రాణము మూర్థ్నములో ఉన్న ఆత్మను చేరవలెను. అయినా ప్రాణుడు వాయువుకాదు.

14. పంచ ప్రాణాలు అని చెప్పబడుచున్నవి ఏవి ?

ప్రాణము కాక దేహములో ఇవి వేర్వేరు భాగములందు సంచరించు వాయువులు. ప్రాణునకు మాతరిశ్వన అనగా వాయువునకు తండ్రివంటివాడని ఉపనిషత్తులలో చెప్పబడినది. హృదయములో సంచరించునది ఒక భాగమైన వాయువని తెలిసి కొనవలెను. కావుననే ప్రాణాన్ని ముఖ్య ప్రాణమని ఉపనిషత్తులలో చెప్పబడినది. గీతలో హృదయములో ఉన్నవాయువును ఈశ్వర అని చెప్పుటవలన అది ప్రాణము కాదని తెలిసికొనవలెను. దేహములో తాను కూర్చున్న స్థలం నుండి బ్రహ్మరంధ్రము వరకు గల మధ్యస్థానములో ప్రాణుని సంచారమని కఠోపనిషత్తునందు తెలియజేయబడినది. అనగా భ్రూమధ్యము వెనుక భాగము నుండి బ్రహ్మరంధ్రము వరకు గల స్థానము ప్రాణుని సంచార స్థానము.

15. అమృతప్రాప్తి ఇచ్ఛా మరణమును గూర్చి విశదీకరింపుము?

"ప్రతిబోధ విదితం మత మమృతత్వం హి విందతే
ఆత్మనా విందతే వీర్యం విద్యయా విందతేఽమృతమ్ ॥"

(కేనోపనిషత్తు – 2-4)



జ్ఞానము సత్యదర్శనము నుండే అగును. శాశ్వతమైన బ్రహ్మ దర్శనము అయినపుడు అతని తనువు ప్రతిబింబించినపుడు ప్రతిఫలించి అనుభవానికి వచ్చి జ్ఞానమగుచున్నది. దీనినే ప్రతిబోధ అనుచున్నారు. ఆత్మ నుండే వీర్యము జ్ఞానము ప్రకటనాశక్తియు ప్రాప్తమగుచున్నది. విద్య నుండి ప్రాణ మనోమిలనము యోగ విద్య నుండి అమృత రసము ఉత్పన్నమై ఇచ్ఛా మరణము అగుటకు సాధ్యమగును. ఈ లోకములో దీనిని తెలిసికొని ఆచరించినచో సత్యమైనట్లు. ఈ జన్మలో తెలిసికొనక పోయినచో మహానష్టానికి గురికావలసి వస్తుంది. పూర్వము అమృతతత్వాన్ని పొందిన ధీరులు ఈ విషయాన్ని తెలిసికొని సాధించి ఈ మృత్యులోకాన్ని వదలి వెళ్లిన తర్వాత అమృతతత్వాన్ని పొందిరి.

అన్ని ప్రాణులకంటె మానవప్రాణి ఒక్కటే ఈజ్ఞానాన్ని పొందుటకు సాధ్యమని, ఈ భూలోకవాసులకు మాత్రమే సాధ్యమని వేరొక లోకాలలో ఇది సాధ్యము కాదని గ్రహించవలసిన అంశమని ఉపనిషత్తు మహర్షులు చెప్పియున్నారు. ఈ రీతిగా తెలిసికొని సాధించినవారు అన్ని పాపములను అంతము చేసికొని స్వర్గలోకానికి చేరుకొనుచున్నారు. ఇచట స్వర్గలోక మనగా సువర్ణలోకము కాదు. జీవాత్ముడు తాను ఆదిలో ఎచ్చటనుండి వచ్చెనో ఆ స్థానాన్ని (బ్రహ్మలోకము) చేరును.

16. పండితులు – పాండిత్యము – సాధన అనుభవాల గూర్చి శ్రీ అచ్యుత గురువుగారి అభిప్రాయము ఏమి?

ప్రభువులు వారి అర్థములో వేదమనగా జ్ఞానము అన్నారు. జ్ఞానము మాత్రము ఈ విషయమై తెలిసికొన్నవారు వాటినే వేదములన్నారు. జ్ఞానము విషయమై వివరణ విషయమై జ్ఞాన సాధనమైన సాధనము దీనికి కావలసిన నియమాలు ఇత్యాదులు అందులో ఉండుట వలన

యోగ విద్యను ప్రాణవిద్య అమృతవిద్య అని ప్రభువులు విశదీకరించి యున్నారు. కావుననే వేదవిద్యా స్థాపన చేయవలసినదిగా ఆశ్రమములో ప్రార్థించుచున్నాము. ఈ విద్యను ఏ విధముగా అభ్యసించవలెనని యముడు నచికేతునకు బోధించినాడని తెలిసికొనవలెను.

"త్రిణాచికేత స్త్రిభి రేత్య సంధిం త్రికర్మ కృత్తరతి జన్మ మృత్యూ
బ్రహ్మ జజ్ఞం దేవ మీడ్యం విదిత్వా నిచా య్యేమాం శాంతి మత్యంత మేతి॥"

(కఠోపనిషత్తు -1-17)

ఇచ్చట మూడు అగ్నులను పెట్టి(ఆహవనీయము, దక్షిణాగ్ని, గార్హపత్యము) ఈ మూడు కర్మలను (జ్ఞానము, అధ్యయనము, అనుష్ఠానము) తెలిసికొని యజ్ఞ జ్ఞాన దాన కర్మలో ఉన్నవారు జన్మ, మృత్యువులను జయించుచున్నారని ఉపనిషత్ మహర్షులు తెలియ జేయుచున్నారు.

అయినా స్థూలమైన అగ్ని పూజలవలన గాని యజ్ఞ, జ్ఞాన, దాన, కర్మలవలన గాని గ్రంథముల యందు చెప్పిన విషయమై జ్ఞానము లేని అనుష్ఠానముతో ఏ పూజ అయిననూ, మంత్ర, తంత్రముల నుండి ఏ కర్మ అయిననూ జన్మ మృత్యువులను దాటించ లేవు. అదే విధముగా శాంతిని పొందుట కూడా సాధ్యముకాదని ప్రభువులు అన్నారు.

అందువలన ఇచ్చట "త్రిణాచికేతః త్రిభిరేత్య" అనునది మన దేహములో ఉపాసించవలసిన విద్యాక్రమాన్ని ఈ విధముగా చెప్పబడినది. మూడు అగ్నులు అనగా ప్రథమములో వాయు మథనము వలన ఉత్పత్తి అయిన అగ్నిశాఖ. రెండవ స్థితిలో ఈ శాఖయే ఊర్ధ్వముఖముగా తీవ్రమై విద్యుత్ కాబడి వివిధరూపులను పొందు విద్యుదగ్ని. మూడవ స్థితిలో ఈ వాయువునకు అగ్ని శాఖ విద్యుత్ వలన మూలమైన ప్రాణాగ్ని



యొక్క ఊర్ధ్వగమనము. అది మూర్ధములో (బ్రహ్మరంధ్రము) చేరిన తరువాత మృత్యువునుండి బయటపడే ఇచ్ఛామరణ స్థితి ప్రాప్తమగును. ఈ మూడింటిని సమర్పకముగా చేయుటవలన జీవాత్మ ఐక్యత పొంది మనలో కలుగు జ్ఞానాగ్ని వలన ఆత్యంతిక శాంతిని (మోక్షం) పొందుట సాధ్యమని ఉపనిషదృషులు అన్నారు.

ఈ విద్యాభ్యాసమునకు కావలసిన త్రిసంధులు 1) ప్రదోష కాలము – సూర్యాస్తమయము తరువాత 2) రాత్రి పరుండుటకు ముందు 3) తెల్లవారుజామున బ్రాహ్మి ముహూర్తములో

ఈ విషయము తెలిసికొనుట అవసరము. వీటినే రుద్రగతి, విష్ణుగత, బ్రహ్మగతులన్నారు. అనగా హెచ్చు శబ్దముతో దీర్ఘగతి, మధ్యగతి శబ్దముతో speed, తరువాత నిశ్శబ్దము. "బ్రహ్మజజ్ఞము" అనగా విశ్వానికి మూలాధారమైన ప్రాణశక్తి అని అర్థము. ఈ ప్రాణశక్తిగా ఆదిదేవుడైన పురుషుడు అని తెలిసికోవలెను అన్నారు.

17. ఆత్మని అంతఃకరణములు, బహిఃకరణములను గూర్చి వివరింపుము?

భగవద్గీత 7వ అధ్యాయము విజ్ఞాన యోగములో
"భూమి రాపో–నలో వాయుః ఖంమనోబుద్ధి రేవచ
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా॥" 4శ్లో.

గీత యందు ప్రకృతిని గురించి చెప్పినపుడు స్థూల ప్రకృతి అనగా జడ ప్రకృతిని గురించి వివరించడమైనది. భూమి, నీరు, అగ్ని, అనగా జడ వాయువు, ఆకాశము, మనస్సు, బుద్ధి, అహంకారము, ఈ ఎనిమిది ప్రకృతి అని చెప్పబడినది. అనగా అపరా ప్రకృతి దేహములో స్థూలేంద్రియములు, కర్మేంద్రియములు, బ్రహ్మేంద్రియములు, జ్ఞానేంద్రియములు

అన్నియు ఆత్మని బహిః కరణాలు. ఇవి ఆత్మ నుండి బయట ఉండును. ఇవి ఆత్మని కార్యానికి సహకారమైనవి. అయితే మనస్సు, బుద్ధి, చిత్, అహంకారములు ఇవి కూడా ఆత్మని పనికి సహకారములే. అయినా లోపల ఉండునవి అంతః కరణాలన్నారు. మనస్సు, బుద్ధి, అహంకారములను స్థూల ప్రకృతిలో చేర్చుటకు కారణము ఏమిటి?

"అపరేయ మితస్త్వన్యాం ప్రకృతిం విద్ధి మే పరామ్
జీవభూతాం మహాబాహో యయేదం ధార్యతే జగత్"
(భగవద్గీత -అధ్యా.7 - విజ్ఞానయోగం - శ్లో.5)

ఇది పరా ప్రకృతి. దాని కంటె భిన్నమైన జీవభూతము నా యొక్క పరాప్రకృతి. అందువల్లనే ఈ జగత్తు ధరించబడినది. ఈ విషయాన్ని అనగా "జీవభూతాన్ని" పరా ప్రకృతిలో చేర్పించు కారణమే మన పండితులకు సాధ్యము కాదన్నారు. దీనికి ఆత్మానుభవము కావలెనన్నారు. ఆత్మనకు "జీవభూతానికి" ఇంద్రియ లిప్తత ఉన్నంత వరకు తాను అనే అహంకారముండును. అందువలన ఇది చేయవచ్చును, చేయకూడదు అను విచారశక్తి యుండును. ఇంద్రియ లిప్తత నుండి విడబడిన తరువాత అంతర్ముఖమై ఆత్మని సహజావస్థ అనుభవమైన తరువాత అచ్చట కేవలము "చిత్‌శక్తి" ఉన్న చోటునే ఉండి క్షణమాత్రములో అన్నింటిని తెలిసికొనుశక్తి కలుగును. తక్కిన మూడు ఇచ్చట విచారశక్తి తాను పెద్దవాడనే గర్వము (అహంకారము) ఆత్మనికి ఇంద్రియ మూలకముగా ఈ త్రిగుణాత్మకమైన స్థూలప్రకృతిలో ఉన్నపుడు మాత్రము అనుభవము నుండి తీయగలదు. బుద్ధి వివేకాన్ని సాత్వికమని, మనస్సు (ఆశ) రాజసమని, గర్వమును (అహంకారము) తామసమని ఈ విధముగా ప్రకృతి లిప్తత కలిగినపుడు ఆత్మ ప్రకృతి గుణములే త్రిగుణములతో కూడి యున్నారనుచున్నారు.



బ్రహ్మవిదుడు బ్రహ్మవలె అగుచున్నాడని పెద్దలు చెప్పియున్నారు. కావున గీతలో అర్జునునకు "నీవు గుణాతీతుడవు కమ్ము" అను బోధ ఉన్నది. ఈవిధముగా అనుభవము రావలెనన్న అంతర్ముఖములో మాత్రము సాధ్యమన్నారు మన గురువులు. శ్రీ గురువులు దీనికి "ప్రాణవిద్య" ఒక్కటే సాధన మన్నారు.

18. త్రిగుణములు గురించి తెలియజేయుము ?

"సత్త్వం రజ స్తమ ఇతి గుణాః ప్రకృతి సమ్భవాః
నిబధ్నన్తి మహాబాహో దేహే దేహిన మవ్యయమ్ ॥"
(భగవద్గీత - గుణత్రయ విభాగము - అధ్యా14.శ్లో.5)

సత్వగుణము, రజోగుణము,తమోగుణము అనునవి త్రిగుణములు. ఇవి ప్రకృతి వలన పుట్టినవి. జీవుని బంధించు చున్నవి ఈ గుణములే.

1. సాత్విక గుణము: ఇవి ముఖ్యముగా జ్ఞానప్రదము. శాస్త్ర విహితము, ఫలాపేక్షరహితము, నిస్సంగము, రాగద్వేషరహితము అయిన కర్మ సాత్విక కర్మ అనబడుతుంది. ఈ గుణమువలన హృదయం ప్రశాంతంగా ఉంటుంది. అహంకారం ఉండదు. సాత్విక కర్మలు సదా స్థిరమైన ఆనందాన్ని కలిగిస్తాయి. ధైర్యము, ఉత్సాహము కలిగి, జయాపజయములందు వికారములు పొందక ఉండునతడు సాత్విక కర్త అనబడును. ప్రవృత్తి మార్గమును, నివృత్తి మార్గమును, కర్తవ్యము, అకర్తవ్యమును; భయము, అభయములను, బంధము, మోక్షములను; తెలియు బుద్ధి సాత్వికబుద్ధి అనబడును. ఈ గుణము కలవారు మంచి విచక్షణా జ్ఞానము, మంచి సంస్కారము, ఆధ్యాత్మిక సాధనలో మంచి అవగాహన, దేనికీ చలించని స్వభావము, నిగ్రహశక్తి కలిగయుందురు. ప్రారంభమున విషమువలెనుండి, అంతమున అమృత తుల్యముగ ఉండు

సుఖము సాత్త్విక సుఖము అనబడును. ఆత్మ నిగ్రహము, ఆత్మశిక్షణ వలన కలుగు సుఖము సాత్వికము.

2. రజోగుణము : కోరికలతో నిండి, అహంకారముతో కూడి శ్రమ కలిగేటట్లు చేసే కర్మ రాజస కర్మ అనబడుతుంది. కర్మఫలాపేక్ష కలవాడు, మోహావేశుడు, హింసాప్రవృత్తి కలవాడు, శౌచం లేనివాడు, హర్ష, శోకాలతో కూడినవాడు రాజసకర్త అనబడును. ఈ గుణముగల వారికి క్రోధము, ఆవేశము, భోగలాలసత్వము, ధనాపేక్ష అధికము. కీర్తి కాంక్ష అధికము. వీరు ధైర్యము కలిగి యుంటారు. అధికార ఆధిపత్యము కలిగియుండుటకు, ధనార్జనకు పాటుబడుతుంటారు. ధర్మాన్ని, అధర్మాన్ని; కార్యాన్ని, అకార్యాన్ని, ఏది విపరీతంగా తెలుసుకుంటుందో అది రాజసబుద్ధి. ఈ బుద్ధివలన ధర్మాధర్మాలు యథార్థముగా తెలియజాలవు. విపరీతముగా తెలియబడును. ధర్మార్థ కామాలలో ధైర్యం కలిగి ఉండటం రాజసధృతి అవుతుంది. రాజస ధృతి గల వ్యక్తి ధర్మమును, అర్థమును, కామమును మిక్కిలి ఆసక్తితో ఫలాపేక్షతో ఆచరించుచుండును.

3. తమోగుణము : ఒక కర్మను ఆరంభించినపుడు దానివలన కలిగే ఫలితాన్ని గాని, కష్ట నష్టాలను గాని, తన శక్తి సామర్థ్యాలను గాని చూచుకొనక మోహముతో గ్రుడ్డిగా చేసే కర్మ తామస కర్మ అనబడును. తొందరపాటు, అలసత్వము, అధికనిద్ర, మూర్ఖపు పట్టుదల, అజాగ్రత్త, నిర్లక్ష్యము, నిగ్రహము లేకపోవుట, తమోగుణ లక్షణాలు. అజ్ఞానంతో అధర్మాన్ని ధర్మమని భావించడమే కాక, విషయాలను విపరీతముగా అర్థము చేసుకొనే బుద్ధిని తామస బుద్ధి అంటారు. ఈ బుద్ధిగలవారు వివేకశూన్యులై, అశాంతికర జీవనము కలిగియుందురు.

ఆత్మకు ఈ గుణములు లేవు. ఆత్మ నిర్గుణుడు, గుణాతీతుడు. జీవుడు ప్రయత్నముచేత, అభ్యాసము చేత ఈ త్రిగుణములను దాటి



క్రమముగా గుణాతీత ఆత్మస్థితిని పొందవలెను. ఈ త్రిగుణములను గూర్చి భగవద్గీత 14వ అధ్యాయము గుణత్రయ విభాగ యోగములోను, 17వ అధ్యాయము, శ్రద్ధాత్రయ విభాగ యోగములోను, 18వ అధ్యాయము మోక్షసన్యాస యోగములోను చెప్పబడినది. 18వ అధ్యాయములో 20వ శ్లోకం నుండి 40వ శ్లోకం వరకు ఈ గుణములను గూర్చియే ప్రత్యేకంగా చెప్పబడి యున్నది. సమగ్రముగా తెలిసికొనుటకు భగవద్గీతను తప్పక పరిశీలించవలయును.

19. ఆత్మ అతీంద్రియము అయినను "బుద్ధిగమ్యం" అన్నారు, వివరింపుము ?

యుక్తాయుక్తతలను విచారణములతో నిర్ణయించు బుద్ధిశక్తి శ్రేష్ఠమన్నారు. ఇదే పరమాత్మను తెలిసికొనుశక్తి అనవచ్చును. కావుననే జ్ఞానులు పూర్ణత్వాన్ని గూర్చి చెప్పునపుడు "బుద్ధిగమ్యం అతీంద్రియం" అన్నారు. ఇది బుద్ధిశక్తి నుండి తెలిసికొనవలసినదే. ఇంద్రియములకు గోచరము కాదని చెప్పబడినది. ఇచ్చట బుద్ధి అనగా స్థూల బుద్ధి కాదు. "బుద్ధేః పరతస్తు సః' తపస్సులో గోచరమగునది. ఆత్మ విషయం వివరిస్తూ స్వామి జయతీర్థులవారు ఈ విధముగా తెలియజేసినారు. ఆత్మ అన్ని ప్రాణుల దేహములో ఉన్నది. ఇది దేహములో ఉన్న ప్రతి అంగాన్ని ఉంచుకొనగలదు. మరియు నాశనము చేయగలదు. ఈ దేహానికి ఆత్మ ఉన్నట్లే ఈ భూతముల మిలనము వలన ఈ జగత్తునకు ఒక ఆత్మ ఉన్నదన్నారు. అదే అన్ని భూతములకు ఉత్పత్తి స్థానము. వీటియొక్క ఉత్పత్తికి మరియు నాశనమునకు కారణము అయినది. జగత్తులో పుట్టు, చావు దేహములో ఉండునది ఆత్మ అయిననూ జగత్తు సృష్టి చేసి నాశనము నొందించు ఆత్మ మానవ దేహములోనిది కాదు. అనగా మానవ దేహము

నందున్న ఆత్మ సూర్య కిరణములోని ఒక్క కిరణము ఎంతపాటిదోమానవ శరీరములోని ఆత్మ కూడ దానిశక్తి పరిమితం అయినది. అందువలననే జ్ఞానులు దీనిని "ప్రత్యగాత్మ" అనియు దీనినే "బ్రహ్మ" మనియు మరియు "జీవాత్మ" అనియు చెప్పియున్నారు. అయితే పరమాత్మ అనంత శక్తియుతమైనదని చెప్పబడినది. విశ్వాత్మ అని కూడా అన్నారు.

"నాయమాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన
యమే వైష వృణుతే తేన లభ్య స్త స్యైష ఆత్మా వృణుతే తనూం స్వామ్॥"
(ముండకోపనిషత్తు 3-2-3)

ఈ విశ్వాత్మ ప్రవచనముల వలన లభించదు. బుద్ధి శక్తి వలన కాని ఇతరుల వలన వినుటవలన కాని దొరకునది కాదు. ఇచ్చట ఆత్మ అనగా దేహములో ఉన్న జీవాత్మ విషయం కాదు. ఈ ఆత్మకు మూలమైన బ్రహ్మ అనగా విశ్వాత్మ అని చెప్పబడినది. ఎవరిపైన ఆయన ప్రసన్నత కలుగునో వారికి మాత్రము ప్రసన్నుడగునని మహర్షులు తెలియజేసినారు. ఈ విశ్వాత్మనే పరమాత్మ, ఈశ్వర, హిరణ్యగర్భ, స్వరాట్ అని ఉపనిషత్ మహర్షులు వివరించియున్నారు. తన అంశమైన జీవాత్మ నివాసమునకు యోగ్యమగు దేహములో ప్రాణశక్తి ఉంటేనే మనుగడ సాధ్యమని ప్రాణాన్ని భగవంతుడు సృష్టించినాడని మహర్షుల అభిమతము. అయితే ప్రజాపతి, సృష్టికర్త అనిపించుకున్న శరీర నిర్మాణానికి కూడా కారణమైన ప్రాణశక్తిని కూడా పరాత్పర పురుషుడని నిత్యదేహములో ఉన్న చేతనాంశము నుండి ఉత్పత్తియై బయటికి వచ్చిన ఒక శక్తి, ఆశక్తి సహజముగా నిత్యదేహములో ఉత్పత్తి అయినది. అందువలన విశ్వాత్మలో సంకల్పము లేదు. అందువలననే అతడు లిప్తుడు కాడు. సదానంది అఖండానంద విగ్రహము అయితే కర్త అనిపించుకొన్న ప్రజాపతి అలాంటివాడు కాదు. ఇతనిలో విచారశక్తి,



సంకల్పము, తపస్సు అన్నియు కలవు. ఇతడు దేవతలందరికి ప్రభువు. పరమేశ్వరుడు, పరమేష్ఠి, పరబ్రహ్మ ఋషి, ఆది పరుషుడు సర్వోత్తముడైనను సర్వ అతీతుడు కాదు. అనాది పురుషుడు కాదు. ఇది బహు తపస్సులకు గోచరమగునది కాదు. సృష్టి యొక్క రహస్యమై మన ప్రభువుగారు వివరించినారు.

ఈ రీతిగా విశ్వనిర్మాణానికి కారణమైన ఈ పురుషునే విరాట్ పురుషుడు అనియు, ఈశ్వరుడనియు ఇతనిలో ఇచ్ఛ జనియించి దానివలన (కామము) శక్తి వ్యాపించి ఇతని మూలకముగా సృష్టి రూపుగాంచుటవలన ఇతనిని పురుషుడనియు, కాముడనియు, జ్ఞానుల పిలిచియున్నారు. ఈశావాస్యోపనిషత్తు నందు ఈ ఆదిపురుషుని పురుషుడనియు, పరమాత్ముడని, పరబ్రహ్ముడని, ఆదిదేవుడని అనేకమంది జ్ఞానులు చెప్పియున్నారు. అతను ఒక్కడే జ్ఞాని యగుటవలన ఆయననే గురువనియు, సర్వశక్తుడగుట వలన ప్రభువనియు, సమత్వము ఇతని ఒక్కని యందే ఎక్కువగా కన్పించుట వలన యోగి యనియు, శాంతి అతని యొక్క సహజత్వము అగుట వలన అతనిని శివ అనియు వర్ణించియున్నారు.

20. బ్రహ్మచర్యము అనగా నేమి ?

పంచ మహాభూతములతో కూడియున్న పృధివికి ఏ విధముగా ఆకాశము ఉన్నదో మానవ దేహములో బ్రహ్మరంధ్రమే ఆకాశము అనిపించుకున్నది. ఇది శుక్రుని స్థానమై షడ్రిపులకు మూలస్థాన మైనది. ఇచ్చట "శుక్లాంబర ధరం" అను శ్లోకము జ్ఞాపకానికి వస్తుంది. తన్ను తాను తెలిసికొంటే విశ్వము యొక్క రహస్యము తెలియనగునని మన ప్రభువులు అన్నారు. మానవదేహానికి సర్వశక్తి అయిన శుక్లాన్ని అతని దేహములో ఉన్నతస్థానము (బ్రహ్మరంధ్రము - అంబరము - ఆకాశము)

ధరించియున్నది. కావున ఈ విశ్వము యొక్క సత్త్వాన్ని అనగా మూలమైన చేతనాన్ని ధరించిన ఒక అంబరము ఉండవలెను. ఆ అంబరము, దానిని ధరించిన వానిని "శుక్లాంబర ధరం" అన్నారు. ఈ రహస్యాన్ని యోగులు ఈ విధముగా వర్ణించియున్నారు.

అయితే మనకు స్థూలంగా కనిపించేవి అరిషడ్ వర్గాలు. అనగా కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాదులు. ఇవి మనస్సునకు వ్యాకులత కలుగజేయుచున్నవి. ఆత్మయే మనస్సునకు మూలము. షడ్రిపుల విషయమై కొంతమంది తప్పుగా తెలిసికొనుచున్నారు. కామము అను శబ్దానికి తప్పు అర్థములు కల్పించుకొని దీనిని ఒక్కదానిని గెలిచినచో ఉత్తమమనే భ్రాంతిలో పడి అవివాహితులై యున్నారు. ఆహార నియమములు సక్రమముగా తెలియనివారు ఉపవాస వ్రతములు చేయుచు దేహాన్ని నీరసింపజేసికొనుచున్నారు. షడ్రిపులకు ప్రతి ఒక్కదానికి శుక్రుడు ఆధారముగా ఉన్నాడు. కావున వీటన్నింటిని ఏకరీతిలో ఉంచునది బ్రహ్మచర్యమని గురువుగారు తెలియజేసినారు.

"ఇంద్రియాణి మనోబుద్ధి రస్యాధిష్ఠాన ముచ్యతే
ఏతై ర్విమోహయత్యేష జ్ఞాన మావృత్య దేహినమ్ ॥"

(భగవద్గీత - అధ్యా.3 - శ్లోకం 40)

ఇంద్రియ వృత్తులు మనస్సు, బుద్ధి మొదలగునవన్నియు అధిష్ఠాన చేతనమైన కాముని చేతనాంశమైన శక్తులే. ఇవి బయటే ఆకర్షణకు లోనై అధిష్ఠాన చేతనానికి విరుద్ధ దిశలో పయనించి సంకటములో పడవేయు చున్నవి. కావున వీటి ఆకర్షణ నుండి తప్పుకొనవలెనన్న బ్రహ్మచర్యము ప్రధానము. అనగా ఈ ప్రాణవిద్య సంసారికి కావలెను. సన్యాసికి కావలెను. సాధనలో మనో ప్రాణ మిలనమై ఊర్ధ్వగతి చెంది ఆత్మతో



అధిష్ఠానచేతనములో చేరుటవలన ఆత్మానుభూతి కలిగి ఆనందాన్ని అనుభవించినపుడు బ్రహ్మచర్యమంటే తెలియనగును. దీనిని స్త్రీ పురుషులు ఇరువురు సాధన చేయవలెనని మన గురువులు బోధించినారు.

21. మానవ దేహమందు ఆత్మ (ప్రత్యగాత్మ) సంచార విషయమై వివరింపుము ?

ధ్యాన స్థితిలో ప్రాణాన్ని దేహమును వదలి ఆత్మ బయటకి వచ్చి లోకాంతరము సంచరించి అనేక అనుభవములు పొందిన తరువాత మరల దేహములో ప్రవేశించునని ఉపనిషత్కారులు వర్ణించియున్నారు. విద్యలో సాగువారు అనేకులు ఈ అనుభవాన్ని పొందియున్నారు. ఈ స్థితిలో ఆత్మ సూక్ష్మదేహము కలిగి యుండును.

అమృత తత్త్వాన్ని పొందుటకు అన్ని ప్రాణుల కంటె మానవ ప్రాణికి మాత్రమే ఈ జ్ఞానాన్ని పొందుట సాధ్యమని, అదియు ఈ భూలోకములో మాత్రమే సాధ్యమనియు, ఇతర లోకవాసులకు సాధ్యముకాదనే అంశాన్ని గ్రహించవలెననే విషయాన్ని కేనోపనిషత్తు నందు చెప్పబడినది.

22. సాధన యందు కలుగు రసముల గురించి వివరింపుము?

సాధనలో దేహాకాశమైన బ్రహ్మరంధ్రము నుండి తత్సంబంధ మైన ద్రవములు క్రిందకు దిగుచున్నవి. నాలుకపై నున్న రుచి గ్రంథులు వాటి రుచిని తెలియజేయుచున్నవి. ఆ వచ్చు రసముల పేర్లు, సోమరసము అని ఒకదానిని అనుచున్నారు. దీనివలన దేహము శుద్ధియగుటకు సాయపడును. మనస్సునకు ఒక విధమైన తృప్తి కలుగుచున్నది. ఆఖరులో మనోప్రాణములు ఆత్మలో ఐక్యమైనపుడు అమృతపానము కలిగి దేహములో నవచేతనము కలుగుచున్నది. ఆత్మకు ఆనందమను స్థితి అనుభవమునకు

వచ్చును. దీనినే Inorganic Enjoyment నిరింద్రియానుభూతి అనుచున్నారు. ఈ రసములలో ముఖ్యమైనవి 3 రకాలు.

1. ప్రారంభములో లాలా రసము ఎక్కువయై, దీనివలన జీర్ణశక్తి ఎక్కువగును.

2. కొంచెము మందముగా ఉన్న తీపిరసము. దీనిని మధురసము అనుచున్నారు. దీనివలన మనసునకు ఒక విధమైన తృప్తి దొరికి సాధనలో ఉత్సాహము కలుగుచున్నది.

3. ఆఖరికి అక్షయమైన అమృతపానము కాబడి శాంతి, ఆనందము మనస్సునకు కలుగుచున్నది. ఈ అనుభవము కలిగిన తర్వాత మనస్సునకు ఏ విధముగా ఉంటుందనే ప్రశ్న ఉదయిస్తుంది. మనస్సు బహిర్ముఖ స్థితికి వచ్చినపుడు కూడా అది చపలత్వానికి సులభముగా లోనుకాదు. అనుభవమైన శాంతి సుఖములు మనస్సునకు చేకూరుట వలన క్షణికమైన సుఖాల విషయమై ఉదాసీనుడై ఉండును. సాధనయందు పురుష ప్రకృతి కలుగుచున్నది. అనగా ప్రాణము మరియు మనస్సు ఆత్మల మిలనము నుండి పురుష ప్రకృతి మెలకువ అగుచున్నది. జీవుని సహజావస్థ అనుభవమునకు వచ్చును.

23. బుద్ధి యోగో విశిష్యతే అనగా నేమి ?

యుక్తాయుక్త విషయాలు తెలిసికొనుబుద్ధి ప్రకాశము గాంచునది ఒక యోగికి మాత్రము సాధ్యమన్నారు. బ్రహ్మవిద్య అమృతవిద్య, ఆత్మ విద్య, ప్రాణవిద్య అని చెప్పబడిన విద్యలు యోగస్థితిని పొందుటకు ఏకైక సాధనము. అట్టి యోగస్థితిని పొందినివారికి "బుద్ధియోగోవిశిష్యతే" అన్నారు. ఈ బుద్ధి స్థితినే "బుద్ధేః పరతస్తు సః" అన్నారు భగవద్గీతలో. ఇటువంటి గ్రంథములు చదివి వినిపించువారు గ్రుడ్డివారిని వెంబడించిన



గ్రుడ్డివారు అని మన ప్రభువులు అన్నారు. ఎందుకనగా సాధన చేయని వారికి విషయానుభూతి కలుగదు.

శ్రుతి వాక్యము అనగా తపస్వులు తమ అంతర్ముఖములో వినిపించిన భగవంతుని వాక్యములైన "అహం బ్రహ్మాస్మి" అను విషయాన్ని భగవంతుడు తపస్వులకు చెప్పినాడు. అజ్ఞానులు తమకు అన్వయము చేసికొని చెప్పుట కేవలము భ్రమ అని మన గురువుగారు చెప్పినారు. కొంతమంది వేదములకు మాత్రము మహత్వ మిచ్చుచున్నారు. ఉదాహరణకు దయానంద సరస్వతిగారు. మరి కొందరు ఆగమాలకు మాత్రము మహత్వమిచ్చుచున్నారు. అనగా శైవులు, వైష్ణవులు మొదలైన వారు. జ్ఞానులు పరమాత్మ విషయమై "వేదాంగ వినుతుడు" అని పిలచినారు. కావున రెండింటిని గౌరవించేది ఉత్తమము (యుక్త) అన్నారు మన గురువులు. ఏ గ్రంథములు చదవకపోయినను తనలో ఉన్న "బుద్ధి" అను శక్తి మూలకముగా గ్రహించుటకు సాధ్యమని మన గురువుగారు అన్నారు. పూర్వము తపస్వులు ఆ విధముగానే తెలిసికొని జ్ఞానులు అయినారు. తరువాతనే వారి అనుభవములు శ్రుతి – దర్శనాల విషయమై గ్రంథములు వ్రాయబడినవి. అందువలననే ఆత్యంతిక సత్యము విషయమై జ్ఞానులు "బుద్ధిగమ్యం అతీంద్రియం" అన్నారు. అనగా ఇంద్రియములకు విశ్వాత్మ గోచరము కాదు. కావుననే అటువంటి బుద్ధి నుండేతెలిసికొనుట సాధ్యమన్నారు జ్ఞానులు. మన పంచభూతాత్మ ఆత్మ విషయమై ఇది చెప్పబడినది కాదు. ఇది పరమాత్ముని విషయమై చెప్పినదని తెలిసి కొనవలెను.

"ఏషాతేఽభిహితా సాంఖ్యే బుద్ధిర్యోగేత్విమాం శ్రుణు
బుద్ధ్యాయుక్తో యయా పార్థ కర్మబన్ధం ప్రహాస్యసి॥"

(భగవద్గీత – అధ్యా. 2 –శ్లో. 39)

గీతలో యోగమనే శబ్దానికి "సమత్వం యోగముచ్యతే" అన్నారు. అనగా స్థిత ప్రజ్ఞత్వము, కర్మకుశలత, కర్మబంధానికి లోనుగాక లోకకల్యాణ కార్యము చేయుట అని తెలిసికొనవలెను. జీవాత్ముల మిలనమే యోగమని ప్రభువులవారు వివరించినారు. జీవమనగా (Individual soul) శాశ్వతునితో చేరునది అని సూచించబడినది.

"త్వం దత్త తత్త్వ మితి జీవాత్మ తత్త్వం" అని శాంతి మంత్రములో చెప్పుచున్నాము. జీవ దేవుల సంబంధము కలుగవలయునన్న కూటస్థుడైన అనగా దేహములో ఉన్న ప్రాణశక్తిని ఆశ్రయించవలసి యున్నది. ఇదే వేదము యొక్క మొదటి మెట్టు అని మన గురువుగారు అన్నారు.

గీతలో చెప్పిన 3 ముఖ్యాంశాలు జ్ఞానము, కర్మ, భక్తి. అయితే భక్తియే అతిశ్రేష్ఠమైనదని ఆవశ్యకమని ప్రభువు అచ్యుతులవారి నిర్ణయము. ఎంతటి జ్ఞానియైన కర్మము ఉండి భక్తి లేనిదే దైవకృప దొరకదు. అతని ప్రయత్న మంతయు నిష్ప్రయోజనము. కావున భక్తి అవశ్యము కావలెను.

"అనన్యాశ్చిన్తయన్తో మాం యేజనాః పర్యుపాసతే
తేషాం నిత్యాభి యుక్తానాం యోగక్షేమం వహామ్యహమ్॥"
(భగవద్గీత - అధ్యా.9 - శ్లోకం 22)

నిరంతరం ఎవరు నన్ను ప్రార్థిస్తారో వారి క్షేమములు నేనే వహిస్తానన్నారు. "అయమాత్మా బ్రహ్మ" దీని పదప్రయోగము పెద్దదని చెప్పబడినది. "అహం బ్రహ్మాస్మి" నేను పెద్దవాడిని అనగా అతి పెద్దది అని చెప్పబడినది. ఇది మానవ మాత్రులకు కాదు. "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" శాశ్వతమైన ఆ ఒక్క సత్యాన్నే విశేష ప్రజ్ఞావంతులు అనేక విధాలుగా చెప్పియున్నారు అని శ్రీ స్వామి జయతీర్థులవారు వివరించినారు. ఆచార్య శంకరులవారు అజ్ఞానావృతమైనపుడు జీవి



అనియు, సహజావస్థలో స్థితమైనపుడు ఆత్మఅనియు, ఆ ఆత్మ దాని మూలచేతనమైన పరమాత్ముని ప్రతిబింబమని చెప్పియున్నారు. పరమాత్ముడు నిత్యుడగుట వలన అతని ప్రతిబింబమైన జీవము (ఆత్మ - ప్రత్యగాత్మ) నిత్యుడని చెప్పియున్నారు. మధ్వాచార్యులు కూడా దానిని సమ్మతించినారు.

దేవుడు సర్వాంతర్యామి. దేవుడు అన్ని చోట్ల ఉన్నాడనే భావనతో భగవంతుడు సత్తామాత్రంగ ఉన్నాడని మధ్వాచార్యుల అభిప్రాయం. పరమాత్ముని నుండి ఉత్పత్తి అయిన సత్త అనగా సాక్షి భూతము. అదే ప్రాణశక్తి అన్ని దేహములయందు ఉన్నది. బయట కూడా ఉన్నది. ఇది విజ్ఞానముతో కూడిన మాట. భగవద్గీతలో "సూత్రే మణి గణా ఇవ" అనగా అన్ని మణులయందు సూత్రం ఉన్నట్లే భగవంతుని ప్రాణశక్తి అన్ని దేహముల యందు ఉన్నదని అర్థం చేసికొనవలెను. భగవంతుడు దేహములయందు లేడు నేను వాటియందు ఉన్నాననే దానికి స్మరణ, చింతన వాటియందు, జీవులయందు ఉన్నదని అర్థం చేసుకోవలెనని ప్రభువు అచ్యుతులవారి నిర్ణయము.

24. మానవ దేహమునందలి ఆత్మ సంచారము విషయమై ఉపనిషత్తులలో చెప్పిన విషయము వివరింపుము ?

"ప్రాణో వై సమ్రాట్ పరమం బ్రహ్మ" ప్రాణమే పరమం బ్రహ్మ
"ప్రాణేన రక్షన్నవరం కులాయం బహిష్కులాయా
దమృతశ్చరిత్వా । స ఈయతే అమృతో యత్ర
కామగ్ం హిరణ్మయః పురుష ఏక హగ్ం సః॥"
(బృహదారణ్యకోపనిషత్తు -అధ్యా.6 - బ్రాహ్మణం 3.శ్లో. 12)

ఈ శరీరాన్ని ప్రాణుల వలన రక్షించుచు అమృత తత్త్వమైన ఆత్మ శరీరము నుండి బయటకు వచ్చి తన ఇష్టానుసారముగా సంచరించు

చున్నాడు (సూక్ష్మశరీరంతో) అయితే హిరణ్మయ పురుషుడు అన్ని చోట్లకు పోవుచున్నాడు. దేహమును వీడిన ఆత్మ ప్రాణుని మూలకముగా వెళ్లుచున్నాడు.

"ఇహచే దవేదీ దథ సత్య మస్తి నచే దవే దీన్మహతీ వినష్టిః
భూతేషు భూతేషు విచింత్య ధీరాః ప్రేత్యాస్మాల్లోకా దమృతా భవంతి ॥"
(కేనోపనిషత్తు -2-5)

ఈ జన్మలోనే అమృతతత్త్వాన్ని పొందిన ధీరులు చనిపోయిన తరువాత ఆ స్థితిని పొందగలుగుచున్నారు. అన్ని ప్రాణుల కంటె ఒక్క మానవునికే ఈ జ్ఞానాన్ని పొందే అవకాశము ఉన్నదన్నారు. అదియు ఈ భూలోకములో మాత్రమే సాధ్యమని, వేరే లోకములలో సాధ్యముకాదని చెప్పిన విషయాన్ని గమనించవలెను.

25. చిత్ శక్తి అనగా నేమి ?

ఇచ్చట చిత్ అనే శబ్దానికి మనస్సు అని భ్రమించరాదు. ప్రాణాయామము నుండి కలుగు అగ్నిపుటత్వం నుండి మనదేహమందలి కల్మషములు భస్మమగుచున్నవి. ప్రకృతియు స్థూల దోషముల నుండి విముక్తి పొందినపుడు మనస్సునకు ఏకాగ్రత కలుగును. అట్టి మనస్సు ద్వారా పరమాత్ముని ధ్యానించి కృపాపాత్రుడు కాగల్గినపుడు చిత్‌శక్తి (జ్ఞానశక్తి) వికసించుచున్నది. శుద్ధమైన స్థితి వచ్చినదని జ్ఞానదృష్టి చైతన్యమున్నదని చెప్పబడుచున్నది. పరమాత్ముని అనుగ్రహము లేనిదే ఈ చిత్‌శక్తి సాధ్యము కాదని ప్రభువులు అన్నారు. పరమాత్ముని ప్రసాద రూపముగా ఈ జ్ఞానమనే నేత్రము నుండి జీవాత్ముడు అన్నింటిని చూడగలుగుచున్నాడని ప్రభువులు విశదీకరించినారు.



26. "చిత్" శక్తి కలిగిన తరువాత జీవుని దృష్టి ఏ విధముగా ఉండును?

"చిత్" శక్తి కలిగిన తరువాత జీవుడు చతుర్ముఖుడు అగుచున్నాడు. మనస్సు, బుద్ధి, చిత్, మరియు అహంకారములు అతని చతుర్ముఖములు. భక్తి ఐదవ ముఖమన్నారు. చిత్ శక్తి కలిగినపుడు జ్ఞాని లోక కళ్యాణ కార్యములు ఆచరించి "యోగి" అని పిలువబడుచున్నాడు. మనస్సు ఉచ్ఛ స్థానములో నిలబడినపుడు యోగి భూత, ప్రేత, బ్రహ్మ మరియు మాయా మారీచులను పూజింపడు. అనగా గడిచిపోయిన దానిని గురించి కాని, ముందు జరుగబోవు విషయాల గురించిగాని, ప్రస్తుతము జరుగుచున్న విషయాన్ని గురించి కాని చింతించి భ్రమించడు. అతని మనస్సు వీటి విషయమై అ లక్ష్యముగా ఉండి జీవనములో చేయవలసిన కార్యములపై గమనము ఉండునని ప్రభువులు నుడివినారు.

యోగి క్రింది స్థాయికి రావలెనంటే మనస్సు సహాయం కావలెను. అపుడు భూత భవిష్యత్ చింతన చేయకుండా కేవలము వర్తమానమును గమనించుతాడు. దీనినే మనోదృష్టి అని చెప్పునది. ఉన్నచోటనే ఉండి తన మనో ఇచ్ఛతో వేరే చోట జరుగుచున్న దానిని తెలిసి కొనుచున్నాడు. శ్రీ ప్రభువులవారే దీనికి ప్రత్యక్ష సాక్ష్యము. ఇప్పటికి కూడా యోగ సాధన వలన ఈ స్థితిని పొందవచ్చునని శ్రీప్రభువులు అన్నారు. వారు తిరిగి మన మధ్యకు అనతికాలములోనే వచ్చుచున్నారని మన గురువుగారు పలుమార్లు చెప్పియున్నారు.

27. విద్య - అవిద్యను గూర్చి వివరింపుము?

కఠోపనిషత్తులో చెప్పిన విధముగా తనను (ఆత్మను) తాను తెలిసికొను చేతనము యొక్క విజ్ఞానమే విద్య అనియు, తక్కిన స్థూల బోధనలన్నియు అవిద్య అని అందరూ జ్ఞానాకాంక్షులు జ్ఞాపకమునందు ఉంచుకొనవలెను. దీనినే కొందరు మహర్షులు పరావిద్య అపరా విద్య అన్నారు.

"విద్యాం చావిద్యాం చ యస్తద్ వేదో భయగ్ం సహ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయాఽమృతమశ్నుతే॥"
(ఈశావాస్యోపనిషత్-11)

ఎవరు విద్యను అవిద్యను తెలిసికొనగలడో అతను అవిద్య ద్వారా మృత్యువును దాటి విద్య ద్వారా అమృతత్త్వాన్ని పొందును. విద్య, అవిద్యలు రెండిటిని ఉపాసించవలయును అను అభిప్రాయము సూక్ష్మముగా ఈ మంత్రములో వివరించబడినది.

అవిద్య ద్వారా మృత్యువును దాటవచ్చునని విద్య ద్వారా అమృతత్త్వాన్ని పొందవచ్చునని ఇచ్చట చెప్పబడినది. అయినా కేవలము స్థూలమైన ధర్మాచరణము నుండి మరియు వేదశాస్త్రాదుల అధ్యయనము నుండి మృత్యువును దాటుట అనగా ఇచ్ఛామరణము పొందుట సాధ్యమా? ఇది సాధ్యము కాదన్నపుడు ఇంకనూ అజ్ఞానాంధకారాన్ని (మృత్యువు అనుటకు ఈ అర్థమున్నది) దాటుట సాధ్యమా?

దీని విషయమై ప్రభువుల- అభిప్రాయము ఏమనగా అంధకారమునుండి (మృత్యువు- అజ్ఞానము) బయటపడుట సాధ్యము కాదని అందరికి తెలియును. విద్యోపాసనలో స్థూలము, సూక్ష్మము అను రెండు విధములున్నవి. విద్యయొక్క స్థూలోపాసన నుండి మృత్యువును దాటి అనగా ఇచ్ఛామరణ స్థితిని పొంది, విద్యయొక్క సూక్ష్మోపాసన నుండి అమృతత్త్వాన్ని అంటే జ్ఞానాన్ని పొందుట సాధ్యము. విద్యోపాసనలో జపము తపస్సు ఉండును. జపము ప్రాణాయామము నుండి ప్రారంభమై ఆనందానుభవము వరకు జరుగవలెను. ఈ స్థితిలో అమృతపానమగుట వలన ఇచ్ఛామరణస్థితి కలుగును. అచ్చటనే ఆగకుండా విద్యయొక్క సూక్ష్మోపాసన అనగా అంతర్ముఖస్థితిలో తన ఆత్మ మూలమును దర్శించి



తెలిసికొనుటకు ప్రయత్నము సాగవలెను. ఇదే తపస్సు ఆ పరశ్రేష్ఠుని కృపవలననే దర్శనం. జ్ఞానము వలననే పరమ పదవి (అత్యుత్తమ స్థితి - చిరశాంతి - మోక్షము) సాధ్యమని శ్రీప్రభువులు అన్నారు. కావుననే దీనిని కొందరు

"అసతో మా సద్గమయ - తమసో మా జ్యోతిర్గమయ- మృత్యోర్మా అమృతం గమయ" అన్నారు.

ఈ సాధనలో అన్నియు అనుభవమగును. ఈ విద్య అభ్యాస క్రమానికి మూడు సమయములు ఉన్నవి. సాయంకాలము అనగా సూర్యాస్తమయము తరువాత, రాత్రి నిద్రించుటకు ముందు, తరువాత తెల్లవారుజాము అనగా దాదాపు బ్రాహ్మీ ముహూర్తము. దీని విషయమై శ్రీగురువుగారు ఈ విధముగా వివరించినారు. భూగ్రహానికి సూర్య ప్రకాశము లేనపుడు భూమి భ్రమించుచున్నది. ఈ భ్రమణములో బ్రాహ్మీ ముహూర్త వేళకు అనగా 3.30 జు.ఖ శిళి 4.30 జు.ఖ తెల్లవారు జామునకు ఆకాశము నుండి ఓజోన్ (ంచిళిదీలి) అనే వాయువు ద్రవిస్తుంది. భూమి పైకి వచ్చే ఈ వాయువును చెట్లు, మొక్కలు స్వీకరిస్తుంటాయి. ఆ సమయంలో మేల్కొన్న ఏ వ్యక్తి అయినను ఆ ఓజోన్ అనే వాయువును స్వీకరించి ఉత్తేజితుడగు చున్నాడు. సాధనయందు కూర్చున్న వారికి ఆ వాయువు దేహములో ఎక్కువగా చేరును. పడుకొన్నవారికి చాలాకొంచెము ప్రాప్తించును.

తెల్లవారిన తరువాత సూర్యరశ్మికి ఓజోన్ వాయువు భస్మమగు చున్నదని సెలవిచ్చినారు. కావున తెల్లవారుజామున జపములో తపస్సు సాగునన్నారు. సూర్యోదయమైన తరువాత నిద్దుర నుండి మేల్కోన్న వారిలో మబ్బు ఆవరించి యుండును.

సాధన చేయువారు దీర్ఘగతిలోను, మధ్యగతిలోను, నిశ్శబ్దగతిలోను

చేయవలెను. దీనినే రుద్రగతి, విష్ణుగతి, బ్రహ్మగతి అని కొందరు ఉపనిషత్కారులు తెలిపియున్నారు.

28. "ఆత్మసర్వోత్తమ" అని ఎందుకన్నారు? వివరింపుము?

జ్యేష్ఠ, శ్రేష్ఠ ప్రజాపతి అని ప్రాణశక్తిని కొందరు ఉప నిషత్కారులు వర్ణించినారు. ప్లొటినస్ అనే ఆంగ్ల వేదాంతి ప్రాణశక్తిని నౌస్ అన్నారు. ఇది విశ్వమంతము ఉన్నది. మానవునిలో కూడ ఉన్నది. ఒక విధముగా ఆలోచించినచో ఈ ప్రాణశక్తి కూడా స్థూల శక్తే అన్నారు ప్రభువులు. ఎందుకనగా ఇందులో కేవలము క్రియ (స్పందన) ఉన్నది. కాని జ్ఞానము లేదు. ప్రాణశక్తికి సృష్టిలో జ్యేష్ఠత్వము నిజమైనదే. దీని శ్రేష్ఠత్వమును నేను సమ్మతించను. ప్రాణశక్తి తరువాత ఆ పూర్ణచేతనమునుండి ఉత్పత్తి అయిన ఆత్మ (విశ్వాత్మ) జ్ఞానమైన చేతనము కాబట్టి దీనినే శ్రేష్ఠమను అభిప్రాయము నాది. అందువలననే "ఆత్మ సర్వోత్తమః ఓం" అయితే మానవ దేహములో మూర్ధమునందు ఉన్నది "ఆత్మ" అని అన్నారు. దీనిని ప్రత్యగాత్మ అనిపిలిచినారు. దీని శక్తి సూర్యకిరణములలో ఒక కిరణము లాంటిదని తెలిసికొనవలెను. ఇది విద్యాసాధనలో తెలియ నగును.

29. శాశ్వతమైన దైవ దర్శనము తత్ఫలమై జ్ఞానప్రాప్తి పొందిన తరువాత జ్ఞాన పరమైన మోక్షము సిద్ధించునా?

ఈ ప్రశ్నకు సమాధానము భగవద్గీతయే. "జ్ఞానిభ్యోపి మతో ధికః" అని సందేశము. "నహి జ్ఞానేన సదృశం" అని చెప్పిన గీతావాణియే జ్ఞాని కంటె యోగి శ్రేష్ఠుడని చెప్పి "తస్మాత్ యోగీ భవార్జున" అని నిర్దేశించినది. కేవలము జ్ఞానప్రాప్తి అయినంత మాత్రాన మోక్షమని చెప్పబడలేదు. మోక్షప్రాప్తికి జ్ఞానోత్తర కర్మ అవసరమని చెప్పబడినది.



దీనిని గ్రహించిన ఋషులు "ఆత్మక్రీడః ఆత్మరతః క్రియావానేష బ్రహ్మవిదాం వరిష్ఠః" అన్నారు.

(ముండకోపనిషత్ – ముండకం3– ఖండం–1–4 మం)

అనగా ఆత్మకు సహజస్థితియైన ఆనందానుభూతిని పొందుచూ తనలో తాను క్రీడించుచూ జ్ఞాన వికాసాన్ని పొందుచూ లోక కళ్యాణమునకు క్రియ చేయుచున్నవాడు బ్రహ్మవిదులలో శ్రేష్ఠుడని ఉపనిషత్ ఋషుల వాణి.

అందువలననే ధర్మ శాస్త్రాలలో "జన్మనాజాయతే శూద్రః, సః స్కారాత్ ద్విజః" అన్నారు. అనగా మానవుడు జన్మించినపుడు శూద్రస్థితిలో ఉండును. సంస్కారముల వలన అనగా ఆధ్యాత్మ సాధన వలన ద్విజుడు, బ్రహ్మజ్ఞాని అగుచున్నాడు.

30. సమాధి అనగానేమి?

తాబేలు తన దేహేంద్రియములను వాడవలసినపుడు బయటకు వదలుచూ లోపలికి ఏ విధముగా ముడుచుకొనుచున్నదో అదే విధముగా మానవుడు మనస్సుకు (ఇచ్ఛ) కావలసినపుడు బహిర్ముఖమై ఇచ్ఛలేనపుడు అంతర్ముఖమై యోగము నందు ఉండు స్థితి. సమాధి అను స్థితిలో మాత్రము మనస్సుకు బయటవ్యాప్తి ఉండదు. అంతేకాని ఈ స్థితిలో మనస్సు పనిచేయదు అనే భావన తప్పు అని మన గురువుగారు అన్నారు.

మొదట ప్రాణుడు ఆత్మలో చేరినపుడు నిరీంద్రియ ఆనందము కలుగును. కొంతమంది దీనినే ఆత్యంతిక స్థితి అని భ్రమించు చున్నారు. దీనికి కారణము "ఆనందోబ్రహ్మ ఇతి వ్యజానాత్" అను శ్రుతి వాక్యముల సరియైన అర్థము తెలియక, మార్గదర్శకులు లేక ఈ స్థితి కలిగెనని మన గురువుగారు అన్నారు. ఈ భ్రమ యొక్క పరిణామమైన ధ్యానము అనే

ప్రయత్నము లేకనే మబ్బు ఆవరించి మెలకువ లేని స్థితి కలిగి సుషుప్తి కలుగుచున్నది. ఈ స్థితిలో అనేక సంవత్సరములు కూర్చున్నవారున్నారు. ఈ స్థితిలో జ్ఞానవికాసము కలుగుటకు సాధ్యము కాదు. ఆయుష్షు వృద్ధి మరియు కొన్ని సిద్ధులు ఈ జడ సమాధియందు ప్రాప్తించును.

ఈ రీతిగా భ్రాంతికి లోనుగాక భక్తితో పరమాత్ముని ధ్యానించ వలెను. ఆ దైవ కృపవల్లనే అజ్ఞాన ఆవరణము తొలగి జ్ఞానప్రాప్తి అగుచున్నది. అప్పుడు తన జన్మ కర్తవ్యము మెలకువ కలిగి ముక్తిమార్గము గోచరిస్తుంది. కర్తవ్య పూర్ణత అనంతరం ముక్తి లభ్యమగుచున్నది. ఈ అనుభవము సమాధి స్థితియొక్క పై స్థాయిగా మన ఆశ్రమ గురువుగారు వివరించినారు. దీనినే జ్ఞానులు తురీయాతీత స్థితి అని చెప్పియున్నారు. జడ సమాధిని అసంప్రజ్ఞాత సమాధి అనుచున్నారు. తురీయ స్థితిని సుషుప్తి వలె ఉండునన్నారు. మహర్షులు దీనిని శ్రేష్ఠమని చెప్పియుండలేదు.

31. తపోజ్వాల అనగానేమి? వివరింపుము?

ప్రాణాయామ సాధన చేయునపుడు వాయువు యొక్క తీవ్రమైన గతాగతిలో జనించిన విద్యుత్ వంటి శక్తి దేహములో వాయువునుండి వేరై దేహము పై భాగమునకు క్రింది భాగమునకు వ్యాపించును. క్రింది వైపు వ్యాపించిన ఆశక్తి వ్యక్తి కూర్చున్నపుడు ఆసనము నుండి మూలాధారము వరకు వెళ్లి మరల పైకెక్కి మూత్ర జననాంగములను ప్రవేశించి వాటిద్వారా వెన్నుముక మధ్యలోనున్న సూక్ష్మ ద్వారము ద్వారా బ్రహ్మరంధ్రాన్ని ప్రవేశించును. తదుపరి దేహమునుండే బయటకు వ్యాప్తమై లోక లోకాంతరములు చేరుచున్నది. దీనినే తపోజ్వాల అని జ్ఞానులు వర్ణించియున్నారు. ఈ స్థితిలో తనకిష్టమైన దేవతను ప్రార్థించి వరములు పొందవచ్చును. దేవతలను గూర్చి తపించినపుడు ఆయా దేవతల దర్శనము మరియు ఆ దేవతలు ఇవ్వదలచిన వరములు పొందవచ్చును. అంతేకాని



జ్ఞానాన్నిగాని, ముక్తినిగాని పొందుట సాధ్యపడదని మన గురువు గారన్నారు. అందువల్లనే తపస్వులకంటే యోగి శ్రేష్ఠుడని భగవద్గీతావాణి.

32. "యోగి" విషయము వివరింపుము?

"తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞానిభ్యోపి మతోఽధికః।
కర్మిభ్యోధికో యోగీ తస్మాత్ యోగీ భవార్జున॥"

(గీత–అధ్యా6–శ్లో46)

తపస్వికంటె యోగి అధికుడు, జ్ఞాని కంటె యోగి అధికుడు. కర్మిష్ఠి కంటె యోగి అధికుడు. అందువలన అర్జునా నీవు యోగి కావలెను అని శ్రీకృష్ణుడు గీతలో చెప్పియున్నారు. అట్టి యోగులలో కూడా భగవద్భక్తియున్న యోగి మిక్కిలి శ్రేష్ఠుడని తెలియవలెను.

గీతలో యోగి అనే శబ్దానికి సమత్వము (స్థితప్రజ్ఞత్వము) కర్మకుశలత అనగా కర్మబంధాలకు లోనుగాక లోక కల్యాణ కార్యము చేయుటలో గొప్పవాడనే చెప్పబడినదని శ్రీస్వామి జయతీర్థులవారు అన్నారు.

"జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః।
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః॥"

(గీత –అధ్యా. 6–శ్లో. 8)

ఆత్యంతిక సత్యాన్ని తెలిసినవాడు, సృష్టి విజ్ఞానాన్ని తెలిసి తృప్తుడై సదా పరమాత్మునియందు స్థితమైన మనసును కలిగినవాడు, ఇంద్రియము లను జయించి, మట్టి, రాయి,బంగారమును సమానముగా చూచువాడు యోగి అని చెప్పబడుచున్నాడు. ఇంకనూ ఎవ్వడు అన్ని ప్రాణుల సుఖదుః ఖములను తనవిగా భావించునో అట్టి యోగి అందరికంటె శ్రేష్ఠుడని

చెప్పబడినది. మరియు యోగి యందు భూత దయ సహజమని చెప్పబడినదని శ్రీస్వామి జయతీర్థులవారు అన్నారు.

33. యోగి జీవనమును గూర్చి వివరింపుము?

పరమాత్ముని కృపకు పాత్రుడైన వ్యక్తి జ్ఞానాన్ని పొంది స్థితప్రజ్ఞుడై సమత్వాన్ని పొందుచున్నాడు. జ్ఞానప్రాప్తియే యోగ విద్యా లక్ష్యము. తరువాత ముక్తి పొందుటకు జ్ఞానోత్తర కర్మాచరణ అవసరము. ఇదే యోగ జీవనము. దీనివల్లనే మానవజన్మ సార్థకమని అచ్యుతగురువులు అన్నారు.

34. దేవుడు ఉన్నచోటు విషయమై శాస్త్రాధారము తెలుపుము?

ఇచ్చట ముఖ్యమైన తత్త్వాంశమును ఆలోచించవలసియున్నది. దైవము సర్వాంతర్యామి. దైవము అన్నిచోట్ల ఉన్నాడు అనేదానికి శ్రీ మధ్వాచార్యులవారి వివరణ మేరకు ప్రాణశక్తి అంతటా ఉన్నది. దేహముల యందు బయట అంటే విశ్వమందు కూడా పరమాత్మ నుండి ఉత్పత్తి కాబడిన ప్రాణశక్తి అని తెలుసుకోవలెను. ఇది విజ్ఞానముతో కూడిన మాట. గీతలో "సూత్రే మణిగణాయివ" అన్ని మణులయందు దారమున్నట్లే నేను అనే విషయాన్ని ఈ విధంగా తెలిసికొనవలెను. అనగా సత్తా మాత్రంగా ఉన్నదని ప్రాణశక్తికి చెప్పబడినది. అన్ని భూతములు నాలో ఉన్నవి. నేను వాటిలో లేను అనే మాటలకు అన్ని భూతములకు భగవంతుడు ఆశ్రయము. ఏది కూడా అతని ఆశ్రయము కాదు అని మన గురువులు వివరించినారు. మరియు అన్ని భూతములు అతనిలో ఉన్నవని భావించుట తప్పు అని మన గురువుగారు శ్రీ అచ్యుతస్వామి అన్నారు. దేవుని విషయమై భగవద్గీత యందు స్పష్టముగా చెప్పబడినది. ఎచ్చట గాలి వీచదో, ఎచ్చట



సూర్య చంద్రాదుల ప్రకాశము లేదో ఆ పరంధామము (ఆత్యంతిక ఉన్న స్థానము నాది) నేను అచ్చోట ఉన్నానని చెప్పబడిన మాటకు స్మరణ చింతన వాటియందున్నవి. అనగా జీవులయందు అని అర్థము చేసికొనవలెను.

35. అవతారముల విషయమై విశదీకరించుము?

దేవుడు మరియు అవతారముల విషయమై ప్రభువుల నిర్ణయము ఈ విధముగా తెలియజేసినారు. పరమాత్ముని నుండి ఆయా కాలాల్లో లోక కల్యాణము కొఱకు కావలసిన జ్ఞానము శక్తిని పొంది ఆత్మ ఊర్ధ్వ మగుచున్నది. అదే అవతారములో ఈ విధముగా చూచినపుడు అన్ని అవతారములకంటె శ్రీకృష్ణావతారము హెచ్చు పూర్ణత్వము (దైవత్వము) కనిపించుటచే అతనిని జ్ఞానులు యోగీశ్వరుడు అని అన్నారు. ప్రభువులు కూడా దీనికి సమ్మతించారు.

భగవద్గీత కర్మకు జ్ఞానానికి ప్రాధాన్యతనిచ్చినది. తన ఉద్ధారానికి జ్ఞానము మరియు అదే విధముగా కర్మ ఈ విధముగా ప్రతి మానవ జీవి తపస్సుచే జ్ఞానము పొంది మోహదూరమైన వాడుగా భద్రుడై సమత్వముతో కర్మను చేయవలసియున్నది. అదే యోగము. ప్రపంచములో ఎక్కువమంది యోగస్థితిలో జీవించినపుడు జగత్తులో ధర్మము శాంతి తృప్తియు స్థిరమగుటకు సాధ్యమని మన గురువులు అన్నారు.

36. స్థితప్రజ్ఞ విషయమై తెలియజేయుము?

స్థితప్రజ్ఞుడు ఏ విధమైన క్రియచేయుచున్నాడో తెలుపుము?

భగవద్గీత 7వ అధ్యాయములో స్థితప్రజ్ఞ విషయమై వివరణ ఉన్నది. అట్టి వ్యక్తి నిరహంకారిగా ఉండి సర్వసమభావముతో వర్తించుచున్నాడు. అతడు సమత్వముతో జీవించుచున్న యోగి. ధర్మబద్ధముగా కార్యాచరణమే

తన కర్తవ్యమని, భగవంతుని సేవ అనే భావంతో లోక కల్యాణానికై శ్రమించుచున్నారు. దీనినే కర్మఫల త్యాగమని అనుచున్నారు. చివరకు తాను మోక్షాన్ని కూడా ఆశింపక "సమదుఃఖ సమధీర అమృతతత్త్వాయ కల్పతే" అనునట్లు జగత్తు సేవకు ఎన్ని జన్మలైనారాని, అదే సేవా భాగ్యముగా భావించి తృప్తి సంతోషములతో సదాభక్తి భావము కలిగి సేవ చేయుచు అమృతత్వాన్ని (చిర జీవనాన్ని) పొందుచున్నాడు. దీనినే పరమ పదవి అత్యంత ఉన్నత స్థితి అని మన గురువుగారన్నారు.

37. ముక్తి విషయమై తెలియజేయుము?

ముక్తులు రెండు విధములు.

1. జీవాత్మ ఐక్యత ఆనందము పొంది ధర్మకర్మబద్ధుడై సాగుచు దేహయుతుడై ఉండుట. దీనిని జీవన్ముక్తి అన్నారు. అంటే శుద్ధసాత్విక ఆహారము విషయముతో కూడిన జీవ విద్య అభ్యాసముతో రోగములు పోగొట్టుకొని దీర్ఘాయువు మరియు ఉత్సాహములతో శాంతి ఆనందములు అనుభవించువారిని తెలుసుకొనవలెనని మన గురువుల బోధ.

2. జగత్తున తాను చేయవలసిన కర్తవ్యము ముగిసినదని, తనకు అర్థమైనపుడు దేహాన్ని విసర్జించి అనగా ఇచ్ఛామరణుడై దేవునిలో ఐక్యమగుట. దీనిని విదేహ ముక్తి లేక మోక్షము అందురు. రెండవదానికి భాగవతములోని శుక మహర్షిని పేర్కొన్నారు. జీవన్ముక్తులు ఇప్పటికీ సమాజములో, అడవులలో, గుహలలో ఉండవచ్చునని శ్రీ జయతీర్థుల వారు అన్నారు.

38. ఈశావాస్యోపనిషత్తునందు "జ్ఞాని" విషయమై వివరింపుము?

బ్రహ్మ విద్య లభ్యమైన తర్వాత తపస్విగా రూపొంది తన్ను తాను తెలిసికొన్న జ్ఞాని తనవలె అన్ని జీవాత్ముల మూలము ఒక్కటే అని



తెలిసికొన్నవాడగుట వలన విశ్వశోధన భావము అతని సహజగుణముగా ఉండును. అతని ప్రవర్తన కూడా తదనుగుణముగా ఉండును. అదీగాక జ్ఞానియైన తనకు జన్మ మోక్షముల మూలకారణమైన క్రమం సాధన రహస్యములో తెలియుట వలన ఎవరిపైన జుగుప్స, ద్వేషము, మోహము మొదలగునవి లేకుండా పోవును. భగవంతుని విషయమై చెప్పుచూ అతడు పరశ్రేష్ఠుడు, పరంబ్రహ్మ, పరంజ్యోతి, పురుషోత్తమ, పరమాత్మ, చిన్మయ, పురుషపరః విషయమై ప్రార్థించుచున్నాడు. ఇచ్చట సంకల్ప వికల్పములు లేవు. పంచభూతములు లేవు. సూర్యచంద్రాదులు లేరు.

భగవంతుని నుండి వచ్చిన సహజసృష్టి మొట్ట మొదట వ్యక్తి విశ్వములో ఉన్న అందరికంటేనే ఉత్తముడు. సదా సర్వజ్ఞుడు, ప్రభువు. తానే స్వయముగా పుట్టినవాడు. అనగా జ్యోతిర్మయుడై ఇతరుల ఇచ్ఛ లేకుండా పుట్టినవాడు అని తెలిసికొనవలెనని మన గురువుగారు అన్నారు. ఇది ఆది పురుషుడినే పురుషుడనియు, పరమాత్ముడనియు, పరమేశ్వరుడనియు, పరబ్రహ్మ అనియు ఆది దేవుడనియు, కొంతమంది జ్ఞానులు వారికి తెలిసిన విధముగా వర్ణించినారు. ఇతడొక్కడే సర్వజ్ఞుడగుట వలన గురువు అనియు, సర్వశక్తుడగుట వలన ప్రభువు అనియు, సమత్వము ఇతడొక్కనిలో ఉండుట వలన యోగి అనియు, శాంతి అతని సహజత్వమగుట వలన శివుడు అనియు మన గురువు గారు నిర్వచించినారు.

39. జీవునికి తండ్రి ఋణమును గూర్చి వివరింపుము?

మాతా పితృ ఋణాన్ని గూర్చి అనేకులు చెప్పగా విని యున్నాము. శ్రీ అచ్యుత గురువుగారి అభిప్రాయములో తల్లి ఋణముకంటె తండ్రి ఋణం గొప్పది. తల్లి యొక్క రక్తసారము, భూత ధాతువులు, తల్లి గర్భములో జీవునకు దొరకుచున్నవి. అదే విధముగా తండ్రి యొక్క ధృతము జీవునకు

దొరకుచున్నది. మరియు తండ్రి నుండే ప్రాణశక్తి దొరుకుటవలన జీవికి తండ్రి ఋణమే గొప్పదని చెప్పక తప్పదని శ్రీ గురువుగారు అన్నారు. తల్లిదండ్రుల యొక్క జీన్సు వలన జీవునకు ఆకారము ఏర్పడుచున్నది.

తల్లి యొక్క గర్భవాసము తొమ్మిది నెలల తరువాత దేహధారి అయిన జీవుడు, బృహత్ అయిన ప్రపంచమనే గర్భమున పడుచున్నాడు. తల్లి గర్భమునకు రాక పూర్వము ఈ జీవుడు తండ్రి గర్భములో మూడు మాసములుండునని, కాలక్రమేణ తల్లి గర్భములోనికి చేరుతున్నాడని శ్రీ గురువుగారు చెప్పినారు.

జీవనానికి మూలాధారమైన ఆత్మ (ప్రత్యగాత్మ) దేహానికి ఉచ్ఛస్థానమైన బ్రహ్మరంధ్రములో ఉండి మనస్సు బహిర్ముఖమై ఇంద్రియ మూలకముగా విశాలమై ప్రాప్తి చెందినది. మన దేహములో ఉన్న ప్రాణానికి అశనము అందించవలసి యున్నది. ఇది బ్రహ్మ విద్యా సాధన వలన సాధ్యమగునని మన గురువుగారు సెలవిచ్చినారు.

40. ఋషులకు, యోగులకు ఉన్న బేధములు వివరింపుము?

దేహేంద్రియములపై అధికారమున్న మనస్సు మరియు దేహములో ఉన్న శక్తులన్నింటికి జ్యేష్ఠము, శ్రేష్ఠము అయినవాని మిలనమగును. అనగా మనోప్రాణ మిలనమగును. ఇది యోగము యొక్క మొదటి మెట్టు. ఆ రీతిగా మిలనమై బ్రహ్మ స్థానములో ఉన్న ఆత్మలో చేరునపుడు ఆత్మునకు తన సహజ స్థితి అయిన ఆనందాను భవము కలుగునని మన గురువుగారు విశదీకరించినారు. యోగి అయిన వాని వలననే లోక కళ్యాణము జరుగునని చెప్పియున్నారు. సాత్విక ప్రాధాన్యమైన కర్మాచరణము చేయువారు మహర్షులు. రాజస ప్రధాన కర్మాను చరణము చేయువారు రాజసులు. గుణాతీతులై లోక కళ్యాణానికి అవసరములైన



అన్ని కర్మలు చేయుచూ (లిప్త – అ లిప్త) స్థితిలో సమత్వము, దైవత్వాన్ని ప్రతిపాదించు వారు యోగులు అని మన యోగులు వివరించినారు. ఋషి అనగా సదా ఋత స్థితిలో ఉన్నవారని తెలిసికొనవలెనన్నారు.

41. ప్రత్యాహారము గురించి వివరించుము?

కొంతమంది ప్రత్యాహారాన్ని ఇంద్రియనిగ్రహమనియు, మనోసంయమనము అని చెప్పియున్నారు. ఇది తప్పు అభిప్రాయమని మన గురువులు చెప్పియున్నారు. ప్రాణాయామ సాధనలో వాయువు మరియు అనిలం (బయటిగాలి) మథనములో "అశనము" అనే శక్తి ఉత్పత్తియగుచున్నది. ఈ వాయువు మన దేహములో ప్రాణశక్తినుండి ఉత్పత్తి అయినది. ఈ రెండింటి మథనము వలన అశనము అనే శక్తి ఉత్పత్తి అగుచున్నది. ఇదికూడా వాయురూపమే. దీనిని ప్రాణశక్తి తనలో చేర్చుకొనుచున్నది. ఇది సాధకుని గమనమునకు తెలియును. అపుడు ప్రాణశక్తి బలము హెచ్చి ప్రాణము స్పందించుచున్న స్థానమునుండి పై స్థానమునకు (బ్రహ్మరంధ్రము) వెళ్లి అచ్చట ఉన్న ఆత్మ (ప్రత్యగాత్మ)తో కలియుచున్నది. అపుడు మనసుకు ఏకాగ్రత కలుగుచున్నది. ఈ ప్రాణశక్తి మనోమిలనమగుట వలన మనస్సు కూడా ఆత్మలో కలియుచున్నది.

42. ధ్యానమును గురించి వివరింపుము?

మనస్సుకు ఏకాగ్రత కలిగినపుడు ధ్యానము చేయవలెను. మనస్సును పరమాత్మునిపై లగ్నము చేయవలెను. ఇచ్చట రూపము, నామము, అవసరము లేదని మన గురువుగారు అన్నారు. గీతలో భగవంతునికి ఆకారములు లేవని చెప్పబడినది. మరి ఏ విధముగా ధ్యానించవలెను. "ఓం" అను దానిని మననము చేసుకుంటూ అనగా అ + ఉ + మ = ఓం అనునది. ఇది కేవలము స్వరము. అక్షరము కాదని

తెలిసికొనవలెను. పరమాత్ముడు అక్షరుడు. నాశరహితుడు అనుటకు "ఉ" అనునది ఉగమస్థానము (కారణం-చేతనం) అనగా జగత్తు సృష్టికి మూలకారణమనియు, "మ" ఐక్యమగుటకు ఉన్న చేతనము ప్రాణము మోక్షదాయకము.

"కూటస్థోఽక్షర ఉచ్యతే"- గీత - అని అర్థము చేసికొనవలెను. దేవా అను శబ్దము కూడా ఇచ్చువాడని అర్థము చెప్పుకోవచ్చును. దేవతలు పరిమితమైన శక్తిగలవారు. భక్తుల కోరికలను మాత్రము ఇవ్వగలరు. పరమాత్ముడు సర్వశక్తి సంపన్నుడు కావుననే మనందరి కోర్కెలను నెరవేర్చగల కరుణామయుడు. అందువలననే అతనిని దైవమన్నారు. ఋషుల ధ్యానములో స్మరణ, చింతన, ప్రార్థన పరితపనములు చేరియున్నవి. ఇదే తపస్సు అని మన గురువుగారు నుడివియున్నారు. దీనినే చివరి స్థితి, శరణాగతి (ఆత్మార్పణం) అన్నారు.

43. యోగ ధారణ విషయమై వివరింపుము?

"సర్వద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ।
మూర్ధ్న్యా ధాయాత్మనః ప్రాణమాస్థితో యోగధారణామ్॥"

(గీత-8-12)

ఈ విషయమై అన్ని ద్వారములను సంయమించి మనస్సును హృదయము నుండి నిరోధించి అనగా ప్రతిష్ఠ కాకుండా ప్రాణాన్ని ఆత్మతో బ్రహ్మరంధ్రములో చేర్పించునది యోగధారణమని అర్థమగుచున్నది.

అయితే వ్యాఖ్యాన కారులందరూ ఈ శ్లోకానికి మనస్సును హృదయములో నిలిపి అనే అర్థాన్ని వ్రాసియున్నారు. కాని మనస్సును హృదయము నుండి నిరోధించమని చెప్పలేదు. మనస్సును హృదయములో నిలిపినచో ఏమగును? "భ్రామయన్ యంత్రా రూఢాని మాయయా"



అనునట్లుగా మాయాజాలానికి దొరికి భ్రమకు లోనగును. అంటే వైశ్వానర స్థితి కలుగును. అనగా బాహ్యజగత్తుకు మోహితుడగుచున్నాడని లిప్తత కలుగునని మన గురువుగారు చెప్పినారు. ఈ స్థితినుండి ప్రాజ్ఞస్థితికి రావాలంటే ప్రాణము మూర్ధ్నములో బ్రహ్మరంధ్రములో ఆత్మతో కూడినచో సాధ్యము. ప్రాణము అంటే వాయువుకాదు. ముక్కు నోరు చెవులయందు సంచరించునది వాయువు. ప్రాణము కాదు. ప్రాణము ఇతర ప్రాణ వాయువులనుండి దేహములో కొన్ని స్థానములలో సంచరింప చేయు చున్నది. అయితే ఈ ప్రాణాన్ని మాతరిశ్వఅని, వాయువు తండ్రి అని, కొన్ని ఉపనిషత్తులయందు వర్ణించియున్నారని శ్రీస్వామి జయతీర్థులవారు అన్నారు.

నోరు, చెవి, కన్ను, ముక్కు, హృదయం నందు ఈ వాయువు ఉపభాగమేకాని ప్రాణము కాదు. ఈ వాయువు యొక్క ఉప భాగములనే పంచప్రాణములని పిలుచుచున్నారు. ప్రాణాన్ని ముఖ్యప్రాణుడని మరికొన్ని ఉపనిషత్తులయందు పిలిచియున్నారు. (బృహదారణ్య-ఛందోగ్య) పై విషయాలను జయతీర్థస్వామి వివరించినారు. గీతలో హృదయములో ఉన్నది. "ఈశ్వర" అని చెప్పుటవలన వాయువు ప్రాణము అని చెప్పబడినది. కఠోపనిషత్తు నందు ప్రాణ సంచారముగూర్చి "మధ్యే వామన మాసీనం" అని వర్ణించబడినది.

44. భక్తి అనగానేమి?

చెప్పిన దానినో, గ్రంథ పాఠాన్నో నమ్మి స్థిరము లేని మనస్సు ఒక్క స్థితిలో నోటినుండి చెప్పుట కాని, దేహదండన క్రియలుగాని వ్యవహారిక కష్టములు నివారించుటకు పాటించు తాత్కాలిక శ్రద్ధగాని

భక్తి అని అనిపించుకొనవు అని శ్రీప్రభువులు అన్నారు. ఇవన్నియు తాత్కాలికములని చెప్పియున్నారు. ఇవి కాలక్రమేణ తప్పిపోవచ్చును.

నిజమైన భక్తిని గూర్చి విచారించినపుడు మనుష్యుని అష్టావస్థలకు భక్తికే కారణమైన మనస్సుకు స్థిరత్వమును ఇచ్చు ఒక శక్తి యున్నది. అది విశ్వమునందు ఉద్భవించిన మూలశక్తి అన్ని దేహములయందును మరియు దేహముల బయట కూడా వ్యాపించియుండుట వలన మన దేహమునందు ఉన్నశక్తి అదే ప్రాణము. ప్రాణము దేహము నుండి విడివడినపుడు అన్నియు దేహమునుండి వెళ్లిపోవును. అందువలన జీవనములో ఈ ప్రాణము బహుముఖ్యమైనది. సత్యమనే విషయాన్ని తెలిసికొను ప్రయత్నములో "భక్తి" అంటే తెలుస్తుంది. తత్త్వము అంటే తెలుస్తుంది అని శ్రీ అచ్యుతప్రభువులు అన్నారు.

మధ్వాచార్యులవారు భక్తియే ముక్తికి మార్గమని బోధించినారు. భక్తి యనగా స్వరూప జ్ఞానయుక్తమైన పరమాత్ముని విషయమైన స్నేహమే అని నిర్వచించారు.

"దైవేచ్ఛ" అని చెప్పుచున్నది మూఢభక్తి అని, ఎలా అయితే అ లాకానీ అని సోమరులు వచించునది కేవలము అసమర్థత అని ప్రభువులు నిర్వచించియున్నారు.

శ్రీవిజయీంద్ర స్వాములవారికి భక్తిని గురించి వివరిస్తూ శ్రీ అచ్యుతగురువుగారు ఈ విధముగా అన్నారట. భక్తి అనునది భయపడువారిది కాదు. అదే నిర్భయస్థితికి తీసుకొని వెళ్తుంది. ఇది ప్రధానముగా ఉన్న సంపత్తు అభయప్రద మార్గము. ఆ మార్గము ధీరుల సొత్తు. శాంతి మనస్కుల సొత్తు. ఇందుకు తృప్తి కావలెను. అవ్యాజమైన ప్రేమవలన ప్రస్తావించబడవలెను. ఈవిధముగా ఉంటేనే అది ప్రేమ



మయమై, వృద్ధినొంది జీవించగలదు. ఏ విధమైన భీతిలేక ఆత్రముగా చేయు సేవ మన తత్వజ్ఞాన అర్థములో భక్తి అగును. దానిని పెంపొందించుకొనండి. సంశయాలకు, భయాలకు అవకాశము ఇవ్వక జీవించవలయును. తక్కినవి రాక్షసుల సొత్తు. వీటికి వశముకాక ఉండవలెను. ఇలాంటివి మనుషులను సంకుచితులుగా అంటే దుష్టులుగా ఎంతో సంకటమయముగా మారుస్తాయి అని శ్రీ అచ్యుతగురువుగారు అన్నారట.

45. ఉద్గీత అనగానేమి వివరింపుము?

ఛాందోగ్య ఉపనిషత్తునందు ఆధ్యాత్మిక విద్యను గూర్చి చెప్పబడినది.

"అగాతా హవై కామానాం భవతి య ఏత దేవం విద్వాన్
అక్షర ముద్గీథముపాస్త ఇత్యధ్యాత్మమ్." (1-2-14)

ఈ రహస్యాన్ని తెలిసికొని ఉద్గీతను (ప్రణవము) ఉపాసన చేయుటవలన సర్వకామనలు సిద్ధించునని చెప్పబడినది. ఇదే ఆధ్యాత్మ అనగా ఆత్మను తెలిసికొనుమార్గము. పైకి వెళ్లుగతిని ప్రాణమని క్రిందికి వచ్చుగతిని అపానము అని అంటారు. ఈ రెండుగతుల వలన దేహమంతయు చలించు వాయువు దేహమంతయు వ్యాప్తి చెందును. దీనినే వ్యానము అన్నారు. ఇదే సంధించడానికి మనో ప్రాణమిలనానికి కారణమగును. దేహములో ఇతర స్థానాల్లో ఉద్భవించుట వలన వ్యానవాయువునే వాణి అన్నారు.

"అథ ఖలూద్గీథాక్షరా ణ్యుపాసీ తోద్గీథ ఇతి ప్రాణ
ఏవో త్ప్రాణేన హ్యుత్తిష్ఠతి వాగ్గీ ర్వాచో హ గిర
ఇత్యాచక్షతే ఽన్నం థమన్నే హీదం సర్వం స్థితమ్"

(ఛాందోగ్యోపనిషత్తు - 1-3-6)

ఉద్గీత అను దానికి శబ్దోత్పత్తి మూలకముగా ఇచ్చట వివరించబడినది. ఉద్ మన దేహములో ఉన్న వాయువు ప్రాణగతి పైకి వెళ్ళుచున్నది. దీని నుండి అనగా ప్రాణము నుండి మానవుని శ్రేయస్సు. గీ అని ఉచ్చరించినపుడు వాయువు స్వరయుక్తముగా క్రిందికి వచ్చుచున్నది. దీనినే వాణి అన్నారు. అనగా అపానగతి అని తెలిసికొనవలెను. ప్రాణ అపాన గతుల వలన వాయు మథనము నుండి ఉద్భవించు దానిని అశన మన్నారు. ఈ అశనమును (అన్నము) ప్రాణుడు గ్రహించి బలపడుచున్నాడు. జ్ఞానము ఏవిద్యోపాసన వలన లభ్యమో దానిని దేవతలు ఆశ్రయించిరని చెప్పబడినది. ప్రాణోపాసనకు ప్రథమ సోపానము. వాయు మథనమే (త్రైవిద్య). ఊర్ధ్వగతి (ప్రాణగతి) అధోగతి (అపానగతి) మధ్యగతి వీటిని రుక్కు, యజుస్సు, సామ అని కూడా చెప్పబడినది. ఈ విధముగా మూడు గతులలో చేయబడునది గనుక ఇది త్రయీ విద్య (వేద విద్య) అని చెప్పబడినదని మన గురువులు వివరించినారు. అశన ప్రాప్తివలన ప్రాణుడు బలపడి మనస్సు లీనమై మనోప్రాణ మిలనమై ఆత్మ ఉన్న స్థానములో బ్రహ్మరంధ్రములో చేరుట వలన ఆత్మ మేలుకొనుచున్నది. ఈ ఆధ్యాత్మ సాధన మన ఆశ్రమమునందు చేయబడుచున్నది.

46. ఆత్మ మన దేహములో ఏ స్థానమందున్నదని తత్త్వవేత్తలు తెలియజేసి యున్నారు? తెలుపుము?

"అథ యదిద మస్మిన్ బ్రహ్మపురే దహరం పుండరీకం
వేశ్మ దహరోఽస్మి న్నంతరాకాశః తస్మిన్ యదంతః
తదన్వేష్టవ్యం తద్వావ విజిజ్ఞాసితవ్య మితి."

(ఛాందోగ్యోపనిషత్తు - 8-1-1)



మన దేహములో బ్రహ్మపురి – బ్రహ్మరంధ్రమనే చిన్న కమలము ఒకటి ఉన్నది. అందులో సూక్ష్మమైన శూన్య స్థానమున్నది. ఇదే దహరాకాశమని కొంతమంది వలన చెప్పబడినది. ఇందులో ఏమున్నదో తెలుసుకోవలెను. దీనిని తెలిసికొనుటకు సాధనమైన ప్రాణవిద్యనే కొంతమంది దహరవిద్య అన్నారు. ఇచ్చట గమనం అని చెప్పిన దానినే సహస్రారము అన్నారు. ఇందులో ఆత్మ అన్నది ప్రత్యగాత్మ ఈ విషయమై మన గురువుగారు ఆత్మను గూర్చి వివరించుచూ బ్రహ్మ విద్యను వేదవిద్య అని చెప్పియున్నారు.

47. సాధనా క్రమాన్ని గూర్చి వివరింపుము?

"త్రిణాచికేత స్త్రిభిరేత్య సంధిం త్రికర్మ కృత్తరతి జన్మ మృత్యూ
బ్రహ్మ జజ్ఞం దేవ మీడ్యం విదిత్వా ని చాయ్యే మాం శాంతి మత్యంత మేతి."

(కఠోపనిషత్తు 1-17)

మన దేహములో ఉపాసించు విద్యాక్రమం బోధించబడినది. మూడు అగ్నులు అనగా ప్రథమములో వాయు మథనము నుండి ఉత్పత్తియైన అగ్నిశాఖ. రెండవ స్థితిలో ఆ శాఖయే ఊర్ధ్వముఖమై తీవ్రముగా విద్యుత్ కాబడి వివిధ రూపములో కనిపించు విద్యుదగ్ని. మూడవ స్థితిలో ఈ వాయువునకు అగ్నికి విద్యుత్తుకు మూలకారణమైన ప్రాణాగ్ని ఊర్ధ్వగమనములో బ్రహ్మరంధ్రములో ఉన్న ఆత్మను చేరినపుడు మృత్యువును దాటి ఇచ్ఛామరణస్థితి ప్రాప్తించును. అమృత ప్రాప్తి కలుగునని శ్రీజయతీర్థ స్వాములవారు విశదీకరించినారు. ఈ మూడింటిని సమర్పకమైన రీతిగా ఉపాసించినచో జీవాత్మ ఐక్య స్థితినుండి కలుగు జ్ఞానాన్నుండి ఆత్యంతిక శాంతిని పొందవచ్చునని ఉపనిషత్తు మహర్షులు వర్ణించియున్నారని మన గురువుగారు వివరించినారు. ఈ మంత్రంలో "బ్రహ్మజజ్ఞం" అను దానిని

విశ్వానికి మూలశక్తి ప్రాణశక్తి అనియు, అదే విధముగా విశ్వంలో ఉన్న ప్రాణశక్తికి ఆది దేవుడైన పురుషుడు అని తెలిసికొనవలెనని శ్రీస్వామి అచ్యుత ప్రభువులు అన్నారు.

ఈ సమయములో మాయను గూర్చి వివరించుచూ ఆమెను ముక్తకన్య అన్నారని, ఆమెను ప్రార్థిస్తే తప్ప ముక్తి సాధ్యము కాదన్నారు. అందుకే ఆమెను దుర్గామాతగా పూజించవలెనన్నారు. భగవద్గీతా గ్రంథంలో "మమ మాయా దురత్యయా" అని శ్రీకృష్ణ భగవానుడు అన్నారని కావున ఆమెను భక్తితో స్తుతించి సేవించవలెను అని మన గురువులు అన్నారు.

48. ఆత్మను స్థూల కార్యచరణము వలన తెలిసికొనుట సాధ్యమా?

"నాయమాత్మా ప్రవచనేన లభ్యో
న మేధయా న బహూనా శ్రుతేన
య మే వైష వృణుతే తేన లభ్యస్తస్యైష
ఆత్మా వివృణుతే తనుం స్వాం."

(ముండకోపనిషత్-3-2-3)

విశ్వాత్మ ప్రవచనము వలన లభ్యము కాదు. బుద్ధి శక్తి వలన (స్థూలబుద్ధి) ఇతరులు చెప్పిన దానిని వినుట వలన గాని ఆ విశ్వాత్మ విషయము తెలియనేరదు. ఇచ్చట విశ్వాత్మ అనగా పంచ భూతాత్మకమైన శరీరములో ఉన్న జీవాత్ముడు కాదు అని తెలుసుకోవలెను.

జీవ- ఆత్మల మూలమైన విశ్వాత్మనే బ్రహ్మ అని చెప్పబడినది. ఎవరిపై ఆతనికి ప్రసన్నత కలుగునో వారికి మాత్రమే ఆ విశ్వాత్మను గూర్చి తెలియును. ఇచ్చట భక్తి ఆవశ్యకత ప్రత్యేకముగా చెప్పబడినది. అతడు నిత్య శరీరుడని బోధించబడినది. అందువలన ఈ విశ్వాత్మ



ఇంద్రియాదుల చేత తెలిసికొనబడదు. మహర్షులు దీనిని "అతీంద్రియం - బుద్ధిగమ్యం" అన్నారు. అటువంటి బుద్ధిమంతులకు నమస్కారము చేయవలెనన్నారు శ్రీగురువుగారు.

49. ఆత్మ మరియు పరమాత్మ విషయము వివరింపుము?

"ఏష సర్వేశ్వర ఏష సర్వజ్ఞ ఏషోకంత
ర్యామ్యేషయోనిః సర్వస్య ప్రభవావ్యయౌ హి భూతానాం"

(మాండూక్యోపనిషత్)

ఇతడే సర్వేశ్వరుడు, సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, అన్ని జీవుల ఉత్పత్తి స్థానము. అనగా జగత్తును సృజించుశక్తి, లయ మొనరించు శక్తి ఈ ఆత్మదే. ఇతని తరువాతివాడు పురుషరూపి పరమాత్మ పంచభూతాత్మక శరీరంలో ఉన్నది జీవాత్మ అని బోధించియున్నారు. అతనిని పరమాత్మ అని (పురుషుడు) విశ్వాత్మ అని జ్ఞానులు చెప్పియున్నారని శ్రీ గురువుగారు వివరించినారు. ఈ ఆత్మ అన్ని ప్రాణుల దేహములందున్నది. జగత్తులో పుట్టి, చనిపోయే దేహములందు ఉండేదానిని ఆత్మ అన్నారు. (ప్రత్యగాత్మ) కాని జగత్తును సృష్టించే శక్తి, నాశనము చేసే శక్తి దీనికి లేదు. కాని ఇది ఆ ఆత్మలోని అంశ మాత్రమే. అనగా సూర్యుని కిరణాలలో ఒక కిరణం అంతటిది. ఈ ఆత్మ మనిషి దేహములో ఉన్నదని భావన. ఈ ఆత్మ ప్రస్తుతం మానవదేహములో నిద్రించుచున్నదని, మానవుడు అనాత్మ భావనలో ఉన్నాడని, మన గురువుగారు తెలియజేసినారు. ఇది మేల్కొనుట ఆధ్యాత్మ సాధనలో మాత్రమే సాధ్యమని గురువర్యులు పేర్కొన్నారు. ప్రస్థాన త్రయమునందు (బ్రహ్మ సూత్రాలు, ఉపనిషత్తులు, భగవద్గీత) వివరించబడినదని మన గురువర్యులు తెలియపరచినారు. హిరణ్యగర్భుని నుండి బోధించబడిన యోగదర్శనాలను ఖండించు వారు సాధనాపరులు

కారని మన గురువులు విశదీకరించినారు. గీతలో "తస్మాత్ యోగీ భవార్జున" అని శాశించబడినదని అన్నారు.

50. ఇచ్ఛామరణము అమృత ప్రాప్తి గురించి వివరింపుము?

తప్పుడు కల్పనలతో, ఊహలతో కూడిన గ్రంథములు కనుమరుగవు వరకు ఆధ్యాత్మ సాధన ప్రజలకు తెలిసిరాదని మన ప్రభువులు సెలవిచ్చినారు. ప్రభువుగారి అర్థములో వేదమనగా జ్ఞానము. జ్ఞానుల మాటలే వేదములై ఉన్నవన్నారు. ఆ సాధన చేయుటకు నియమములు ఉండుట వలన విద్యను యోగవిద్య, ప్రాణవిద్య, బ్రహ్మవిద్య అని ప్రభువులు చెప్పియున్నారు. మన దేహమందున్న ప్రాణాగ్ని ఊర్ధ్వ గమనమై మూర్ధములో (బ్రహ్మ రంధ్రము) చేరినపుడు ఆత్మ వికాసమై అమృతపానమై ఇచ్ఛామరణ స్థితి ప్రాప్తించునని మన గురువులు వివరించియున్నారు. మరియు జ్ఞానప్రాప్తి కలుగునని తెలియజేసియున్నారు. ఈ రీతిగా ప్రాణోపాసన నుండి మృత్యువును దాటి అమృతత్వాన్ని పొంది జన్మరాహిత్యాన్ని పొందగలుగుచున్నారని మన గురువులు తెలియజేసినారు.

51. "భిద్యతే హృదయగ్రంథి" హృదయ గ్రంథి పగులవలెను అనగానేమి?

హృదయములో (Heart) గ్రంథులను ఛేదించి అనగా, దేహములో హృదయమనేది ఒక భాగము. ఇందులో అనేక విధములైన నాడులున్నవి. దేహములో వ్యాపించిన వ్యానమనే వాయువు హృదయములో కేంద్రీకరించి అదే విధముగానే జఠరములో ఉన్న అపాన వాయువును వ్యాన వాయువుతో చేర్పించి కన్ను, చెవి, నోరు, ముక్కు నందు సంచరించుచున్న ప్రాణ వాయువు కంఠములో ఉన్న సమాన వాయువుతో చేర్పించి అచ్చటి నుండి పైకి వెళ్లు ఉదాన వాయువుతోపాటు బ్రహ్మరంధ్రానికి వెళ్లి చేరునది



యోగమని, అట్లగుటకు హృదయం నుండి శాఖోపశాఖలుగా హృదయమునుండి దేహములో వ్యాపించిన దానినే "హృదయగ్రంథి" ఛేదించవలెనని అన్నారు. ఆ విధముగా హృదయము నుండి ఒక నాడి మాత్రము 'సుషుమ్న' బ్రహ్మ రంధ్రానికి పోవుచున్నది. దీని మూలకముగా వ్యాప్తి చెందిన వాయువును ప్రాణాన్ని చేర్పించవలె నన్నారు. కొన్ని ఉపనిషత్తుల్లోనూ ఈ విషయము చెప్పబడినది.

"శతం చైకా చ హృదయస్యహ నాధ్య
స్తా సా మూర్ధానమభినిః సృత్యేకా
తయోర్ధ్వ మాయన్నమృత త్వమేతి
విష్వఙ్ఙన్యా ఉత్క్రమణే భవంతి॥"

(కఠోపనిషత్తు - అధ్యా2 - 6వ వల్లి)

52. దేవుడు సర్వాంతర్యామి అను విషయమును వివరింపుము?

ఇచట ఒక ముఖ్యమైన విషయము గమనించవలెను. దేవుడు సర్యాంతర్యామి అనే మాటకు అన్నిచోట్లా దైవమున్నాడు. అనగా సత్తా మాత్రముగా ఉన్నాడని శ్రీ మధ్వాచార్యుల వివరణము. పరమాత్మ నుండి ఉత్పత్తి అయిన అతని శక్తి సత్తా అనగా ప్రాణము. ఇది అన్ని దేహముల బయటా, లోనా ఉన్నదని వివరణ. ఇది విజ్ఞానముతో కూడిన మాట. భగవద్గీతలో "సూత్రేమణి గణావివ" అనగా అన్ని మణులయందు సూత్రమున్నట్లు (దారము) అన్ని దేహములందు ప్రాణమున్నదని అర్థము చేసుకొనవలెను. అన్ని భూతములు నాయందున్నవి నేను వాటియందు లేనని గీతలో చెప్పబడినది. ఈ మాటకు అన్ని భూతములకు భగవంతుడే ఆశ్రయము, అయితే అతనికి ఏ భూతము ఆశ్రయము కాదని అర్థము చేసుకొనవలెను. అతను ఉన్నచోట ఏ భూతము లేదని సూర్యచంద్రాదులు లేరని గీతయందు స్పష్టముగా చెప్పబడినది.

53. తురీయాతీత స్థితిని గూర్చి వివరింపుము?

ప్రాణము ఆత్మతో (ప్రత్యగాత్మ) చేరినపుడు అమృతపానమయి ఆనందానుభవమగుచున్నది. (Bliss) కొంతమంది దీనినే ఆత్యంతిక స్థితి అని భ్రమించుచున్నారు. దీనికి కారణం ఏమనగా "ఆనందో బ్రహ్మ ఇతి విజానాత్" మొదలైన శ్రుతి వాక్యముల కారణముగా సరియైన అర్థము తెలియకపోవడం వలన మార్గదర్శనము కొరవడి ఆ భ్రమలో ఉన్నారు. ఈ భ్రమ యొక్క పరిణామం వలన "ధ్యాన" మనే ప్రయత్నము లేక మబ్బు ఆవరించి మెలకువలేని స్థితి (సుషుప్తి Sound Sleep) వచ్చును. ఈ స్థితిలో అనేక సంవత్సరములు కూర్చున్నవారు ఉన్నారు. ఇందులో జ్ఞానవికాసం అగుటకు సాధ్యముకాదని మన గురువులు అన్నారు. అయితే ఆయుర్ వృద్ధి మరియు కొన్ని సిద్ధులు మాత్రము కావచ్చు అన్నారు.

ఈ రీతిగా భ్రాంతులకు లోనుకాకుండా పరమాత్ముని ధ్యానించ వలెను. ఆయన కృపవల్లనే అజ్ఞాన ఆవరణం తొలగి జ్ఞానప్రాప్తి కలుగును. అప్పుడు తన జన్మ కర్తవ్యము తెలియనగును. ముక్తి మార్గము గోచరించును. కర్తవ్య పూర్ణత్వము ముగిసిన తరువాత ముక్తి లభించునని జ్ఞానులు బోధించియున్నారు. దీనినే తురీయాతీత స్థితి అన్నారు. మహర్షులు దీనిని శ్రేష్ఠమన్నారని మన గురువుగారు బోధించి యున్నారు.

54. ఆదిత్యోపాసన ఏ విధముగా ఆచరించవలెను?

"ఆగాతాహవై కామానం భవతి య ఏతదేవం
విద్వానక్షరముద్గీథ ముపాస్త ఇత్యాధ్యాత్మం" (ఛాందోగ్య)

ఈ రహస్యాన్ని గ్రహించి ఉద్గీథ ఉపాసన చేసే వారి కోరికలు ఫలిస్తాయి. ఇదే ఆధ్యాత్మ సాధన అంటే ఆత్మను తెలుసుకొనే మార్గము



(సాధన-విద్య). బయట సమిష్టి జగత్తులో ప్రాణానికి ప్రతీక సూర్యుడు. దేహానికి బలమైన ప్రాణము జగత్తుకు శక్తి ప్రసార కేంద్రమైన సూర్యుడు రెండూ ఉపాసించదగినవే. ఈ రెండింటి ఉపాసన ద్వారా కూడా శక్తి పెరుగుతుంది.

సూర్యోపాసన అంటే కేవలం ఆదిత్యహృదయం అనే స్తోత్రాన్ని చదవడం కాదు. సూర్య మండలాన్ని తదేక దృష్టితో చూడడం. దీనికి పూర్తిగా సాత్వికాహారం కావాలి. విహారం నియమానుసారంగా ఉండాలి. ఉపాసన తరువాత ప్రవహించే నీరు లేదా సస్య సంపదపై కొంచముసేపు దృష్టి ఉంచడం అవసరము. ఆ విధముగా కాకుండా తమకు తోచిన విధముగా చేస్తే దృష్టి నశించడంలాంటి ప్రమాదాలు కలుగునని మన గురువుగారు విశదీకరించియున్నారు.

55. ఆధ్యాత్మ సుఖప్రాప్తికి మార్గములు ఎన్ని? విశదీకరింపుము?

"ఏష ఆత్మాక పహత పాప్మా విజరో
విమృత్యుర్విశోకో విజిగత్సో
పి పాసః సత్యకామః సత్య సంకల్పః" (ఛాందోగ్య)

అంతరాకాశంలో (బ్రహ్మ రంధ్రములో) మానవ దేహ మందున్నదే ఆత్మ (ప్రత్యగాత్మ). ఆతడు పాపరహితుడు. చావు, శోకం, రోగం, ఇవేవి లేనివాడు. ఆకలిదప్పులు కూడా లేనివాడు. సత్యకాముడు, సత్యసంకల్పుడు. స్త్రీ పురుష భేదం లేనివాడు. ఇక్కడ ఆత్మ సహజత్వము యొక్క అనుభవానంతర స్థితిని వివరించడం జరిగినది. అతడు అనుకున్నదంతా జరుగుతుంది. ఆత్మ సహజత్వం ఇలాంటిదే అయినే మాయావృతుడై అజ్ఞానంలో ఉంటాడు.

ఆధ్యాత్మ సుఖప్రాప్తికి రెండు మార్గాలు. ఒకటి శ్రేయో మార్గము. రెండవది ప్రేయో మార్గము. ఇహలోకములో సుఖము, అ లాగే

మరణానంతరము స్వర్గాది సుఖాలను ముందరి జన్మలో సుఖానుభవాలను కోరుకుంటూ చేసే కర్మ, పూజ, వ్రతం, యజ్ఞం ఇవన్నీ కలిపితే అదే ప్రేయో మార్గము. మూఢులు దీనిని కోరుకుంటారు. మరో వస్తువు ద్వారా లభించే సుఖం శాశ్వతం కాదని గ్రహించి, దేవుని దయతో లభ్యమయ్యే దానము, మోక్షము శాశ్వత సుఖం అని గ్రహించి యోగస్థుడై జ్ఞాన ప్రాప్తి కొరకు ప్రయత్నించడమే శ్రేయోమార్గము. జ్ఞాన మనేది తర్కముతోగాని వినడం ద్వారాగాని లభించదు. ఇది సూక్ష్మాతి సూక్ష్మము. అత్యంత శక్తివంతమైన ప్రణవోపాసన దానికి మూలం. ప్రణవోపాసనలో కలిగే ఆత్మ ప్రసన్నత వల్లనే జ్ఞాన ప్రాప్తి కలుగును. దానిని కోరుకొనేవాడు ఇంద్రియాలను నిగ్రహించుకొని బుద్ధిని నిర్వికారం చేసి పరమాత్మ ధ్యానములో లీనము కావలెను. బుద్ధికి అవతల మహతత్వానికి ఆది దేవుడైన హిరణ్యగర్భుడు ఉండి, అతనికి అవతల అవ్యక్తస్థితి ఉండి దానికి అవతల పరమపురుషుడు ఉన్నాడు. ధ్యాన యోగంతో అతనిని దర్శించి, దీక్ష బుద్ధితో అతనిని తెలిసికొనవలెను. ఆధ్యాత్మ సాధనతో ఆత్మ ప్రసన్నత చేసికొనవలెనని మన గురువర్యులు తెలిపినారు. అప్పుడు పై తెలిపిన విషయములు బోధపడును అన్నారు.

56. ఆత్మజ్ఞానమును తెలిసికొనుట ఎవరి వలన సాధ్యమో వివరింపుము?

దేవుడు విశ్వసృష్టికి మూలకారణమైనను అతడు నిర్లిప్తుడే. అచ్చట "ఇచ్ఛ" లేదు. ఆత్మజ్ఞానము పూర్ణముగా లభించడం మానవజన్మలోనే సాధ్యము. దేవ పితృ లోకాలలో ఇది సాధ్యము కాదని ఉపనిషత్తులందు చెప్పబడినది. కావున దేవుని ఉనికిపై విశ్వాసము ఉంచి ఆధ్యాత్మ సాధన చేయవలెను. జ్ఞాన ప్రాప్తితో ఇంద్రియ సుఖాది మోహములు నశించి పూర్ణసత్య సాక్షాత్కారము అయిన వ్యక్తి జీవన్ముక్తుడు అగునని మహర్షులు, మన గురువుగారు వివరించియున్నారు.



57. ఈ శాంతిమంత్రములకు సాధనా పరమైన అర్థము విశదీకరింపుము?

"ఓం సహనావవతు, సహనౌ భునక్తు, సహవీర్యం కరవావహై
తేజస్వినా వధీతమస్తు, మా విద్విషావహై, ఓం శాంతిః శాంతిః శాంతిః॥"
(కఠోపనిషత్తు)

దైవము మన ఇరువురను రక్షించనీ. ఇద్దరూ కలిసి వీర్యాన్ని పొందుదాం. మా అధ్యయనము తేజస్వికానీ. (సత్య జ్ఞానాన్ని పొంది గ్రహించేందుకు బుద్ధి కుశలత కానీ) మాలో వైషమ్యాలు లేకుండా ఉండనీ. వ్యక్తి యొక్క దేహములోని మనస్సు, ధ్యానానికి ప్రాణ శక్తి యొక్క సహకారము అవసరమై అక్కడ మా ఇద్దరినీ అనేదాన్ని మనస్సు, ప్రాణాలకూ అన్వయించుకొనవచ్చు. జ్ఞాన గ్రహణానికి అవసరమైన గ్రహణశక్తి తీక్షణం అయ్యేందుకు కావలసిన శక్తే "వీర్యం". దాన్ని మేమిద్దరము కలిసి పొందుదామని భావం. ప్రాణ మనస్సుల యొక్క సమ్మేళనపు యోగ స్థితి వీర్యోత్పత్తికి తగినదని అనిపిస్తుంది. అ లాగే అధ్యయనం అనేది అంతర్ముఖ స్థితిలో జరిగే సత్యాన్ని గ్రహించే ప్రయత్నమనే అంశాన్ని గమనించాలి. ప్రాణ మనస్సుల సంగమమే (మిలనం) అధ్యయనానికి సాధనమై, ఆ మిలన స్థితికి ఇంద్రియ వృత్తులతో కల్గే మనశ్చాంచల్యం, దేహంలో కల్మష సంగ్రహం వల్ల కల్గే ప్రాణగతిలోని అవరోధాలన్నీ అంతరించాలనేదే ఈ ప్రార్థన.

58. స్వర్గ లోకము అనగా ఏది? వివరింపుము?

"యోవా ఏతామేవం వేద అపహత్య పాప్మాన మనంతే
స్వర్గేలోకే జ్యేయే ప్రతితిష్ఠతి ప్రతి తిష్ఠతి" (కేనోపనిషత్)

అన్నింటినీ తెలిసికొన్న వ్యక్తి పాపాలన్నిటినీ అంతము చేసి స్వర్గ లోకములో చేరుతాడు. ఇక్కడ స్వర్గలోకమంటే సువర్లోకం కాదు. తాను ఎక్కడ నుండి వచ్చాడో (జీవాత్మ) ఆ స్థానం (బ్రహ్మ).

59. యోగ నిద్ర అనగా నేమి? వివరింపుము?

మనస్సు (జీవ) అనే చేతనములో బయట వ్యాప్తి లేని స్థితిలో చేరినపుడు (సమాధి స్థితిలో) ఆ జీవునిలో సుఖేచ్ఛ ఏమి ఉండునో బహిర్ముఖ స్థితిలో అది మరుగగుచున్నది. ఆకర్షణకులోనై కలుగు చపలత్వమే దీనికి కారణం. దీపానికి ప్రకాశమున్నట్లే, నిప్పు ఉన్నచోట పొగ ఉన్నట్లే, దేహానికి నీడ ఉన్నట్లే, ఈ మనస్సనేది జీవునిలో ఉంటుంది. జీవము లేనపుడు మనస్సు కూడా పోతుంది. రాత్రి వేళలో మనకు సూర్యుడు కనబడకుండినను సూర్యుడు అతని ప్రకాశము ఉన్నట్లే కదా అని మన గురువుగారు అన్నారు. అదే విధముగా సమాధి స్థితిలో మనస్సునకు చాంచల్యము అప్రమత్తత లేకుండిననూ అది శాంతి స్థితిలో ఉండే ఉంటుందని అన్నారు. "సమాధి స్థితినే యోగనిద్ర" అన్నారని వివరణ ఇవ్వబడినది. అయితే ఆ స్థితిలో కూడా యోగికి మెలకువ కలిగి ఉండును. శాంతి, ఆనందానుభూతి ఆ యోగికి ఉంటుందన్నారు శ్రీ అచ్యుత గురువుగారు. తాను తెలుసుకోదగిన మహద్విషయముల గురించి మెలకువ ఉంటుందన్నారు. ఇది యోగి యొక్క ఉచ్ఛస్థితి. ఈ స్థితిలో యోగి తన మనోనేత్రం నుండి ఎంత దూరమైన వాటినైనా చూడగలుగుచున్నాడని శ్రీగురువుగారు అన్నారు.

60. జీవన్ముక్తి , విదేహముక్తి, అనగానేమి? వివరింపుము?

ముక్తి, లేక మోక్షము అనునది జీవన్ముక్తి, విదేహముక్తి అని రెండు విధములుగా తెలిసినవారు చెప్పుచున్నారు. జీవన్ముక్తి అనగా ప్రయత్నము వలన సిద్ధిపొందిన యోగి, ఈ జగత్తులో దేహధారిగా ఉండి, సమాజము యొక్క శ్రేయస్సుకై సమాజములో జీవించుచూ స్వార్థము లేకుండా పనిచేయుట, అని గీత రెండవ అధ్యాయములో వివరించబడినదని శ్రీజయతీర్థులు తెలియజేసినారు. దీనినే స్థిత ప్రజ్ఞత్వము



అనియు జీవన్ముక్తి లక్షణమని తెలిసికొనవలెనన్నారు. జీవన్ముక్త స్థితి పొందకనే విదేహముక్తి సాధ్యము కాదన్నారు. కావున మోక్షాకాంక్షుల మొదటి లక్ష్యము జీవన్ముక్త స్థితిని సాధించుట అన్నారు. దేహ త్యాగానంతరము అట్టివారికి మోక్షమును గూర్చి మాట్లాడుటకు వీలున్నదని మన గురువుగరు బోధించినారు.

61. సృష్టిలో ఉన్న ప్రాణశక్తి మరియు జీవశక్తి మొట్ట మొదట ఎచ్చట నుండి వచ్చినదో వివరింపుము?

సృష్టి విషయమై ప్రభువుల బోధ అనుపమానమైనది. ఇచట నిత్యగర్భమనగా సూక్ష్మ ప్రకృతి అని తలచవలెను. మూలచేతనము యొక్క క్రియా పరిణామము వలన ఉత్పత్తి అయిన రెండు శక్తులు ప్రాణము మరియు జీవము (Individual Soul). వీటియందు మొదట ఉత్పత్తి అయిన శక్తి ప్రాణశక్తి. దీనినే "జ్యేష్ఠ, శ్రేష్ఠ ప్రజాపతి" అన్నారు. దీని స్పందన వలన ఆది భూతమైన వాయువు దానినుండి అగ్ని, జలము, పృధ్వి ఉత్పన్నమైనవని సృష్టి విజ్ఞానులు వివరించియున్నారు. ఈ సృష్టికి అంత్యమనేది లేదని గురువుగారు అన్నారు. దీనికి ప్రభువైనవాడు అంత్యములేని శాశ్వతుడైనందువలన ఈ సృష్టి నిత్యనూతనమై ప్రవాహము వలె శాశ్వతముగా సాగవలసినదే అని ప్రభువులు అన్నారు.

62. దేవుని విషయమై ప్రభువుల అభిప్రాయమును వివరింపుము? దేవుడున్నాడా?

అచ్యుత ప్రభువుల దృష్టిలో ఈ ప్రశ్నయే అప్రస్తుతము. ఈ జీవునికి ఈ దేహము గృహము. దేహమునకు ఇల్లు, ఈ జగత్తు ఇల్లు వలె ఒక కృతి అంతే. ఒక్కొక్క జీవిలో అట్లే వస్తువుయొక్క రూపు రచనలు కూడా కృతియే. కర్త లేనిదే కృతి కాదు. మన నాస్తిక వాదం కేవలం యుక్తి

వాదమే. సంశయములపై వాని అస్తిత్వము ఆధారపడ లేదు. వాటిని దర్శించుటకు ప్రయత్నించుటలో కృతకృత్యత ఉన్నది కాని సంశయ అజ్ఞానమునందు లేదు. దర్శించిన వానికి''వాడున్నాడు'' అని చెప్పునటువంటి అధికారము ఉన్నది. దర్శించనివారికి "వాడు లేదు" అని చెప్పే అధికారం లేదు. ఎందువలన అనగా మనము చూచుచున్న ఎన్నో వస్తువులు, తెలియని ఎన్నో అంశములు విశ్వమునందే కాదు మన దేహమునందే ఉన్నవి. ఇచట మరియొక ముఖ్యవిషయం, ఇంద్రియ దాస్యములో అ లమటించుచున్న మనుష్యప్రాణికి దేవుడున్నాడా? లేడా? అను చర్చ ఎందులకు? మొదట తాను ఇంద్రియదాస్యమునుండి ముక్తి పొందుటకు యోగవిద్యను పొంది సాధించిన తరువాత సృష్టియొక్క రహస్యమును తెలిసికొన్నపుడు మనం దేవుడనుచున్న ఆ మూలచేతనము యొక్క సహజక్రియ పరిణామమే విశ్వము. అంటే సమస్త భూతధాతవులు అన్నది అనుభవం-అగును. అదే "సర్వంఖల్విదంబ్రహ్మ" అనే వేద వాక్యము యొక్క భావమని శ్రీజయతీర్థులు అన్నారు.

63. ద్వైత, అద్వైత విషయములను గురించి శ్రీ ప్రభువుల వారి నిర్ణయాన్ని వివరింపుము?

లోకమంతటా ఈ ద్వైత, అద్వైత వాదం నిండి ఉన్నది. తత్త్వజ్ఞుల వాక్కు వేదోపనిషత్తుల వాక్యములో అచ్చటచ్చట ఈ విషయములను గురించి స్వయం విరుద్ధముగా (Self contradictory) ఉన్నవి. విమర్శకులు అనేకులు అభిప్రాయపడుతున్నారు. అయితే ప్రభువుల అభిప్రాయములో ఒకదాని అనుభవమైనచో మరొక దాని జ్ఞానం తనంతటతానే అనుభవమగునన్నారు. వింతండవాదం నిలువదు. ఈ స్థూలద్వైతం అనగా ద్వంద్వములకు చిక్కి పలవరించు మనస్సు యొక్క అజ్ఞానం తొలగి



ఇంద్రియదాస్యం తప్పి మనోప్రాణ మిలనమై సమాధియందు విశ్రమించి "ఆత్మరతః ఆత్మక్రీడః" అయినప్పుడు బాహ్య జగత్తు యొక్క సంబంధములేని స్వానందానుభవం ద్వైత స్థితి. అచ్చటే ఆగిన ముగియదు.

మరియు శాశ్వతమైన ఆనందదాత ఆనందారాధ్యుడైన పరశ్రేష్ఠుని అస్తిత్వము జ్ఞానముకాగ దాని కృపాదర్శనమైతే అది ద్వైతజ్ఞానము. జీవుని పరిపూర్ణతకు ఈ రెండు స్థితులు అవసరమే అంతాకాదు. ఒకదానికొకటి పూరకము. అద్వైతానుభవము లేని ద్వైత వాదము వ్యర్థము, ద్వైత జ్ఞానము లేనిదే అద్వైతము నాస్తికత్వము అని మన వక్తారులు వివరించినారు. ఈ రెండూ లేనిదే అద్వైత వాదము నాస్తికత్వమన్నారు. మరియు అద్వైతుడయిన పరశ్రేష్ఠుని అస్తిత్వము ఘనత తెలిసికొనకుండుట మదాంధత అన్నారు వారు. కనుక తత్త్వజ్ఞానానికి అనుభవమే మూలమనియు, అనుభవమునకు ఆధ్యాత్మసాధన (బ్రహ్మవిద్య) శరణ్యమనియు విశదీకరించినారు. గ్రంథ పాండిత్యం ఆత్యంతికంకాదని మన గురువులు అన్నారు.

శంకరాచార్యులవారు అజ్ఞానావృతమైనపుడు మనిషి దేహంలో ఉండటాన్ని జీవుడనియు, సహజావస్థ (ఆనందానుభూతి) స్థితమైనపుడు దీనిని ఆత్మ అనియు, ఈ ఆత్మ మూలచేతనమైన పరమాత్మ ప్రతిబింబమనియు చెప్పినారని శ్రీజయతీర్థులు విశదీకరించినారు. మరియు పరమాత్మ నిత్యుడగుటవలన అతని ప్రతిబింబమైన జీవము(ఆత్మ) కూడా నిత్యుడనే చెప్పినారు మధ్వాచార్యులవారు. దీనిని సమ్మతించినట్లుగా పేర్కొన్నారు.

64. అద్భుతములను గురించి జ్ఞానుల వివరణ తెలుపుము?

జ్ఞానులు పూర్ణతత్త్వము తెలిసిన యోగులు. అద్భుతములు అనునవి ఎప్పుడూ చేయరు. కొన్ని వేళలలో భగవదేచ్ఛకు అను గుణముగా లోక

కల్యాణమునకై మహత్కార్యములు చేయవలసినదే. అపుడు వారి మహత్వ ప్రభావమును ప్రజలు చూచుటకు సాధ్య మగును. అవి అద్భుతాలు కావు. యోగవిద్యాభ్యాసికి తనంతతానే లభించును. అణిమాది అష్ట సిద్ధులను తగినంత ఉపయోగించి అద్భుతములను ప్రదర్శించి ప్రజలను భయము, ఆశ్చర్యము, ఆశ, అజ్ఞానము అసూయాదులకు బలి అగునట్లు చేయువారు తాము సాధనలో లక్ష్యము చేరక క్రిందిస్థాయి మనస్సుయొక్క మాయకు బలియై అధఃపతనము పొందుదురు. దీనితో అ లవాటు పడ్డవాడు తన మనశ్శక్తిని కుంగించుకొని కుంఠితుడగును. కావున ఇది తనకు శ్రేయస్సు కాదు. పరులకు ఉపయోగము లేదు అని అచ్యుత ప్రభువులు అన్నారు.

65. యోగి లక్షణాలను గురించి భగవద్గీతలో పేర్కొన్న విషయములను వివరింపుము?

గీతలో యోగి లక్షణాలు ఈ విధముగా వివరించబడినవి.

1. సమత్వం యోగ ముచ్యతే
2. బుద్ధి యోగో విశిష్యతే।
3. యోగః కర్మసు కౌశలమ్।

1) సమత్వం యోగి లక్షణం. దీనినే స్థిత ప్రజ్ఞత అన్నారు. మోహద్వేషాలు, లాభాలాభాలు, జయవిజయాలు, కీర్తి అపకీర్తులు, స్తుతి నిందలు, పాపపుణ్యాలు, జనన మరణాలు, ఇత్యాది ద్వంద్వ భావాలకు అతీతుడైనవాడు. లిప్తాలిప్త స్థితి అనగా కర్తవ్యము చేసియు బంధానికి లొనుగాని స్థితి. అ లాంటి యోగి వర్తన మాట ఎలా ఉంటుందంటే, మాటే జ్యోతిర్లింగము – అనగా చీకటిని పోగొట్టు వెలుతురు వలె అతని



మాటలు అజ్ఞాన నివారణకు సహకరిస్తాయి. అతని కృతి పరులకు ఆదర్శమై నిస్వార్థతతో నిష్పక్షపాతముగా ఉండును. ఈ విషయమై భగవద్గీత రెండవ అధ్యాయములో వివరించబడినదని మన వక్తారులు విశదీకరించినారు.

2. బుద్ధియోగో విశిష్యతే అనగా యోగిలో శ్రేష్ఠమైన బుద్ధిని కాననగునని భావము. జ్ఞానప్రాప్తి కాకుండా కేవలం విచారశక్తివల్ల ధర్మాధర్మ, యుక్తాయుక్తతల విషయమై నిర్ణయించుట సాధ్యపడదు. జ్ఞానము కానిదే అనగా ఆత్యంతిక సత్యమైన దైవాన్ని దర్శించి తెలియకనే కేవలం విచారం వల్లనే తెలుసుకున్నామనే అహంకారంతో కార్యం చేయువారు ధర్మాధర్మ యుక్తాయుక్తతలు ఏమన్నది నిర్ణయించలేరు. ఆ నిర్ణయిక శక్తి బుద్ధి ప్రకారం భగవంతుని కృపవల్ల లభ్యమైన జ్ఞానికి మాత్రం సాధ్యం. ఆజ్ఞానము వెలుతురులో క్రియ చేయువాడే యోగి. బుద్ధికుశలత అతనిలో ఉండుటవలన అతని నుండి కేవలము ధర్మకర్మయుక్తమైన క్రియ నడచును. అందువలన లోకకల్యాణమగును.

3. యోగః కర్మసు కౌశలం – శ్రీకృష్ణుడు సమత్వముగల యోగి, ధర్మ రక్షణకై దండోపాయాన్ని ఆశ్రయించాడు. యుక్త కార్య నిర్వహణలో మేలు, కీడు అనే భావములేకనే రథసారథి అయినాడు. లోకహితమే ధ్యేయముగా తాను క్రియ చేసినను నిర్లిప్తుడని కృతిలో నిర్ణయించినారు. అధర్మాన్ని అంతము చేయుటకు సామ, దాన, భేద, దండోపాయములు, అబద్ధము, మోసము, ఏదియుక్తమో ఆ రీతిగా చేయు లిప్తాలిప్త స్థితియే యోగ లక్షణము. ఆ విధముగా క్రియ చేయువాడే యోగీశ్వరుడు. అందువలననే శ్రీకృష్ణుని జ్ఞానులు యోగీశ్వరుడని పిలిచియున్నారని శ్రీజయతీర్థస్వాములు వివరించిరి.

66. శ్రీ అచ్యుతగురువుల విషయమై శ్రీజయతీర్థులవారు వివరించిన విషయములను కొన్నింటిని తెలుపుము?

శ్రీ ప్రభువులు ఎవరు? అతని జన్మమెందులకు? అతను చేయగల లోక కల్యాణమేది? అనే విషయమై శ్రీ జయతీర్థస్వామివారు వివరించినారు. శ్రీ అచ్యుతప్రభువులు తమ అజ్ఞాతవాసానికి ముందే కొన్ని విషయాలు తెలిపిరట. తాము లోకదృష్టిలో చనిపోయిన తరువాత తమ అనుయాయులు శ్రీప్రభువుల దేహాన్ని చెక్కపెట్టెలో ఉంచి భూస్థాపితము చేయాలని, తాము కావలసినపుడు బయటకు వచ్చుటకు ఆ పెట్టెగాని, సమాధికాని అడ్డురాదని చెప్పియుండిరట.

తాము ఎవరనే విషయం బయట ఉన్నపుడు సూక్ష్మముగా తెలిపిరట. స్థూలముగా చెప్పాలంటే నేను ఈ లోకములో అందరికంటె చిన్నవాడను, జగత్తు సేవకొరకు వచ్చిన వాడను అన్నారట. అయితే సూక్ష్మతః నా విషయము వేరే. ఇది చెప్పకూడదు. ఎందుకనగా శిష్టాచారమునకు విరుద్ధము. అహంకారము అనిపించుకుంటుంది. అయినా చెప్పుచున్నాను. నన్ను తెలిసికొన్నవారెవ్వరూ సమాజంలో లేరు. కాబట్టి సత్యమేమంటే సూక్ష్మతః నేను అందరికంటె పై స్థానము వాడిని, అన్నారట. అయినా తాను దేవుడనని ప్రభువులు ఎప్పుడూ చెప్పలేదట. దేవుని ప్రసక్తి వచ్చినపుడు తినరానిది తిని ఏమేమో పలుకుచున్న నాలుకతో దేవుడు అనే పవిత్ర శబ్దాన్ని ఉచ్చరించకూడదన్నారట. దేవుడనగా ఏమని తెలిసినవారు ఎవరున్నారు? దేవుని దర్శించినవారు ఎలా ఉన్నాడని వర్ణించలేదు. వర్ణించిన వారు దర్శించలేదు. ఆ దైవాన్ని గురించి మేము ఏమి తెలుసుకోగలము? శబ్దాలనుండి భాషతో అతనిని వర్ణించగలమా? అనుచుండిరట.



అద్భుతముల ప్రసక్తి వచ్చినపుడు ఆ విధముగా చేయువారి ఆత్మశక్తి నశించును అన్నారట. జ్ఞాన వికాసం కాదని సెలవిచ్చినారట. కొన్ని అద్భుత విషయములు చేసిన అగస్త్యులు, శ్రీ ఆంజనేయస్వామి ఇత్యాదులు అజ్ఞానులా? అను ప్రశ్నకు సమాధానంగా వారు చేసినవి అద్భుతములు కావు, వారి ఆత్మ శక్తి వలన సహజముగా నడిచిన క్రియలు అని గురువుగారు అన్నారట. అది కూడా లోక కల్యాణానికేకాని వ్యక్తి కీర్తి ప్రతిష్ఠలకు కాదు అన్నారట శ్రీ ప్రభువులు. శ్రీఆంజనేయస్వామి సముద్రలంఘనము చేసినారనేది కల్పితము కాదు. దానిని చూపించగల సమయము వచ్చినపుడు చూపించవలసి వస్తుందన్నారట. అవతారముల ప్రసక్తి వచ్చినపుడు అవతారమనే శబ్దమే అ పూర్ణాన్ని తెలియజేస్తుంది. అవతారముల వలన కలుగు మహత్వము తగిన రీతిగా వర్తించి ముగుస్తుంది. అయితే దైవ అవతారమనేది సాధ్యంకాదన్నారట. ఈ భూగ్రహముపైన అనగా ఈ భూగ్రహము, దైవత్వ శక్తిని భరించ లేదన్నారట. తాము పలుమార్లు జన్మ తీసికొని లోక సేవ చేసినారట. ఈ మారు తమ కార్యరంగము ఒక దేశానికేకాదు మొత్తం ప్రపంచమన్నారట. జగత్తులో ధర్మము, తత్త్వముల గురించి తప్పు అభిప్రాయములను తొలగించి, భక్తి సాధనలు వివరించి, వైరాగ్యమనగా సమాజమునకు దూరముగా ఉండు స్వార్థము కాదని, వసుదైక కుటుంబ భావన ఉండవలెనన్నారట. విశ్వసోదర భావాన్ని, ప్రేమని ఆదర్శయుతముగా ఆచరించి చూపి, జ్ఞాన వికాసమునకు ఏకైక సాధనమైన యోగవిద్యను అందరూ అభ్యసించునట్లు బోధించి, ఆవిద్యనుండి ఇచ్ఛామరణం, జ్ఞానం కలిగి సమర్థ జీవనము నడుపుటే లోక కల్యాణమన్నారట. ఇదే లక్ష్యముగా ఆకార్యాచరణమునే ప్రోత్సహించుచూ వచ్చారని శ్రీజయతీర్థస్వామి వారు విశదీకరించినారు.

అసమర్థత ఔదార్యము కాదన్నారట. దొరకని దానిని వదలివేయుట వైరాగ్యం కాదు. మూఢత్వము భక్తి కాదు. తపస్సు ద్వారా జ్ఞానార్జన చేయవలెను. ధర్మ బద్ధమైన జీవనాన్ని సాగించుచూ అధర్మ మార్గములో ఉన్న వారిని శిక్షించి ధర్మ మార్గానికి తేవలయును. ప్రభువులు మూఢ భక్తిని ఆమోదించువారు కారు. దైవమందు తమకు భక్తి ఉన్నదని కాని స్థూలములైన పూజలు, భజనలు ఇత్యాది ఆడంబరాలను వారు అంగీకరించలేదు. అ లాగే తాము విరక్తులని ప్రదర్శించు కాషాయాది వేషములను వారు సమ్మతించలేదు. సోమరులను తయారుచేసి ముక్తిమార్గమని చెప్పువారికి మన్నన ఇవ్వలేదు. ముందు రాబోవునది సన్యాసుల యుగము కాదు విజ్ఞానయుగము. అదే విధముగా తపస్వుల యుగమని చెప్పుచుండెడి వారట.

తోటి మానవులు తిండిలేక, గుడ్డలేక తమ తెలివిని మెలకువ చేసికొను అవకాశములేక, అజ్ఞానం, దారిద్ర్యం, దైన్యం, వ్యాధి బాధలను అనుభవించుచుండగా, అట్టివారికి సానుభూతి సహాయము చూపించక, సంకుచిత భావముతో వర్తించువారు ఉన్నంతవరకు శాంతి లభించదు అన్నారట ప్రభువులు. ప్రయత్నము మానవుని కర్తవ్యము. ఫలితము దైవానుగ్రహము అన్నారట గురువుగారు.

పురుష ప్రయత్నానికి దైవకృప దొరకడం తథ్యమని అది తమ యొక్క విశ్వాసమని అన్నారట. ఒక సిద్ధపురుషుని నుండి తమకు బ్రహ్మోపదేశము లభించినదని, తనకు తన గురువుగారికి కేవలం కొన్ని నిమిషములే సంబంధమని, తనకు ఆ విద్యలో ఆత్మ విశ్వాసం ఉన్నదన్నారట మన గురువుగారు.



తాము అపక్వాహారము స్వీకరించుచూ తొమ్మిదిన్నర సంవత్సరములు ఆధ్యాత్మ సాధన చేసినారట. ఈ కాలములో తమకు విశేష అనుభవములు కలిగినవని, ఆత్మ బలము వృద్ధి చెందినదని, జగత్తు కల్యాణ కార్యమును నిర్వహించుటయందు విజ్ఞానము కూడా బోధించబడినదని చెప్పినారట.

ప్రభువులు ఉదయము నుండి సాయంత్రము వరకు సూర్యునికి అభిముఖముగా వీరాసనముపై కూర్చుండి సూర్యప్రకాశమును చూస్తూ, సాయంత్రానికి, ప్రవహించే నీరు, పచ్చని చెట్లు చూస్తూ విశ్రమించేవారట. ఈ విధముగా సూర్యోపాసన ఒకటిన్నర సంవత్సరములు తుంగభద్రానదీ తీరములో ఆచరించి అనేక విషయములు తెలుసుకొన్నారట. ఆశ్రమ ధ్యేయాన్ని గురించి, సాధనా క్రమాన్ని గురించి, తపస్సును గురించి, వివరించుచూ, సంసారులు ఈ విద్య చేయుటకు అర్హులని చెప్పినారట. ఇంకనూ అనేక విషయములను గూర్చి ఎప్పటికప్పుడు చెప్పుచూ వచ్చారని, వక్తారులైన శ్రీవిజయింద్రస్వాములవారు, శ్రీ జయతీర్థస్వాములవారు, ఆశ్రమములో తెలియజేయుచూ వచ్చినారు.

67. త్రిగుణాతీతుని విషయమై వివరింపుము?

ఆత్మునకు ఇంద్రియమూలకముగా త్రిగుణాత్మకమైన స్థూల ప్రకృతికి అంటుకొన్నపుడు మాత్రము అనుభవమునుండి తెలియనగునని ప్రభువులు అన్నారు. బుద్ధిని (వివేకము) సాత్వికమని, మనస్సును (ఆశ) రాజసమని, గర్వమును (అహంకారము) తామసమనియు, ఈ రీతిగా ప్రకృతి లిప్తమైనపుడు ఆత్మ ప్రకృతివలె త్రిగుణములచే కూడియుండునని ప్రభువులు అన్నారు. బహిర్ముఖ స్థితిలో చదివి, విని, ఊహించి, తెలిసికొన్నదంతము (వేదములని) త్రిగుణాత్మక వాదములని ఆత్యంతిక సత్యాన్ని తెలిసికొనుటకు

సమాధి జ్ఞానాన్ని బోధించబడినది. భగవద్గీతలో "నహి జ్ఞానేన సదృశం" అన్నారు. జ్ఞానముతో సమానమైన పవిత్రమైన వస్తువు ఏదీ లేదన్నారు. యోగసంశుద్ధిని పొందినవారు ఈ జ్ఞానాన్ని తమలోనే పొందుచున్నారు. త్రిగుణాతీతుడు అయిన తరువాత ఇది కలుగునని శ్రీ జయతీర్థస్వాముల వారు అన్నారు. అగ్ని ఏవిధముగా కట్టెలను భస్మము చేయునో, ఆవిధముగా జ్ఞానము కర్మలనన్నింటిని భస్మముచేయును. పాపముల కర్మాచరణముకాని, పుణ్యముల యొక్క ఆశకాని ఉండబోదు. ఆత్మని సహజస్థితి చిన్మయత (జ్ఞానానంద స్థితి). అందువలన తనను తాను తెలిసికొనకనే పూర్ణుని తెలిసికొనుట అసాధ్యమని మన గురువులు అన్నారు. ఈ స్థితులు అనుభవము కావలెనన్నచో త్రిగుణాతీతుడు కావలెను. ఇది ప్రాణవిద్యవల్లనే సాధ్యమని ప్రభువులు అన్నారు. ఇంద్రియమూలకముగా చేయు పద్ధతివల్ల స్వస్వరూప జ్ఞానము కానేరదన్నారు వారు.

68. త్రిగుణములలో ఏది శ్రేష్ఠమైనదో తెలుపుము?

త్రిగుణముల విషయమై జయతీర్థస్వామి వివరణ ఇచ్చియున్నారు. ప్రకృతి త్రిగుణాత్మకమైనదనియు, అందలి జీవరాశులన్నియు సత్వ, రజో, తమో గుణములలో ఏదో ఒక గుణ ప్రాధాన్యత కలిగియుండునని సర్వ విదితము. సత్వగుణ లక్షణములైన శాంతి, అంతర్ముఖత, దయ, సమభావము కలిగియుండునది. రాజస లక్షణములైన స్థూల చైతన్యము, దుష్ట శిక్షణాది క్షత్రియ ప్రవృత్తి. ఇది శ్రీ మహావిష్ణువునందు కనబడుచున్నది.

"నా ౘ విష్ణుః పృధివీ పతిః" అను నానుడియందే రాజులు విష్ణు గుణ ప్రాధాన్యమైన జగద్ రక్షణాభారమును వహించి విష్ణువు యొక్క ప్రతినిధులుగా వ్యవహరించు విషయములు మనకు కనబడుచున్నది. అత్యధిక సాత్వికమునందు మనస్సు లయించుటయే బ్రహ్మత్వము. అచ్చట



సంకల్పముకూడా ఉండదు. అదే విధముగా గాఢ తపస్సులో మునిగిన వేళ సుషుప్తి అనగా నిద్రావస్థలో తన ఉనికియందే ప్రజ్ఞ లేక స్థూల సూక్ష్మ క్రియలకు విలువ ఇచ్చు ఎట్టి ప్రయత్నము లేదు. సాత్వికమునందు బ్రహ్మత్వమునందు తన అస్తిత్వము ఉన్నది. అనుభవము ఉన్నది. తామసగుణమునందు సర్వము శూన్యము. మొత్తము మీద ఈ రెండు గుణములనుండి క్రియ అసంభవము. క్రియ ఫలించుటకు రాజసము, తామసము అవసరము. బ్రహ్మ జ్ఞానులందు శ్రేష్ఠుడెవరు? కేవలము ఆత్మరతుడా? ఆత్మక్రీడుడా? ఈ రెండూ కలిగిన క్రియావానుడా? ఉపనిషత్తులందు–

"ఆత్మరతః ఆత్మక్రీడః క్రియావాన్ ఏష బ్రహ్మవిదాంవరిష్ఠః" అనుటయే జ్ఞానుల మతమని తెలిసికొనవలెను. క్రియా ప్రాధాన్యమైన రాజసమునకే ప్రాధాన్యమిచ్చిరి. ప్రప్రథమమున అజ్ఞానమువలన పుట్టిన కర్మ అనంతరం జ్ఞానోత్తరకర్మ, జ్ఞానయుక్త కర్మల యందు లిప్తత లేనందున బంధనము కాదు. ఈ బంధనము విడచుటకు కారణము జ్ఞానియగుటచే లభ్యము కానున్న బ్రహ్మత్వము (సాత్వికపుచివరిదశ) శ్రేష్ఠమనిరి. దానిని పొందుటకు ప్రయత్నము అవసరము. ప్రయత్నమే రాజసలక్షణము. అందువలన రాజసమే శ్రేష్ఠమన్నారు.

జీవుల దేహములందున్న చేతనమే రాజసము. ఆ చేతనత్వము పొందెడి ద్వివిధ విశ్రాంతుల స్థితియే సత్వగుణ తమోగుణములు. ఈ అన్ని జీవరాశుల ఉత్పత్తికి మూలచేతన స్వరూపమునకు మొదలైన నిత్య, సత్య దేహుడు ఒకడున్నాడు. అతడినే దేవుడని, పరమ స్వరాట్ అనియూ చూచినవారు చెప్పుదురు. అతడి కేశమాత్రపు 'వెంట్రుక మొన అంతటి' చైతన్య శక్తి సంభవించినది. అందుకే అతడిని కేశవుడనిరి. అతనినుండి

బహిర్గతమై, వ్యాప్తిచెంది, లోకలోకాంతరములందు సర్వప్రాణుల ఆత్మ స్వరూపావిర్భావ కారణమైన చైతన్యమునే ఈశ్వర చైతన్యమని, విరాట్ శక్తియని, అందు మూలమున సృష్టి, స్థితి లయములన్నియు నడుచుట చేత దానిని దైవీశక్తి, దైవత్వము, సర్వవ్యాపకమైన విషయాన్ని వర్ణించినారని శ్రీ జయతీర్థస్వాములవారు అన్నారు.

69. "త్రైగుణ్య విషయా వేదాః, నిస్ త్రైగుణ్యో భవార్జున" అనే గీతా భావాన్ని వివరింపుము?

ఈ సృష్టి విధానాన్ని గురించి ఎవరూ ప్రార్థించలేదు. పరిపూర్ణుని ఆనంద స్పందనే సృష్టికి కారణము. అచ్చట తామసమే లేదు. అతనే రాజసమును (బహిర్దశ క్రియలను) ఎవరు కానరు. దానికై ఎవరు తపించి బహిర్ముఖులై జగత్ కల్యాణ కార్యమై,ఎవరును ప్రార్థించలేదు. కావున నిజమైన రాజసము (ద్రైవము) స్వాభావికము, ఛాయా మాత్రముగ (అజ్ఞాన స్థితిలో) క్రియాప్రవృత్తి జీవులందు కాంచి దాని సుఖానుభవములను కని అది బ్రహ్మత్వము కంటె తక్కువ అనిరి. ఈ జీవుల పరిజ్ఞాన స్థాయినిగల త్రిగుణములందు సాగినచో లోక కల్యాణకార్యం కాదనియే, శ్రీకృష్ణ పరమాత్మ మూలతత్వమును తెలిసినవాడు కావున–

"త్రైగుణ్య విషయా వేదాః, నిస్‌త్రైగుణ్యో భవార్జున" 2–45 అన్నారు. గుణాతీతుడు కమ్మని అన్నారు. బ్రహ్మ సృష్టియందలి అస్తవ్యస్థత సరిదిద్దుటకై ఆ బ్రహ్మ పుట్టుటకు కారణమైన అంశావతారము అన్నపుడు బ్రహ్మ బోధనలకంటె పైస్థాయి (పై మెట్టు) జ్ఞానాన్ని శ్రీకృష్ణుడు బోధించినా డనుటలో ఆశ్చర్యమేమున్నది? వేదములు అబద్ధములనికాని, బ్రహ్మ అజ్ఞాని అనికాని కాదు. తత్వ సమన్వయము చేసికొనగల విచారశక్తి లేనిదే జ్ఞాన వికాసము కాజాలదు.



పరిపాలనాధికారులైన బ్రహ్మ , విష్ణు, మహేశ్వరులందు జీవులు తెలిపిన సత్వ, రజో, తమోగుణములు, ముగ్గురిలోను ఒక గుణము విశేషించి ఉన్నందున వీరు పూర్ణులు కారని మనగురువులు అన్నారు. ముగ్గురిలోను కొంతవరకు జ్ఞానాత్మక క్రియ విష్ణువునందు ఎక్కువ ఉండుటవలన అతడు ఉత్తముడని దైవత్వమునకు చిహ్నమని, జ్ఞానముచే గౌరవించబడినదని శ్రీజయతీర్థులవారు వివరించినారు.

70. ఆధ్యాత్మసాధన విషయమై శ్రీజయతీర్థస్వాములు పొందిన అనుభవములను తెలియజేయుము?

శ్రీజయతీర్థస్వాములవారు తమ సాధనా అనుభవములను ఈ విధముగా సెలవిచ్చినారు.

జయతీర్థస్వాములు అచ్యుతప్రభువుల నుండి ఉపదేశమైన తర్వాత ఒక సంవత్సరము పర్యంతము ఆశ్రమములోనే ఉండి జపము చేసినారట. సమయాసమయములు లెక్కింపక వీలు దొరికినపుడంతా సాధన చేయుచుండెడివారట. ఎక్కడ కూర్చున్నా, నిల్చున్నా, నడయాడుచున్నా జపము చేయుచుండిరట. ఒక్కొక్కసారి తూలి పడుటయు జరుగుచుండెదట. శ్రీస్వామి విజయాంధ్రులవారు ఒకసారి ఆశ్రమములో తూలిపడి పోయినారట. అపుడు "శుచౌ దేశే ప్రతిష్ఠాప్య స్థిరమాసనమాత్మనః" (6–11) అని గీతాచార్యులు నిర్దేశించిన విషయాన్ని ఆలోచించినారట. అనగా ఆసనముపై కూర్చుని నిర్దేశించిన సమయములో సాధన చేయవలెనని తెలిసికొన్నారట. ఆ రోజునుండి ఆ విధముగా చేయుటమాను కొన్నారట. త్రిసంధ్యలందు మాత్రమేగాక తీరిక దొరికినపుడు మధ్యాహ్నము కూడా జపము చేసేవారట. అందువలన దేహబాధలు ఆరంభమైనవన్నారు. ఈ విషయము ప్రభువుల దగ్గర చెప్పుటవలన, వారు కర్తవ్య నిర్వహణకే

పగలు. ఆ సమయములో ప్రాణజపము చేయకూడదని వారించినారు. సూర్యాస్తమయము తరువాత, సూర్యోదయము లోపలగల సమయమే ఆధ్యాత్మ సాధనకు, తపస్సునకు తగిన సమయమని ఆనతిచ్చారట ప్రభువులు. ఆ విధముగా జపము సాగిన తరువాత దేహబాధలు తొలగిపోయాయి అన్నారు. సాధనలో అనేకములైన దర్శనాలు కలిగినవని, తత్త్వానుభూతులు కలిగినవని శ్రీజయతీర్థస్వాములవారు తెలియజేసినారు.

71. సాధకుడు సన్యాసి కావలెనా? లేక ప్రాపంచికుడై ఉండవచ్చునా? దాంపత్య జీవితము సాధనకు ఆటంకమా?

దాంపత్య జీవనము సాధకునికి సహకారియే అన్నారు ప్రభువులు. ఆటంకము కాదన్నారు. ఆహార వ్యవహారములలో సంసారులందు సామాన్యమైన ఒక నియమము క్రమబద్ధత ఉండును కదా. సంసార పోషణాభారము వహించిన సంసారికే ఆవశ్యకమైన సంయమనము, మనోపక్వతలు స్వాభావికములై ఉండును. ఇది సన్యాసికి బహుశా సాధ్యంకాదన్నారు శ్రీస్వామి జయతీర్థులవారు. సమాజమున సాధకులు ఆదర్శ సంసారులై సాగవలెను. అట్టివారివలన సత్‌సంతానం ఉదయించి సమాజోన్నతి సమకూడును. అందువలన సాధకుడు సంసార త్యాగము చేయడని మన గురువులు అన్నారు.

మానవుడు జగత్ కల్యాణానికి నిర్వర్తింపవలసిన తన కర్తవ్యం సంపూర్తిగా చేసినంతట సహజముగా వచ్చిన స్థితియే సన్యాసం. సంసారం విడచుట సన్యాసము కాదని అన్నారు మనగురువులు. అట్లు చేసిన అది ద్రోహమగును. నిజమైన సన్యాస స్థితి పొందిన వ్యక్తి బహుశా సమాజ మధ్యమున ఉండలేడు అని తెలియజేసినారు.



72. ఆత్మ, మనస్సు అనగానేమి?

మనస్సు, బుద్ధి, చిత్ అహంకారములనునవి ఆత్మ యొక్క అంతః కరణములని చెప్పుదురు. ఆలోచించినచో ఈ నాలుగున్ను ఆత్మలో కలిగెడి వేరువేరు స్థితులని మన గురువులు తెలియజేసినారు. ఇచ్ఛ కలిగినపుడు అగునది మనో వ్యాపారమని, విమర్శించు కొన్నపుడు బుద్ధి అనియు, నిర్ణయాత్మకశక్తి చిత్త మనియు, నేను శక్తుడను చేయగలను ఇత్యాది భావము కలిగినపుడు అహంకారం అని చెప్పబడుచున్నదని గురువుగారు అన్నారు.

ఇంద్రియ సంబంధమైన సుఖాదులకు చిక్కి చింత, ఆశ, మోహమునకు చిక్కిన స్థితిలో జీవి అనియు ఇంద్రియాతీతమైన అంతర్ముఖత ఆనందానుభవస్థితిలో ఆత్మ అనియు దేహమునందలి చేతనమునే జ్ఞానులు వర్ణించినారు. మోహమే మనస్సుయొక్క చాంచల్యానికి కారణం. వ్యక్తి వస్తువుల సహవాసంలో మోహం అధికమగును. సత్సహవాసం, గ్రంథపఠనం మోహమును కొంతవరకు చాంచల్యమును తగ్గింపచేయును. అయినను సంపూర్ణస్వాతంత్ర్యము పొందుటకు చేయు యోగవిద్యా సాధనయే శరణ్యము. మనస్సు యొక్క కల్మషములు పోవలెనన్న మనోప్రాణముల మిలనము కావలెను. సాధనలో ఈ విషయము తెలియనగును.

73. ప్రాణ మనగానేమి? ఆత్మ, మనస్సులకంటె ప్రాణం ఎట్లు భిన్నమైనది?

ప్రాణము సృష్టిలో మొట్టమొదట వచ్చిన శక్తి. దీనినే ఉపనిషత్కారులు “జ్యేష్ఠ శ్రేష్ఠ ప్రజాపతి” అన్నారు. అయితే ఇది సృష్టిలో జ్యేష్ఠమైనదే కాని శ్రేష్ఠత్వం లేదని ప్రభువులు అన్నారు. అనగా ప్రాణంలో జ్ఞానం లేదు, క్రియ మాత్రమే ఉన్నదన్నారు.

ప్రాణమన్నది దేహములో ఉన్న క్రియాశక్తి. ప్రాణమున్నంతవరకే ఆత్మ దేహమునందుండుట సాధ్యమగును. ప్రాణమున ఈశక్తి తండ్రివలన శుక్లము ద్వారా తల్లి గర్భములో ప్రవేశించి దేహ నిర్మాణము గావించుకొనును. దీని ద్వారా ఆత్మ శిశు దేహము చేరును. శ్వాసక్రియ జరగడం ప్రాణునివలననే. ప్రాణునకు విశ్రాంతి లేదు. కాని ఆత్మ మనసులకు నిద్రా జాగరణములను స్థితులు ఉన్నవి. ఆత్మ మనస్సులకంటె ప్రాణము భిన్నమే. ఇవి అన్నియు సాధనానుభవములో తెలియనగును.

కఠోపనిషత్తులో "మధ్యేవామన మాసీనమ్" అన్నారు. ప్రాణ, అపాన వాయు ప్రక్రియ నడచు మధ్యలో ఇది ఆడుచున్నదన్నారు. దేహమునందు ప్రాణవాయువును పైకి లాగుచు, అపాన వాయువును క్రిందికి నెట్టుచున్నది. దేహములో అణు రూపమైన ప్రాణచైతన్యాన్ని (వామనుణ్ణి) విశ్వములోని దేవతలందరూ ఉపాసించుచున్నారని ఉపనిషత్కారుల అభిప్రాయము. విశ్వములో మూలశక్తి "ప్రాణశక్తి" అని "బ్రహ్మజజ్ఞం" అన్నారు, మహర్షులు. విశ్వములో ఉన్న ప్రాణశక్తిని ఆదిదేవుని "పురుషు" డన్నారు. దీని విషయమై మన వక్తారులు సూక్ష్మముగా వివరించినారు.

74. దైవమును కాంచు మార్గముల గూర్చి సూక్ష్మముగా విశదీ కరింపుము?

ఈ ప్రశ్నకు సనత్సుజాతీయ గ్రంథ మందలి "యోగినః ప్రపశ్యంతి భగవంతం సనాతనమ్" అను వాక్యమే సరియగు సమాధానము. తన మహాతపస్సుచే మహేశ్వరుని మెప్పించి పాశుపతాస్త్రం పొందిన అర్జునునితో భగవానుడు "తపస్విభ్యో అధికో యోగీ, తస్మాత్ యోగీ భవార్జున" అన్నాడు. అనగా తపస్వికంటె జ్ఞానికంటె యోగి మతం గొప్పది. కర్మానుష్ఠానముకంటె యోగమే శ్రేష్ఠం. కావున అట్టి యోగివికమ్ము అని నిర్దేశించినాడు. యోగి అయినప్పుడే మానవత్వం పూర్ణవికాసం చెందును. అట్టివానికి దేవుని దర్శనం సాధ్యపడును. దేవుని దర్శించు మార్గము యోగమొక్కటే. యోగ మనగా స్థూలేంద్రియములతో సాధన కాదు.



"సర్వ ద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ
మూర్ధ్న్యా ధాయాత్మనః ప్రాణ మాస్థితో యోగధారణమ్"
(భగవద్గీత - 8-12)

అనగా ముక్కు మొదలగు ద్వారములతోకాక హృదయ మందున్న ప్రాణుని మనోప్రాధాన్యతతో మూర్ధ్నా (బ్రహ్మరంధ్రము) ఆత్మ సామీప్యమునకు చేర్చు స్థితియే యోగధారణము. ఇది కేవలము దేహమందలి ఆంతర్యం. అందున్న మార్గము.

శ్రవణము పఠనములతో తెలిసికొన్నంత మాత్రమున యోగి కావడం సులభం కాదు. "ధీరాఃతేషాం సుఖం శాశ్వతం నేతరేషాం" అని ఉపనిషత్తు చెప్పిన విధముగా తన సాధనా పథములో కలిగెడు ఆటంకములను అతిక్రమించి సాగువానికి సాధ్యమని మన గురువులు అన్నారు. లక్ష్యము (గురి) చేరుటకు విచలితుడు గాక నిష్ఠతో సాగవలెను. ఎంతకాలము? ఎంత సమయము సాధన సాగించవలెను? ఇత్యాది బాల బుద్ధికి అయ్యేది అసాధ్యము. ఉపనిషద్ ఋషులు "జిజీవిషేచ్ఛతం సమాః" అనగా నూరు సంవత్సరములు బ్రతికి సాధన చేయవలెనన్నారు. శ్రద్ధ, ఏకాగ్రత, నిష్ఠ, జన్మాంతరాలకు అనుగుణంగా సాధకుడు గురి చేరగలడు.

75. శ్రీ అచ్యుత గురువుగారు సాధన విషయమై తెలియ చేసిన కొన్నింటిని పేర్కొనుము?

శ్రీ అచ్యుతస్వామిగారిని గురించి మన వక్తారులు శ్రీ స్వామి విజయీంద్రులవారు, శ్రీ జయతీర్థస్వాములవారు కొన్ని వివరములు తెల్పినారు. ప్రభువులు సామాధి గైకొనక ముందు, స్థూలతః వారితో ఉండి మార్గదర్శనము చేయుచున్నపుడు మహిమలు ఏవియు చూపించి ఉండలేదట. మహిమల ప్రదర్శనము వలన ఆత్మశక్తి అపవ్యయము అగుటయేగాక అహంకారము ఆవహించి జ్ఞాన వికాసమునకు ఆటంక మేర్పడునని ప్రభువులు అన్నారట. అద్భుతములు చూచి జనులు భయభ్రాంతులు అగుదురేగాని జ్ఞానాకాంక్షులు కాజాలరని అనుచుండిరట. లోక కల్యాణానికి జ్ఞానులైన ఋషులు తమ తపశ్శక్తిని వినియోగించెదరు. అదే ధర్మము అది వారి సహజ క్రియేగాని మహిమా ప్రదర్శనం కాదు. నేను అదే విధముగా విశ్వశ్రేయస్సునకై ఒక కార్యము చేయవలసి ఉన్నదన్నారట. చేయుదును. కానీ నేను చేయునట్టిది పూర్వము ఎవ్వరూ చేసియుండరు. ఇక ముందు ఎవ్వరూ చేయజాలరు అని ప్రభువుగారు వక్కాణించిరట. అంతగా శక్తి సంపన్నులయ్యును "కర్మణ్యేవాధికారస్తే మాఫలేషు కదాచన" "ప్రయత్నాద్యతమానస్తు" అనెడి గీతా వాక్యములను బోధించుచూ అదే విధముగా తాము వర్తించుచూ ఆదర్శగురువులై లభించడము తమ భాగ్యమని మన వక్తారులు వివరించియున్నారు. సరళ జీవనము, ఉన్నత ఆదర్శముతోనే మానవుడు తన జీవన సార్థక్యము బడసి లోక శ్రేయస్సాధనలో సేవాభాగ్యుడు కాగలడని పూజ్య ప్రభువులు ఆచరణతోనే చూపించిరని మన గురువులు అన్నారు.



జ్ఞానము లేకుండా కేవలము కర్మతోగాని, కర్మాచరణం లేకుండా కేవలం జ్ఞానంతో గాని సామాజిక కల్యాణం సమకూర దన్నారట. యోగము(జ్ఞానయుత కర్మాచరణ) చేతనే ప్రాప్తించునని ప్రభువులవారి బోధనా సారాంశము అని మన వక్తారులు అన్నారు.

జ్ఞాన ప్రాప్తి కేవలము విచార(బుద్ధి) శక్తితో కాదు. దేహాంతర్గత ముఖ్య శక్తులైన ప్రాణ మనస్సులు మిలనమై ఉత్తుంగ స్థానమైన బ్రహ్మరంధ్రమున ఆనందానుభవమై జ్ఞానవికాసము కావలసియున్నది. అందుకు యోగవిద్యయే శరణ్యమని జ్ఞానాకాంక్షులకు ప్రభువుల సందేశం.

76. యోగవిద్యా సాధనలో కలుగు అభివృద్ధి విషయములను వివరింపుము?

యోగవిద్యా సాధకులకు ప్రథమముగా కనిపించు ప్రగతి లాలారసము. ఇది అధికముగా ఉత్పత్తియగును. జీర్ణశక్తి అభివృద్ధి నొందును. కలలు లేని నిద్ర (గాఢనిద్ర) కలుగును. క్రమముగా దేహారోగ్యము అభివృద్ధి చెంది, మానసిక స్థితి బాగుండును. బుద్ధి మాంద్యము తొలగును. దీనిని మొదటి దశ అనవచ్చును.

రెండవదశలో ప్రకాశ దర్శనం వాణీ శ్రవణం ఇత్యాదులు గోచరిస్తాయి. మధురసోత్పత్తి కలిగి ధ్యానస్థితి అనగా మన శ్చాంచల్యము తొలగును. అంతర్ముఖత పెరుగును. తన ప్రశ్నలకు తనలోనే సమాధానం దొరుకుతుంది. దేహములో ఉష్ణోగ్రత పెరిగి తపోజ్వాల అనుభవమునకు వచ్చును. మూడవ దశలో సమాధి స్థితి కలుగును. ఈ స్థితిలో అమృత రసోత్పత్తి తదనంతరం ఆనందానుభవము కలుగును. పిమ్మట సాధకుడు తత్వజ్ఞుడగుటకు తపించి తన వెనుకటి, ఇప్పటి, జన్మకర్మలను తెలిసికొనును. అట్లు తెలిసి చేయు కర్మ కర్తవ్యమునే (జ్ఞానోత్తర కర్మ) అందురు. అదే

విధముగా సృష్టి జరుగుటకు మూలకారణము మరియు దేవుని దర్శించుటకు సాధ్యపడును. ఇది నెరవేరిననే పూర్ణతృప్తి అన్నారు మన గురువులు.

77. ఒక సాధకుడు గురుత్వస్థితికి చేరుటకు ఎట్టి ప్రగతి సాధించవలెనను విషయమై స్వామి జయతీర్థుల వారి అభిప్రాయము వివరింపుము?

గురుత్వమనగా లఘుత్వము లేనిది. లఘుత్వమనగా అజ్ఞానము. తనలో అజ్ఞానమును తొలగించు కొన్న వ్యక్తిపరులను జ్ఞానములో నడపగల గురువు కాగలడు. ప్రభువుల మాటలలో చెప్పవలెనన్న మీ గురువు మీలోనే ఉన్నాడు. ఆయనను సేవించి జ్ఞానులుకండు. మన అజ్ఞాన నివారణము ప్రాణప్రతిష్ఠతోనే. అందువల్ల ప్రాణుడే గురువని, యోగ విద్యాభ్యాసమే ప్రాణుని సేవ అని ప్రభువుల అభిప్రాయము. యోగవిద్య కేవలము నోటి పాఠములతో అలవడదు. ఈ యోగవిద్యాభ్యాసమును చూపి ముందంజ వేయించుటకు మార్గదర్శి అగువారు కొంతకాలము శ్రద్ధతో సాధనలో సాగియుండవలెను. ఒక స్థాయిని చేరుకొన్న సాధకుడు మరొకరికి విద్యోపదేశం ఇవ్వగలడు. ఆ స్థాయిని చేరుకొన్న సాధకునకు, తన గురువునుండి విద్యాకాంక్షులకు విద్యోపదేశము ఇవ్వవచ్చునని ఆదేశము వచ్చును. ఆ స్థాయి లేనివారు బ్రహ్మోపదేశము ఇచ్చినచో అనారోగ్యములతో బాధితులగుదురు.

78. శ్రీ అచ్యుతగురువుగారు వారి మాటల్లో చెప్పిన ఆధ్యాత్మబోధన విషయమై వివరింపుము?

మన ఇంద్రియ మూలకముగా చేయు సర్వకర్మలు ఆంతర్యానికి సంబంధించినవికావు. వీటి వల్ల కలుగు ఆశలన్ని క్షణికములే. వీటి అనుభూతులు కూడా క్షణికములే. ఎంత అనుభవించినను నిత్యమైనవికావు.



ఆత్మశాంతిని ఇవ్వలేవు. ఇటువంటి క్షుద్ర భోగానికి ప్రయత్నించి పాడుకావలయునా? జీవనాన్ని ఆనందానుభూతితో తపస్సు చేసి శాంతి పొందవలెనా? శాంతి పొందాలనేది ఖచ్చితమైన నిర్ణయం. ఆ విధంగా జీవనం సాగించవలెను. ఆంతర్య శాంతికి దేహ ఆంతర్యముతోనే మార్గమున్నది. శుద్ధమైన మనస్సునకు అనగా ఇంద్రియ లోలత్వము వికల్పము ఉన్న మనస్సును(మనేంద్రియాన్ని) దేహ ఆంతర్యములో విహరించుచున్న ప్రాణచేతనం ద్వారా మిలనమై గురూపదేశము పొందిన క్రమాన్ని అభ్యసించవలయును. ఇది యోగమార్గము. ఇది కఠినమైన సాధన కాదు. భయపడవలసిన అవసరము లేదు. ఈ క్రమాన్ని తెలిసికొని ప్రతిరోజు వదలక క్రమబద్ధముగా సాధన చేయవలెను. ఇది ఊర్ధ్వగతిని పొందినపుడు సుఖాన్ని కలుగచేస్తుంది అని ప్రభువులు అన్నారు.

ఆదినుండి మహర్షులు దీనినే చేస్తూ వచ్చినారు. నేను ఈ విద్యను చాలా శ్రమించి పొందినాను. ఆ విధముగా ఎవ్వరూ కష్టపడకూడదని భావించి సుఖానందాలను తోడిమానవులు పొందవలెనను ఉద్దేశముతో ఆశ్రమమును స్థాపించి ఆసాధనా మార్గాన్ని చూపిస్తూ వచ్చినానన్నారు గురుదేవులు. ఈ మార్గంలో ఉన్న సత్యం ఆనందానుభూతి ఏ ఇతర మార్గములలోనూ తెలియదన్నారు. ఉన్నది ఒకటే మార్గము. ఈ విద్యను పొంది ఆచరించి సుఖశాంతులను పొందవలసినదిగా యావత్తు ప్రజానీకాన్ని అర్థించుచున్నానన్నారు. మాకు యోగులకు అసాధ్యమనే విషయమే లేదు. గర్భకోశములో ప్రవేశించి విషయాలు తెలిసికొని బయటకు రాగలము. సాధనలో అసాధ్యమనేది లేదన్నారు. యోగ మార్గములో సాగి తపించినచో తానుగా సత్యము దైవము అన్ని

విషయములు తెలిసికొనగలరని ప్రభువులు అన్నారు. చేతనాత్మతో విహరిస్తే యోగమగునన్నారు. ఆధ్యాత్మ సాధనకు స్త్రీ పురుషులందరూ అర్హులే అని ప్రభువులు అన్నారు.

79. సాధనా విషయమై శ్రీ స్వామి విజయీంద్రులవారు వివరించిన విషయములు తెలుపుము?

తత్వజ్ఞులయినవారు సదా దేవుని విషయమై మాట్లాడరు. విద్యా విషయమై మాత్రమే మాట్లాడెదరు. ముఖ్యముగా ఆధ్యాత్మజ్ఞానానికి కావలసినది "అంతర్ముఖస్థితి" మనకు భగవంతునిచే ఇవ్వబడినది. మనస్సు ఒక్కటేకాదు సహాయకముగా బ్రహ్మేంద్రియములున్నవి. బహిర్ముఖమైన మనస్సునకు అంతర్ముఖము ఏవిధముగా కావాలో అదే రీతిగా శ్రవణము, దృష్టి, ప్రాణము, శక్తులు అంతర్ముఖస్థితికి కావలెను. వీటన్నింటికి అచ్చట తృప్తి దొరకవలయును. అప్పుడే వాటి బాహ్యచాపల్యం నశించి చంచలత్వం పోవును. తర్వాతిది ఆత్మానుభవము. జీవ విద్యలో సాగి ఆత్మను, ఆమూలకముగా అన్నింటిని తెలిసికొను అవకాశమున్నది.

దీనినే "ఏకోవశీ సర్వభూతాంతరాత్మా" అనగా అన్ని భూతములందు వశించుచున్న "ఆత్మ" అని అర్థము. ఈ ఒక్క దానినే జ్ఞానులు బహు విధముగా వర్ణించియున్నారు. "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" ఆ ఒక్కటే ఒక్కటైన "సత్"ను విప్రులు అనగా జ్ఞానులు బహు విధముగా వర్ణించినారన్నారు స్వాములవారు. పర్యాయ పదమైన సుఖాన్ని సత్యమనియు, దుఃఖాన్ని అసత్యమనియు, స్వానందాన్ని స్వతంత్రమనిము, ఇతరములపై దొరకుక్షణిక సుఖాన్ని నశ్వరమనియు, బంధనమనియు పిలిచియున్నారన్నారు. దేహేంద్రి యముల ద్వారా కలుగు సుఖాపేక్ష సహజము. వీటి అంతర్ముఖ ప్రాప్తి కలిగినపుడు సుఖము లభ్యమైనపుడు



మాత్రము బాహ్య సుఖాపేక్ష తక్కువగుటకు సాధ్యమగునని వారు అన్నారు. ఈ అంతర్ముఖమునకు ప్రయత్నము లేకనే క్షణిక సుఖమైన బాహ్య సుఖములో మైమరచినచో చివరకు మరణమునకు గురికావలసి వస్తుంది.

దేనివలన మనము బ్రతికియున్నామో, ఆ ప్రాణుడు మన దేశములో దేనిపై ఆధారపడినాడో జ్ఞానులు ఏవిధముగా చెప్పినారో పరిశీలించినచో "అశనగతఃప్రాణః" అనగా అశనమునుండి ప్రాణుడు జీవించుచున్నాడు. ఈ అశనాన్ని విభూతి అనియు గంధమనియు, మన్నా అనియు కొంతమంది పిలుచుచున్నారు. మన దేహములో ఉన్న వాయువును మథించినపుడు ఆ మథనములో శుద్ధాంశమైన అశనం వచ్చి ప్రాణునకు ఆహారమగును. ఈ అశనము కూడా వాయురూపమే. అశనము జనించవలెనన్న ప్రాణవిద్యా సాధన చేయవలెను. దీనినే బ్రహ్మవిద్యయని జీవవిద్యయని, అమృత విద్యయని, ప్రాణయజ్ఞ మనియు అనేకమైన పేర్లున్నవి. దేహంలోని ఆత్మ ప్రాణాన్ని సృష్టించుకొని తరువాత అన్నింటిని సృష్టించు కొన్నదనియు ఆ ప్రాణుని ద్వారా దేహములో అన్ని అవయవములు పని చేయుచున్నవని ఉపనిషత్కారులు వర్ణించియున్నారు. ఈ ప్రాణం మనస్సునకు అన్ని ఇంద్రియములకు చేతనాన్ని ఇస్తూ ఉంటుంది. ప్రాణశక్తి తర్వాతనే మనస్సు. ఈ రెండింటి మిలనమే సూక్ష్మ సంకల్పము. దీనికి కావలసిన శ్రద్ధయే భక్తి. ఈ జీవన కర్మయే కర్మ. అదే స్వరూప కర్మ మార్గమనే అనుభవంనుండి తెలిసికొనేదే జ్ఞానం. అదే ప్రజ్ఞానం బ్రహ్మస్థితి. "దివ్యే బ్రహ్మపురే హ్యేష వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః" ఆత్మ దర్శనం ఎవరికి? "మనోమయః ప్రాణశరీర నియత ప్రతిష్ఠితోన్నే హృదయం సన్నిధాయ". మనోమయుడై ప్రాణ శరీరాన్ని నియంత్రించుచూ ప్రతిష్ఠితుడై బ్రహ్మపురమందున్న ఆత్మస్థితిని తెలియనగునన్నారు స్వామి

విజయీంద్రులవారు. "తద్విజ్ఞానేన పరిపశ్యంతి ధీరాః ఆనందరూప మమృతం యద్విభాతి". ఈ విజ్ఞానాన్ని తెలిసికొని విద్యాభ్యాసం, సాధనచేయువారికి అనగా అటువంటి ధీరులకు ఆనందమే రూపమై అమృతము లభ్యమగునన్నారువారు. అచ్చట ఆత్మ దర్శనం ఆ స్థానమే బ్రహ్మపురి బ్రహ్మస్థానం. దేహంలో బ్రహ్మరంధ్రమనే స్థానం. ఈ ఆధ్యాత్మ సాధనకు ధర్మబద్ధత వలదా? అనే ప్రశ్న అందులోను ధర్మమనే విషయాన్ని తెలిసికోవలెను. అది లేనిచో అంతయు వ్యర్థమని వక్తారులైన స్వామి విజయీంద్రులవారు అన్నారు. భగవద్గీతలో "స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మోభయావహః" అన్నారు. ఇది జాతి ధర్మాన్ని గురించి చెప్పబడినది కాదు. ఆధ్యాత్మ సాధనలో విషయాలను గురించి చెప్పబడినదిగా తెలిసికోవలెనని వారు అన్నారు. జీవాత్మ సంయోగమే యోగమన్నారు. ఇది కలిగినపుడు యోగి అని పిలువబడుచున్నాడు.

80. దేహములో ఉన్న ప్రాణశక్తిని గురించి కొన్ని ఆధ్యాత్మిక సంస్థలు వివరించిన విషయములను తెలియజేయుము?

ప్రాణశక్తిని గురించి ఇటీవల వార్తా పత్రికలలో వివరించబడిన విషయములు ఈ విధంగా ఉన్నాయి.

శక్తిని నింపే "రేకీ"

దేహములో ఏదైనా అనారోగ్యము కలిగినపుడు మనము వైద్యుల వద్దకు వెళ్ళుచున్నాము. వారు సూచించిన మేరకు మందులను వాడుచున్నాము. అయితే ఈ అనారోగ్యానికి కారణము మనలో ఉన్న ప్రాణశక్తి సరిగా వ్యవహరించడము లేదని కొందరు నమ్ముచున్నారు. ఈ ప్రాణశక్తిని సరిగా ప్రసరింప చేసినచో అనారోగ్యము నయమగునని కొందరు వైద్యులు అంటున్నారు దీనిని తెలిసికొన్న తరువాత ఈ శక్తి



అందరికి ఒకే విధముగా ఉండకపోవచ్చు వయస్సు వచ్చిన కొద్దీ ఈ శక్తి క్షీణిస్తుంది. ఈ పరిస్థితులలో అదనముగా శక్తిని ఏ విధముగా సంపాదిస్తారనేది ప్రశ్నించినపుడు దీనికి సమాధానము రేకీ అనే ప్రక్రియ చెబుతుందని హైదరాబాదుకు చెందిన రేకీ మాస్టర్ రజని అంటారు.

రేకీ అనే పదము జపనీస్ భాషకు చెందినదని వారు అనుచున్నారు. విశ్వజనీన శక్తి అని ఈ పదానికి అర్థమట. ప్రతి మనిషికి ఒక శక్తి వలయం ఉంటుందని, ఇదే విధముగా మన శరీరములో కొన్ని చక్రాలు ఉంటాయన్నారు. ఈ చక్రాలను శక్తి వలయం కాపాడుతూ ఉంటుం దన్నారు. ఈ చక్రాలలో అసమతౌల్యము వచ్చినపుడు మనకు సమస్యలు వస్తాయని విశదీకరించినారు. ఈ శక్తి వలయము ద్వారా ప్రాణశక్తిని మన శరీరములోనికి ప్రవహించే శక్తియే రేకీ అంటున్నారు వారు. ఈ విధముగా శక్తిని ప్రసరింపచేసే వారిని రేకీ మాస్టర్ అంటారట. దీనిని మొదట అభ్యసింపవలసి యున్నది.

దీని ఉపయోగాలు వివరిస్తూ రేకీ మనకు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తుందని శారీరక మానసిక సమస్యలను పరిష్కరిస్తుందని నమ్ముచున్నారు. ఇదే విధముగా ఆధ్యాత్మికముగా కూడా మనస్సును రేకీ ముందుకు తీసుకెళ్ళుతుందని భావిస్తారు. రేకీ ప్రక్రియకు ఖచ్చితమైన శాస్త్రాధారాలు లేవు. అయితే ఇది కూడా ధ్యాన మార్గము మాదిరి ప్రక్రియేనని నిపుణుల అభిప్రాయము. అయితే గీతలో "మూర్ధ్నాయోగ ధారణం" అన్నారు. సహస్రారములో (బ్రహ్మ రంధ్రములో) ఉన్న ఆత్మను చేరాలంటే వాయుమథనమే శరణ్యమని జ్ఞానులు బోధించియున్నారు. అనగా ప్రాణ విద్యోపాసన. (ప్రాణా యామము) చేయవలసినదే.

81. శ్రీ అరవిందులవారు సృష్టి విషయమై విశదీకరించిన విషయము వివరింపుము?

శ్రీ అరవిందులవారి ప్రకారము దైవము ఈ సృష్టిని తన ఆనందము కొఱకే సృష్టించినారట. ఆ సంకల్పమే పరాశక్తి అన్నారు. విశ్వప్రాణశక్తి. ఈ సకల సృష్టిని ఉనికి లోనికి తెచ్చినది ఆ పరాశక్తియే. అయితే ఇది ఇంకా పూర్ణము కాలేదు. అన్ని ఆటంకములను ఓర్పుతో సహించి తన బుద్ధి బలముతో వారియందు పరివర్తనమగునట్లు చేసి విరోధించిన గర్విష్ఠులను అణచెడి అతిమానవిక శక్తి అనగా ఆది మానసిక శక్తి (Supra Mental Force) ఇంకనూ ఈ భూ గ్రహమునకు అవతరించలేదని, అనగా దివ్య మానవుడు ఆవిర్భవించి నపుడే ఈ సృష్టి సచ్చిదానందముతో తొణికిసలాడుతుందని శ్రీ అరవిందులవంటి మేధావులు చెప్పినారని శ్రీస్వామి జయతీర్థులవారు కొన్ని సందర్భములలో వివరించినారు.

అది తంత్రవాదులు చెప్పుచున్నట్లు కాదు. సామూహికం. ఆ పరిణామక్రమము ఇంకా ముందుకు సాగినపుడు వాస్తవరూపము ధరిస్తుంది. ప్రకృతి పురుషులు అనే పదాలు కేవలము సాంకేతికముగా వాడినారు తప్ప స్త్రీ పురుషుల సంయోగముతో ఆనందమును ఇక్కడే అనుభవించాలన్న అర్థముతో కాదన్నారు. తంత్రయోగులు ఈ అర్థాన్నే తీసుకొని మహాయోగాన్ని భ్రష్టు పట్టించారని శ్రీ అరవిందులవారు అంటారు.

కాలక్రమములో సాధన రెండు భాగములుగా చీలిపోయినది. జ్ఞానమార్గము దక్షిణాచారమని, ఆనందమార్గము వామాచారమని పిలువ బడినదని వారు అంటారు. ప్రపంచములో సంబంధాలన్ని దివ్యమైనవిగా అనుభవాలు దివ్యానుభవాలుగా, కర్మలను దివ్యకర్మలుగా మార్చుకొన



వచ్చునని తంత్రయోగము ప్రతి పాదించినదని వివరించిరి. అయితే ఈ మార్పు సాధకుడు దివ్యశక్తిని పొందిన తర్వాత వాటంతట అవి సిద్ధించేవి అన్నారు. తంత్రయోగము వీటిని సాధన ప్రారంభములోనే మానవ యత్నముతో వాటిని దివ్యీకృతం చేయాలని వాదించిందట. దీనితో నిమ్నశక్తుల ప్రభావానికి లోనై దారితప్పి పతనావస్థకు చేరి దాదాపు కనుమరుగయిందని వారి భావన.

పూర్ణయోగానికి ప్రాతిపదిక విషయమై శ్రీ అరవిందులవారు వివరించిన విషయాలలో కొన్నింటిని తెలుసుకుందాము. సృష్టిలో మానవుడు అగ్రగణ్యుడు. అయితే అతడు కూడా అసంపూర్ణుడే. మాట్లాడ గలిగిన జంతువే. ఎందుకనగా ఇతర జంతువులు మాదిరిగా ఆహార, నిద్ర, భయ, సంతానోత్పత్తి వంటి సహజాతాలతోనే జీవిస్తున్నాడు. ఇట్టి అసంపూర్ణ జీవితో పరిణామక్రమము ఆగిపోదు. పరిణామక్రమము ఇంకా ముందుకు సాగి మానవాతీత జీవిని ఉనికిలోకి తెస్తుంది. అతని ద్వారా ఈ భూమి మీద జీవితం ఆవిష్కరించబడుతుంది. ఈ పరిణామ క్రమములో తదుపరి సోపానమన్నారు వారు.

“సర్వం ఖలు ఇదం బ్రహ్మ” అనే కదా వేదం చెప్పుచున్నది. కావున పరతత్త్వాన్ని చేరుకొనేందుకు ఈ ప్రపంచాన్ని కాదనవలసిన పనిలేదు. ఈ జీవితము అర్థము లేనిది కాదు. ఆ పరమతత్వాన్ని అభివ్యక్తము చేయడము కొఱకే ఈ సృష్టి పరిణమిస్తున్నది. ఈ పరిణామ క్రమాన్ని తెలిసి మనము కూడా అందులో పాల్గొంటూ వేగిర పరచవలయును. అదే జీవిత పరమావధి అంటారు శ్రీ అరవిందులవారు.

మనలో అంతరాత్మ, మనస్సు, ప్రాణశక్తి భౌతిక శరీరము అనే నాలుగు ముఖ్య అంతస్థులున్నవని శ్రీఅరవిందులు పూర్ణయోగములో అన్నారు. మనము ప్రాణ శరీరాలను అంతరాత్మ ప్రభావములోకి

తీసుకొనిరావడం ఒక ముఖ్య అంశం. మనస్సు ఎప్పుడూ ఆలోచనలతో నిండి ఉంటుంది. అది ఎప్పుడూ నిలకడగా ఉండదు. తన మీద తనకే నమ్మకముండదు. కొన్ని అభిప్రాయాలు ప్రతిపాదిస్తుంది. అంతలోనే వాటికి విరుద్ధమైన వాటిని కూడా చూపెడుతుంది. అంటే ఆ రెంటి మధ్య ఊగిసలాడుతుంది.

మనస్సులో ఆలోచనలు ఆగిపోగానే ప్రాణశక్తి సహజమైన కోరికలు కలుగజేస్తుంది. సాధారణముగా మనస్సులోని ఆలోచనలకు అనుగుణముగా ప్రాణశక్తి ప్రవర్తిస్తుంది. ప్రాణశక్తికి నూతన ఉత్సాహము రావలెనన్న దానికి అశన ప్రాప్తి కావలెను. అనగా వాయు మథనము ద్వారా అశనోత్పత్తి జరిగి ఈ అశనాన్ని ప్రాణశక్తి తీసుకోవడము ద్వారా ప్రాణమనో మిలనమగునని మన గురువర్యులు తెలియజేసినారు.మనో ప్రాణాలు రెండు కలిసి ఊర్ధ్వ గమనమై సహస్రారములో నున్న ఆత్మ(ప్రత్యగాత్మ) మేల్కొనునని శ్రీగురువుగారు వివరించినారు. ఇది సాధనలోనే సాధ్యము అని ఉపనిషత్కారులు అన్నారు. దానిని పొందుటకు ఆధ్యాత్మ సాధన చేసియేతీరవలయునని శ్రీగురువుగారు వివరించినారు.

82. శ్రీ అచ్యుతాశ్రమ ముఖ్య ఉద్దేశమును వివరింపుము?

శ్రీ అచ్యుతాశ్రమము, ప్రభుయోగి అచ్యుతులవారితత్వము, వారిచే ప్రసాదించబడిన యోగవిద్య, సర్వమానవ బంధువులకు అందజేయు పవిత్ర సేవా కేంద్రముగా స్థాపించబడినది. కర్ణాటక రాష్ట్రమునందలి కొప్పల జిల్లాలోని విరుపాపురగడ్డయందుఆశ్రమము యొక్క ప్రధాన స్థానమున్నది. తరువాత ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతములయందు శాఖలు ఏర్పరచబడినవి.



ఆదివిద్య, జీవవిద్య అమృతవిద్య అను ప్రసిద్ధమైన ఈ యోగవిద్యను ప్రజలకు అనుగ్రహించి జీవనములందు విశ్వ ఆది ధర్మములను అనాది తత్వమును శాశ్వతరీతిలో సంస్థాపించుటకు ప్రభుశ్రీ యోగి అచ్యుత కృపాశయములతో ఈ ఆశ్రమము సంఘటితమైనది. ఈ యోగవిద్యకు సర్వులు అర్హులే కాని దీనిని ఉపదేశించుటకు ప్రత్యక్ష గురువు అవసరము.

ఇంద్రియాతీత సత్యము మరియు తత్వమును తెలిసికొనుటకు మన దేహేంద్రియములు ఏవియు సహాయకములు కాజాలవు. గురు శ్రీఅచ్యుత ప్రసాదితమైన ఈ యోగవిద్య వలన కాయశుద్ధి తరువాత అంతఃశుద్ధియై దర్శన ఆనందానుభవములు ప్రాప్తించును. ఇందుకు కఠిన నియమములు ఏవియులేవు. ఆవశ్యకమైనది ఆకాంక్ష ఒక్కటే. ఈ సాధనకు దాంపత్యము నిషిద్ధము కాదు. సంసార జీవులందరు ప్రతి నిత్యము ఈ విద్యను అభ్యసించినచో సంసారము సార్థకమై తుష్టి, పుష్టి కలిగి జీవనము శాంతికి నెలవు అవుతుంది. సన్యాసము (సంసార త్యాగము)అజ్ఞాన సంకేతము. జ్ఞానోత్తర కర్మ సాగింపవచ్చిన ఈ జీవితము క్షుద్ర భోగములకు కాదని గురు శ్రీఅచ్యుతులవారు తెలియజేసినారు. ఈ విద్యాసాధన లోక కల్యాణమునకు తన మోక్షసాధనకే. ఆహారనియమములో మాంసాహారము, కోడిగ్రుడ్లు మొదలగునవి ఉపయోగించకూడదు. పొగత్రాగడము, మద్యపానము చేయడము మానుకొనవలయును.

శ్రీ జయతీర్థస్వాములవారు విద్య విషయమై వివరిస్తూ భయముచే గాక తన ఇచ్ఛతోనే ఆవిద్యను పొంది అభ్యాసము చేసి తాము తృప్తులై, ఆనందానుభవము పొంది జ్ఞానులగు వారందరు భగవంతుని కృపకు పాత్రులగుచున్నారు. ప్రేమ ఒక్కటే ఇతరులను ఉన్నతస్థితికి తెచ్చుశక్తి అన్నారు. శాంతియే ప్రేమ స్వరూపము యొక్క నైజము. ధర్మమే అతని

రక్షా కవచము. జ్ఞానమే అతని ఖడ్గము. అతడు అజాత శత్రువన్నారు.

83. గురువని ఎవరిని పిలుచుచున్నారని వివరించిన శ్రీ జయ తీర్థస్వాములవారి బోధన తెలియజేయుము?

"న గురోరధికం". గురువుకు గులామూకానంత వరకు దొరకదన్న ముక్తి, పదే పదే శాస్త్రములు చదివి వ్యర్థమయ్యే భక్తి "గోవింద భక్తి గురుభక్తిజాయే" అనెడి సుభాషితములు భారతదేశమున ప్రతిచోటను వినవచ్చుచున్నది. కావున ఆ గురువన్న ఎవరు? మనలను బంధముక్తులను చేయుటకు ప్రయత్నించి మార్గదర్శకుడుగా ముందుండి నడిపించగలవాడు ఎవరు? అతనిని గురించియే మనకు తెలియవలసి యున్నది.

"తల్లియే తొలి గురువు"

గురువు అనగా తెలియజేయువాడని సామాన్యముగా తెలిసిన అర్థము. శిశువునకు పాలు పట్టడము మొదలు మాటలు నేర్చుకొను వరకు ఆహార పానీయములు తీసికొనువరకు తల్లియే తెలియజేయును. అందువల్లనే "తల్లి ఒడియే మొదటి పాఠశాల – తల్లియే మొదటి గురువు". వేదములయందు "మాతృదేవోభవ" అని చెప్పబడినది.

చదువు సంధ్యలతో బాటు ఉత్తమ నడవడిక పరిశీలనా శక్తులు పిల్లలందేర్పడుటకు తగు శిక్షణ ఇచ్చు వానిని గురువు అందురు. కాని ఇతనిని ఉపాధ్యాయుడు, బోధకుడు అనుటయే చెల్లును. ఎందుకనగా వీరందరు లఘుత్వమును (అజ్ఞానమును) పోగొట్టుకొని గురువులై (జ్ఞానులై) యుందురని చెప్పలేము.

తనకు తెలియని కళను వృత్తి విద్యయో, లలిత కళయో బోధించువాడు మార్గదర్శి అనిపించుకొనునుగాని గురువు కాదు. అపరా విద్య అనగా అవిద్య అజ్ఞాన హేతువు. తనలో ఉండు అజ్ఞానమును



పూర్ణముగా తొలగించి, తృప్తి జ్ఞానము ఆనందములను అనుభవమునకు తేగల విద్యయే పరావిద్య అన్నారు. అట్టి పరావిద్యను లోకమున ఎవరు కాని వాక్కున వర్ణించలేదు. వర్ణించినను వక్తలనిపించు కొందురే కాని గురువు అనిపించుకొనరు. తనలో ఉండుచేతన స్వరూపమును దేహము నందలి క్రిందిమెట్టునుండి చలింపజేసి క్రమేణా ఊర్ధ్వగతిని సంచరింపజేసి, పై మెట్టున మూర్ధ్నమున స్థిరముగా నిలిచినపుడు కలిగెడు జ్ఞానము. ఆనందము తృప్తి కలుగును. ఈ స్థితి ఇతరము వలన లభ్యము కాదన్నారు, మన వక్తారులు. ఈ సాధనాక్రమము తెలిసిన వారే ఆమార్గమును చూపించ గలరు. అట్టివారిని స్థూలముగా విద్యాగురువు అని సమ్మతించ వలయును. అట్టి స్థూల గురువులు కూడా సాధనాక్రమమును చూపగలరే కాని ఆ అనుభూతిని ఇవ్వలేరు. అనగా సాధన చేయక అది సాధ్యము కాదు. వీటిని అనుభవమునకు తెచ్చుకొన్నవారే తెలిసిన గురువనిరి. అట్టివారే "దేహో దేవాలయఃప్రోక్తః జీవో దేవః సనాతనః" అన్నారు. ఆ నిజస్థితి ప్రకృతి వలన ఆవరింపబడిన మాలిన్యమునందు మేధకు మరుగైయున్నందున అజ్ఞాన స్థితికి కారణమైనది.

జ్ఞానమునకు మూలమైన ఆత్మచైతన్యములోను (ప్రాణ– ఈశ్వర) మూర్ధ్నమునందు స్థితమగునట్లు చేయు ప్రయత్నమును (యోగవిద్య) తెలిసిన పిదప సాధకుడు తన గురువు బోధించిన మార్గమున కొనసాగ వలెను. అట్టి వానిని ప్రాణాయామ పరాయణుడై సాగుచున్నాడని జ్ఞానులనుచున్నారు. దీనిని శ్రీజయతీర్థస్వాముల వారు బోధించినారు.

ఉపదేశము ఇచ్చినంత మాత్రాన విద్యాగురువు జవాబు దారితనం ముగియలేదన్నారు మన గురువులు. సాధకునకు అవసరమైన నియమములు బోధించి, తమ ఆదర్శములనుండి నియమపాలన నుండి

సాధన నిష్ఠను సాధకునకు మనస్సులో ప్రతిష్ఠింపజేసి ముందంజ వేయవలెను. ఎందుకనగా మానవులు ఇతరులను అనుసరించు స్వభావము కలవారు. సాధకునకు యుక్తమైన ఆహారము విహారము అవసరము. సాత్వికాహారము యుక్తమయినది. వినయ విధేయతలు కలిగియుండ వలెను. అహంకారము ప్రాప్తించిన అధోగతి తప్పదని మన గురువుగారు అన్నారు. అందుకే "సంతృప్తి భక్తియుత సాధకానామ్" అన్నారు.

84. ఆశ్రమములో విద్యోపదేశము చెవి వద్దనే ఎందుకు చేసి చూపించవలయును. ఈ విషయములో మన గురువుగారు వివరించిన విషయములు తెలుపుము?

ఉపదేశమును కాగితముపై వ్రాసి చూపుటగాని అనేకులకు ఒకేసారి మూకుమ్మడిగా చెప్పించుట గాని యున్నదా? లేక అందులకొక నియమిత పద్ధతి ఉన్నదా?పూర్వము దేవర్షి నారదుడు కొందరికి చెవి వద్ద ఉపదేశము ఇచ్చినట్లు పురాణములందు కనబడుచున్నది. ఈ విషయమై మన గురువులు బహు సూక్ష్మముగా వర్ణించియున్నారు. ప్రాణునికి ఆవశ్యకమైన ఆయామమునకు సర్వ వ్యాపకమైన సర్వభూత హృదయ స్థితమై ఆడుచున్న ఆ చైతన్యమును తన ఆది స్థితికే గొంపోవుటకు దాని గతాగతియై అవసరమైనందున ఆ గతిని తెలిసికొనవలెననెడు వారి చెవివద్ద గతాగతి చేసి చూపించిననే బోధపడునుగాని, దూరమునుండిగాని, నోటితో వర్ణించి చెప్పుట కాని, కాగితముపై వ్రాసి చూపించుటగాని సాధ్యముకాదు. కాబట్టి చెవి దగ్గర గతాగతి జరిపించు పద్ధతినే ఉపదేశమనుట. విద్యోపదేశము గావించు గురువునకు గురు దక్షిణగా పొగాకు, గంజాయి, కల్లు, సారాయి మొదలగు మాదక వస్తువులను, నిషా వస్తువులను,



మాంసాహారమును గురువునకు సమర్పించిన తరువాత సాధకుడు వాటిని సేవించరాదు. వీటిని మానుకొన్ననే తప్ప సాధనలో ప్రగతి కనిపించదు.

85. జ్ఞాన సాధన విషయమై శ్రీజయతీర్థస్వాములవారు వివరించిన విషయములను విశదీకరింపుము?

యోగాభ్యాసమునకు ప్రాణాయామమే మొదటి మెట్టు. అదే వాయు మథనం. అందుకే "వాయు జీవోత్తమః.....నమస్తే వాయో త్వమేవ ప్రత్యక్షం బ్రహ్మాసి" అని జ్ఞానులు అన్నారు. వాయు మథనం వలన ప్రాణుని దర్శింపవచ్చును. ప్రాణునితో ఊర్ధ్వగతిని ప్రయాణం సాగించి మూర్ధ్నమునందు స్థిరమైనప్పుడే తపస్సు సాధ్యము. తపస్సు చేయనిదే జ్ఞానము అ లభ్యము. అందువలననే అట్టి తపస్సు చేయుటకు అనుకూలము కలిగించు ప్రాణాన్ని గురువు అనుచున్నారు. శ్రీ శంకర భగవత్పాదుల సద్గురు పాదుకాస్తవమును చదివిన ఈ విషయము మనస్సునకు బాగుగా నాటును. ఆ చైతన్యమును "మూలకారణమచ్యుతం" (చ్యుతి కాని స్థితికి తెచ్చు మూలకారణం ఇది అని తెలియుటను) అని వర్ణించినారు. ఆ ప్రాణుదును బిందువునందు స్థిరముగా నిల్పిన పిదప జ్ఞానము కొరకై తపించెడి మనస్సు, మనస్సే ఇచ్చట గురువు. అందుకొరకే "ప్రాణాగిరతి చంద్రమా" అన్నారు. మనస్సు చంద్రునకు పోల్చదమైనది. ఆ మనస్సే ఉచ్చస్థితియందు జ్ఞానశక్తి (ఆత్మ) అయినందున "ఉద్ధరేదాత్మ నాత్మానమ్" అని శ్రీకృష్ణుడు ఉపదేశించినాడు.

జ్ఞాన ప్రాప్తి అయిన తరువాత తాను ఈ జన్మలో చేయవలసిన కర్తవ్యమొనరించి విముక్తుడగుటకు ఆత్మ పరిజ్ఞాన మొక్కటే మార్గదర్శక మగును. బహిర్ముఖుడయిన జ్ఞానియు కర్మాచరణ సందర్భమున అప్పుడప్పుడు మబ్బునందు మెరయు మెరుపువలె కర్తవ్యమును గుర్తించును.

అప్పుడతనికి ప్రకృతియే పాఠశాలయని శ్రీజయతీర్థస్వాములవారు తెలియజేసినారు.

86. ధర్మమును గురించి శ్రీజయతీర్థస్వాములవారు వివరించిన విషయములను తెలియజేయుము?

ధర్మమును గురించి అనేక భేదాభిప్రాయములు ఉన్నవి. వైదిక ధర్మమునందు స్మార్త, వైష్ణవ, శైవ, వీరశైవ, శాక్తేయ, గాణాపత్య, జైన, బౌద్ధ మతములు భిన్నాచారములు, ఇస్లాం, క్రైస్తవ, సిక్కు మతములు కలవు. అవన్నియు మతములేకాని ధర్మములు కావు.

ధర్మ మొక్కటే. అది మానవధర్మము. దైవముచే ఏర్పడ్డ ఈ సృష్టియందు శ్రేష్ఠులు అనిపించుకొను మానవులు ఆశ్రయించవలసిన రక్షా కవచము మానవధర్మమనునదే. మతమనగా అభిప్రాయము. వేరువేరు దేశములందు కాలములందు జన్మించిన జ్ఞానులు తమ చుట్టుగల అజ్ఞానులను చూచి వారిని సరిదిద్దుటకై తమకు తెలిసినంత మేరకు తత్వమును బోధించి వారిని శాంతియుతులుగాను, ధైర్యవంతులుగాను సహకారము కలిగినవారై తమ బ్రతుకుతోపాటు సమాజ క్షేమమును సాధించుటకు తమకు అవసరమైన నియమములనే ధర్మమని బోధించినారు "ధారయతీతిధర్మః" అనగా ఏది ఉద్ధరించునో అది ధర్మము. ఈ జగత్తును ఉద్ధరించుచున్నది దైవిక శక్తి. దానిని శరణు పొందుడు. అది మిమ్ములను రక్షించును. దేవుడన్నను ధర్మమన్నను ఒక్కటే. అందువల్లనే బుద్ధుడు "ధర్మం శరణం గచ్ఛామి" అని బోధించినాడు. కానరాని దేవుని శరణు పొందుటెట్లు? దేవుడు కానరాకున్నను ఆయన సృష్టియందున్న సంఘము (ప్రాణిసముదాయము) కానవచ్చును. "సంఘం శరణంగచ్ఛామి" దానినే శరణుపొందుడు. అనగా దానినేసేవించండి. అదియే దైవపూజ. దేవుడు సర్వాతీతుడు అని బోధించబడినది. "బుద్ధం శరణం గచ్ఛామి". ఇచ్చట తననే శరణు పొందుడని చెప్పుకొనలేదు. బుద్ధుడనగా జ్ఞాని. తాను ఇరువది నాల్గవ బుద్ధుడనని, తనకంటె ముందు ఇరువది ముగ్గురు బుద్ధులు మార్గదర్శకులై వచ్చి పోయినారనియు అతడు చెప్పెను. అట్టి మహనీయుడైన బుద్ధుని బోధ తెలియక అతడు నాస్తిక మతమును బోధించెనని చెప్పువారికి జ్ఞానప్రాప్తి ఎట్లు సాధ్యమగును? జనులు అహింసను వ్రతముగా బూని సమాజసేవ వైరాగ్య మతమైన తపస్సు, మోక్షములను బడయవలెనని బోధించినారు. ఏసుక్రీస్తు, మహమ్మదు, పైగంబరు, సమాజ సేవా కార్యములను, జ్ఞాన వికాసమునకై ప్రబోధముల అవసరమును చాటి చెప్పినారు. వీరందరు ధర్మ ప్రవక్తలే. దైవమును గురించి ప్రచారము చేయకున్నను, దేవుడు ఒక్కడేనని నమ్మిన జ్ఞానులు, ఏసుక్రీస్తు తాను దేవుని కుమారుడనని చెప్పికొనగా భక్తులందరికి ఆ విధముగా చెప్పుకొను అధికారము ఉన్నదని అందరు దేవుని బిడ్డలే ఎవ్వరిని దేవుడు సంసారులవలె మానవులను కనలేదని అందరు అతని బిడ్డలేయని శ్రీపైగంబర్‌గారు చెప్పినారని మన గురువుగారు తెలియజేసినారు.



జ్ఞానుల అనుయాయులు వారి బోధన ఆంతర్యము గ్రహించక, దేవుని విషయమై మోహితులై తత్వభేదములు పెంచుకొనుచూ ఇతరుల వాదము అజ్ఞాన జనితములనెడి భ్రాంతిని కలిగి లోకులను వ్యాకులతకు గురిచేయుచున్నారని స్వామిగారు అన్నారు.

మానవుడు అంతర్ముఖమున జ్ఞానముబడసి ఈ దేవుని (జగత్తును) సేవించవలెనని బోధించిరి. మరికొందరు అది యోగమార్గ మనిరి. దేవుడు అజరామరుడు, మహిమాన్వితుడని జురాష్ట్రీయులనిరి.

మానవ మాత్రులైన మనకు ఎట్లు సాధ్యమగును? ఆత్మ సర్వ భూతములయందున్నదనియు దాని సహజత్వము సత్, చిత్, ఆనంద మనియు దానిని అంతర్ముఖ సమాధియందు విశ్రమించి నిన్ను నీవు తెలిసికో. ఆ స్థితియందు నీవు అజ్ఞానియైన జీవివికాదు. అమరుడవు. జ్ఞానసంపదలను సహజ సంపదగాగల ఆత్మ స్వరూపుడవు ఇది అనుభవమగును. జ్ఞానులు బోధనలకు తలయొగ్గని వారికి దేవుడు స్వయముగా శిక్షించుటకు పూనుకొనవలసిన సమయము ఆసన్నమైనదని శ్రీ స్వాములవారు అన్నారు.

“ధర్మో రక్షతి రక్షితః” తనను ఎవరు రక్షింతురో వారిని ధర్మము రక్షించును అనుటకంటె “ధర్మోరక్షతి ఆశ్రితః” తనను ఆశ్రయించిన వారిని ధర్మము రక్షించును అనుటయే తనకు నచ్చినదని శ్రీజయతీర్థస్వాములవారు తెలియజేసిరి. అదియే అందరిని రక్షించు శక్తి అని వారు వివరించినారు.

87. భగవద్గీత విషయమై శ్రీ విజయీంద్రస్వాములవారు వివరించిన విషయములను తెలియజేయుము?

శాశ్వతమైన సత్యమును తెలిసికొనుట మానవుని లక్ష్యము కావలెను. ఆ సత్యాన్ని తెలిసికొని అనగా అనుభవించి ఇతరులను ఆ మార్గములో నడిపించునదే ధ్యేయము కావలెను. ఇది నా గురువుల ఆజ్ఞ నా ధ్యేయము కూడ అదే.

భగవాన్ శ్రీకృష్ణునకు తప్ప ఎవ్వరివల్లను తత్వ విచారమును అంత సుందరముగా మాటలతో తీసికొని రావడం సాధ్యము కాదని శ్రీవిజయేంద్రులవారు అన్నారు. అయితే అతని గీతను ప్రజలు అర్థము చేసికొని మాట్లాడుచున్నారా? ఒకమారు శ్రీయోగి అచ్యుతులవారు వారిని నీ దగ్గర భగవద్గీత ఉన్నదా? అని ప్రశ్నించినారట. అందుకు వారు



స్వామీ నేను దానిని రోజు చదువుతున్నాను అన్నారట. అందుకు వారు నవ్వి శ్రీకృష్ణభగవానుడు గీతను కేవలము చదువుటకు కాదు, చేయుట కూడను వివరించబడినది అన్నారట. నీవు దానిని చదివి రోత చేయుచున్నా వన్నారట. కొంత లోతుగా వెళ్లి పరిశీలిస్తే దీని సత్యము మనకు గోచరిస్తుంది. శ్రీకృష్ణుడు అర్జునునకు కర్తవ్య నిర్వహణకే బోధించినాడుకాని చదువుకొనుటకు కాదు. ఆ భగవద్గీత ఆదినుండి ఉన్నది. దాని భావాలు మరచిపోయినందులకు ద్వాపర అంత్యములో శ్రీకృష్ణ అవతారములో దానిని చేయుటకు నొక్కి చెప్పియున్నాడు. భారత తత్వము ఆది మహర్షులవల్ల ప్రఖ్యాతి గాంచినది. గీత బోధ ఉద్దేశము దాని భావాన్ని గ్రహించి దాని కర్తవ్యాన్ని తెలిసికొని ఆచరిస్తే మనకు విషయం అనుభవానికి వస్తుంది.

ఇచ్చట ఒక విషయమును గమనించవలయును. అర్జునుడు అధీరుడు కాదు. కృష్ణునికి భక్తులు లేరని కాదు.

ధర్మరాజు ఉన్నాడు. ఏకాంత భక్తుడు భీముడు ఉన్నాడు. మహాభక్తుడు ఇచ్ఛా మరణుడైన భీష్ముడున్నాడు. సాత్వికభక్తుడైన విదురుడు ఉన్నాడు. ఇంకా ఎంతోమంది భక్తులు ఉన్నారు. అయినా కూడా గీతాబోధకు అర్జునుడే తగినపాత్రధారి అయినాడు. కారణం అతడు మోహితుడు కాదు. శాస్త్రవేత్త, పైన సాధకుడు. ఆఖరున అంకురించిన మహావైరాగ్యమే కారణము. అచ్చట అతని పక్వత పూర్ణమైనది. అర్జునుని యొక్క పాత్రను అఖండ విశ్వమానవ ప్రతినిధిగా ఉంచుకొని గీతాబోధ గావించబడినది. పురుష శ్రేష్ఠుడైన అర్జునునికి పురుషోత్తముడైన శ్రీకృష్ణుడు బోధించినది గీత. ఇందులో మనము తెలిసికొనవలసినది భక్తి, కర్మ, జ్ఞానములయొక్క

సంగమమే. "అనన్యాశ్చింతయంతో మామ్" అనునది అటులనే "తపస్విభ్యోఽధికో యోగీ" ఇత్యాది వాక్యములు ఒకదాని కొకటి విరుద్ధముగా కనిపించినను అది నిజము కాదు. దీనినే జ్ఞానులు వివిధ రూపాలుగా వర్ణించినారు. అశాశ్వత మార్గమునుండి శాశ్వత సుఖము లభించదు. గీతలో బ్రహ్మవిద్య విషయమై వివరించబడినది. ప్రస్తుతకాలంలో ఒక తపస్వి సాధక సన్యాసి తన అనుభవము నుండి తత్త్వ విషయమై మాట్లాడి హెచ్చరించు పనిపై బ్రహ్మవిద్య ఇచ్చుటకు ఊరి నుండి ఊరికి ఇంటింటికి వెళ్లినను తమ మబ్బు వీడక ప్రవర్తిస్తే ఏమి చేయవలెను? అతను తన శక్తిని ప్రజ్వలింపజేసుకొని రుద్రుని కొంచెము తన మూడవ కంటిని తెరుచుటకు ప్రార్థించవలెను. ఉండనీ. ఇది కాలగతి అని సమాధాన పరుచుకొనవలెను.

బ్రహ్మవిద్యకు అర్హులైనవారు ఎవ్వరు? అనే ప్రశ్నకు దేవుడు అనిపించుకొన్న శ్రీకృష్ణుడు చెప్పినదేమి? ఇది కేవలము జాతికి పరిమితం కాదు. స్త్రీ, వైశ్య, శూద్రులకు అందరకూ అర్హత ఉన్నది. ముందు రాబోవు కలికాలములో వచ్చు క్షుద్రములను గమనించే స్పష్టముగా చెప్పియున్నారు. మనకు కావలసింది పుస్తక పాఠాలు కాదు. తత్వసాధనమైన యోగవిద్య. దానిని పొంది మనము సాగుదము.ఆత్మ దర్శనము భగవత్ కృపలను పొందుదము. అందరు లేవండి దానికి సిద్ధముకండి. స్త్రీలకు కూడా తత్త్వము కావలెనా అను ప్రశ్న కేవలము బాల బుద్ధి. వారికీ కావలెను. అంతే కాదు వారికి సులభముకూడా. ఎందుకో తెలుసునా, స్త్రీలలో మాతృ వాత్సల్యము అతి సహజము. వారికి వ్యవహారలంపటం తక్కువ. కావున తత్వ సాధనలో ఏకాగ్రత సులభము. భక్తి ఏకాగ్రతలు తొందరగా



అ లవడును. ప్రతి ఆడపడుచు శుద్ధమైన సంసారాన్ని కలుగజేసి కాలగతిలో భవిష్యాన్ని ఉజ్వలస్థితికి కారణమై ముని సంతతి సామ్రాజ్యానికి ప్రజలై వచ్చు జీవ జాతులను జగత్తుకు కానుకగా ఇచ్చి జగత్ జ్యోతి గావించి కృతార్థులు కావలసినవారు వారే. కావున మీకు ఆరోగ్యము కావలెనన్న యోగవిద్యయే శరణ్యము అన్నారు. అంతేగాక మనస్సు అంతర్ముఖానికి రాగలదు.

గీతా పఠనమునకు ముందుగా ఆ దివ్య సందేశమును బోధించిన శ్రీకృష్ణుని వ్యక్తిత్వము ఎట్టిదో తెలిసికొన్న అతని బోధనలయందును నిష్కల్మషమైన భక్తికి దృఢపడుటకు సాధ్యమగును. అది లేనందున తత్వనిష్ఠ సాధనాబలము భారతదేశమున లేకుండా పోయినది. శ్రీకృష్ణుడు సూతునిగా రథము తోలెను. కసవు ఊడ్చెను. మోసమునకు మోసము, అబద్ధమునకు అబద్ధము, భక్తికి సత్యము నిచ్చెను. తుదకు దేవుడిగా నిల్చెను. ఇది అంతయు దేనిని తెలియ జేయును? పుట్టి పెరిగి మరణించునంతలో అన్ని కర్మలను సంపూర్ణమొనర్చి చాతుర్ వర్ణముల కర్తవ్యము ముగించవలసియున్నది. అట్లైననే బ్రహ్మజ్ఞానము లభ్యమగునని అన్నారు శ్రీవిజయేంద్ర స్వాములవారు. గీతయందలి తపోమార్గము సర్వులకొరకు చెప్పబడినది. తత్వ సాధన విషయమై ఏమని బోధించెను. "తపస్విభ్యో అధికో యోగీ" దీని అర్థమేమి? తపస్వియొక్క లక్ష్యము యోగమే. అందువలన తపస్వికంటె యోగి అయినవాడే శ్రేష్ఠుడు యోగ మనుటలో పెక్కులున్నవి. భక్తి యోగము, కర్మయోగము, జ్ఞాన యోగము ఇత్యాది. వీటి అర్థములు తెలిసిన వారికి యోగములు వేర్వేరు లేవు, ఒక్కటే అని అర్థమగును. ప్రస్తుతము ప్రజలు చాలామంది విషాద యోగంలో ఉన్నారు.

తత్వార్థమున యోగమనగా అధో భాగమున సంచరించుచున్న చేతనమును ఊర్ధ్వముఖముగా ప్రయాణింపజేసి మూలస్థానమున

(బ్రహ్మరంధ్రమున) కలిగెడు ఆనందానుభవము. గీతా సందేశము ప్రజలందరికి అన్నపుడు అందరికి అర్థము కాగల భాషయందే ప్రచారమొనర్చ వలసియున్నది.

"సర్వ ద్వారాణి సంయమ్య మనో హృది నిరుధ్యచ
మూర్ధ్నా ధా యాత్మనః ప్రాణమాస్థితో యోగధారణం"

ఇది శ్రీకృష్ణుని వాక్యము ముక్కు మొదలగు ద్వారములతో కాక హృదయమందున్న ప్రాణ వాయువుతో మూర్ధము నందున్న (బ్రహ్మరంధ్రములో) ఆత్మ సామీప్యమునకు చేర్చుటయే యోగధారణమని తెలియజేసినారు శ్రీ స్వాములవారు. ఇది కేవలము దేహమందలి అంతర్యమునందున్న మార్గము. గురు ద్వార గమనము. గురువు దొరకకున్న సాధ్యముకాదు.

ఎక్కడో ఉన్న దేవుని మెప్పించుటకు ఇంత శ్రమ ఎలా? అనవచ్చును. "అన్నియు నాలో ఉన్నవి. నేను వాటిలో లేను" ఇది శ్రీకృష్ణుడు దేవుడై నిల్చి చెప్పిన మాట. అన్నింటియందును దేవుడు ఉన్నచో ఆయా వస్తువుల అ లృత్వమెందేగును. ఆ పరమాత్ముని చైతన్యము కించి దంశమైన ప్రాణమున్నచో దేహమును కాల్చలేరు. పూడ్చలేరు. అది చెడిపోదన్నమాట. పరమాత్మ అందులో ఉన్నపుడు ఆ దేహము కుళ్లునా? ఆలోచించండి. దేవుని అన్నిచోట్ల చూడవచ్చును తప్ప అన్నింటియందును దేవుడు లేడు. దేవుని దేవునిగానే చూడవలెను. ఇది తపోనిధులకు మాత్రమే సాధ్యము. అతని చైతన్యాంశము అన్నిచోట్ల నిండియున్నది. అదియే ఈశుడు, ఈశ్వరుడు ఇత్యాది పేర్లతో పిలువబడుచున్నది.

మన దేహమనెడి రథమును కర్తవ్యమునకై నిర్మించుకొనెను. ఆత్మ సారధ్యమునకు అవసరముగా కావలసిన ప్రాణమును సృష్టించుకొనెను.



ఆ ప్రాణుని ముఖాంతరముననే ఆత్మ దర్శనము సాధ్యము. ఆ ప్రాణము మన దేహమున కలదు. అందుకే శ్రీకృష్ణుడు "సర్వద్వారాణి సంయమ్య" అన్నారు. "అన్యథా శరణం నాస్తి త్వమేవ శరణం మమ" దీని అర్థము తెలియునా? మాకు కృష్ణుడే కావలయును. అతడే శరణ్యుడు. మనకు అతని బోధన, ఆదర్శము, ఆచరణ కావలెనా? కేవలము అతని రూపం, నామ జపం చాలా? "శరణం మమ" అనగా సర్వకర్మ పరిపూర్ణుడై నిలిచిన నన్ను చింతించిన, యోచించినకాదు. సర్వకర్మలు తపస్సు అన్నింటిని నావలె ఆచరించి శరుణు పొందినచో అని అర్థము చేసుకొనవలెను.

ఈ మార్గమున కొనసాగువాడు ఎట్లుండవలెను?

"నాత్యశ్నతస్తు యోగోऽస్తి" అనగా దేనియందును అతిగా పోక క్రమము తప్పక నియమబద్ధమైన జీవనము ఉండవలెను. ఆహార విహారముల యందును అంతే "యుక్తాహార విహారస్య" అట్టి సాధనకు "యోగో భవతి దుఃఖహా" భయ నివారకమైన యోగము ప్రాప్తించును. ఆ రీతిగా అన్య మార్గముల వక్ర కల్పనలకు లోబడక ఆశ్రయించిన తాను చెప్పినట్లు నడచుకొని సాధించు ఆత్మ చింతనాపరులకు ధ్యానమందు ఉండువారికి యోగ క్షేమమును తాను వహించునట్లు అతను ఓదార్చినాడు. "యోగ క్షేమమ్ వహామ్యహమ్" అన్నాడు.

అందరికి భగవద్గీత అందుబాటులో ఉన్నది. సులభ గ్రాహ్యా మైనది ఎట్టివారికనగా "విద్యా వినయ సంపన్నే....,." అట్టి వారికి... ఇచట విద్య అనగా బ్రహ్మవిద్యయని, బ్రాహ్మణుడనగా బ్రహ్మత్వం తెలిసినవాడు అనగా స్వానుభవమున తత్త్వజ్ఞుడు. వర్ణధర్మములయందు వర్ణించినది జాతుల దృష్టితో కాదు. ప్రతివాని యందు నాలుగు

వర్ణములున్నవి. స్త్రీత్వము, పురుషత్వములున్నవి. అధో ఇంద్రియముల కర్మ శూద్రత్వము. చంచలత అధీరత స్త్రీ లక్షణం. విమర్శనా బుద్ధి వైశ్యత్వము, ధీరత్వము, క్షాత్రత్వము, జ్ఞానము బ్రహ్మత్వ లక్షణము. ఈ జ్ఞానము ప్రయత్నమునకు ఫలమై లభ్యమగునది. మిగిలిన వన్నియు అభ్యసించవలసినవి. గీతను ఎల్లరూ పఠించుచున్నారు. అనుభవముతో తెలిసి ప్రవర్తించిన మాత్రమే సార్థకమని శ్రీ విజయీంద్రస్వాముల వారు తెలియజేసినారు.

88. శ్రీ యోగి అచ్యుత ప్రభువులవారు, వారి శిష్యులు శ్రీ స్వామి విజయీంద్రులవారి సంభాషణలయందు వెలువడిన కొన్ని ఆధ్యాత్మిక విషయములను వివరింపుము?

అచ్యుత ప్రభువుగారు ఒక రోజున తత్త్వ విషయమై మాట్లాడుచూ మొట్ట మొదట ప్రాణ చేతనము సృష్టించబడినదనియు దాని మూలముగా యావత్తు ప్రకృత్తి, ఆకాశతత్వము, వాయువు, అగ్ని, జలము, భూమి ఇత్యాది పంచభూతములు సృష్టించబడినవని సెలవిచ్చినారట. ఆ మహా చేతనము మూలకముగా మనస్సును చేరి ఇంద్రియ సామ్రాజ్యాన్ని నడిపించుచున్నదని తెలియపరచినారట. ప్రతిరోజు జీవి పనిచేసి అ లసిపోయి, తపస్సులో ప్రశాంతతలేక పడిపోయి, ఈ క్షుద్రగతికి చేరి జీవితము సాగుచున్నది. అనారోగ్యము పాలగుచున్నది. దీనికి కారణము తపోహీనతే అని ప్రభువులు వివరించినారట. తపస్సు, కర్తవ్యము, నిష్ఠ, శాంతి ఇవి ప్రభువుల ఉపదేశమని శ్రీస్వామి విజయీంద్రులవారు అన్నారు. ఒకసారి ప్రభువుగారు శ్రీవిజయీంద్ర స్వామితో తపస్వుల ఆహ్వానము మేరకు వెళ్లవలసి వచ్చినదని, అనేక విషయములు చర్చించితిమని చెప్పినారట. సంధ్యా సమయము అగుట



వలన శాంతి మంత్రములు, ధ్యానము, తపస్సునకు వారు వెళ్లిరి అన్నారట. మీరు ఒక్కరే శాంతి మంత్రములు చెప్పువారు కారు అని అంటూ, శాంతి మంత్రములు వినిపించుచున్నవి వినండి అన్నారట. ఋష్యమూక పర్వతప్రాంతాల నుండి వినవచ్చిన శాంతి మంత్రములు విన్నారట. ఒకసారి విజ్ఞాన విషయమై చెప్పుచూ ప్రభువులు పూర్వం భారతంలో భరద్వాజ మహర్షి విమానాన్ని కనిపెట్టినారని చెప్పినారట. ఇప్పటికీ ఈ గ్రంథం మైసూరు ఓరియంటల్ లైబ్రరీలో ఉన్నదన్నారట. ఇక ఫోను విషయం తెలియజేస్తూ ఋషుల కాలంలో భూమినుండి మంగళ లోకానికి (కుజ గ్రహం) వెళ్లుచుండేది దీనికి కొరత ఉండేది కాదన్నారట ప్రభువులు.

విద్యోపదేశము ఇచ్చిన తర్వాత గురువునకు శిష్యుని దైహిక మానసిక యాతనలు హింసించును. కఠినముగా ఉన్నను సహించ వలయును. లోక కల్యాణము కావలెనన్న హింస తప్పదు. కాని వాటినుండి నేను కాపాడుచూ ఉండెదనని ప్రభువులు అన్నారట. విద్యోపదేశము ఇచ్చువారు భయపడవలసిన అవసరము లేదు. విద్యోపదేశము ఇచ్చుట ఒక పుణ్యకార్యమని ప్రభువులు సెలవిచ్చినారు. మన గురువుగారు పలుమార్లు దీనిని గురించి అభయము ఇచ్చినారు. మన వక్తారులు శ్రీవిజయీంద్ర స్వామి వారు మరియు శ్రీజయతీర్థస్వామివారు ఆశ్రమ వాతావరణము మనస్సుకు తృప్తి శాంతి కలుగజేస్తుందన్నారు. ఆశ్రమ ప్రాంతములో ఋష్యమూక పర్వతముల వరుస కనిపించును ఆ గుహల్లో ఎన్నో సంవత్సరముల నుండి ఋషుల నివాసము ఉన్నదన్నారు. అప్పుడప్పుడు వారు బయటకు వచ్చి ఆశ్రమములో కూర్చునేవారన్నారు. అందరిని దర్శించవలెననెడి అభిలాష మాకు ఉండేదన్నారు మన గురువులు. అందువల్ల అచ్చటి వాతావరణము ఎంతో ప్రశాంతత కలుగచేస్తుందని

మన గురువుగారు అన్నారు. ప్రభువు అచ్యుతుల వారు ఒక విశాలమైన రాతిగుండుపై కూర్చొని ఆశ్రమములో శిష్యులకు బోధ చేయుచుండేవారట. ప్రభువుల వారు తత్త్వజ్ఞుల మరియు తత్త్వ ప్రచార విహారముల గూర్చి అనేక విధములైన మెలకువలు చెప్పేవారట. ప్రభువులు ఒక మారు తత్త్వ విషయము గూర్చి ప్రసంగిస్తూ "సమత్వం యోగ ముచ్యతే" అని ఉంది కదా! దీని విషయమై ఏమైనా ధ్యానం ఆచరించినారా? అనుభవానికి వచ్చినదా? అని ప్రశ్నించారట. ప్రభువులు, శ్రీవిజయీంద్రస్వాములవారిని "గుండప్ప" అని సంబోధించెడివారట. దీని విషయమై పాండిత్య పరంగా విశదీకరిస్తావా? అన్నారట శ్రీప్రభువుగారు. అందుకు శ్రీవిజయీంద్ర స్వాములవారు ఈ క్రింద తెలిపిన విధముగా విశదీకరించి నారట.

స:- స్వరూపమైన చేతనము

మ:- మనస్సు యొక్క సంకేతాక్షరము "సమ"మైనది

త్వం:- చేతనాన్ని తత్ ఏ రోజో దర్శించదమైనది. ఇచ్చట "త్వం" అనగా వేదవిద్య విషయాన్ని వైదిక బద్ధముగా "తత్త్వం" అని ఆ రీతిగా అచ్చటనే నిర్వికల్ప స్థితి యొక్క స్థానము నందే ప్రాప్తి యయిన ఉచ్చారణ విషయమై "యోగ" స్థితిలో వేద్యమై జాగరూకుడై స్వస్వరూపాన్ని మనో మిలనము వల్ల జాగరూకతతో "ఉ" కార స్వామ్యము నుంచి సుదీర్ఘమై "తత్" అనే దాన్ని ఆరోపణగా ఉన్న స్థితి అనగా "చేతనము" మనోయుతముగా సుదీర్ఘమై దృఢ తపస్సు చేత మహోదాత్త "గమనము"ను చెప్పును. అందుకు యోగమని చెప్పబడినది. దీనినే "సమత్వం యోగ ముచ్యతే" అంటారని వివరించి నారట. తపస్సులేని పాండిత్యము కేవలము వృథాకాలయాపన అని వివరించినారట శ్రీవిజయీంద్ర స్వాములవారు. మేము కేవలం తపస్వులం. మాకెందుకు ఈ పాండిత్యం అని శ్రీప్రభువుల వారు లేచి వెళ్లినారట.



89. అచ్యుత ప్రభువులవారి తత్త్వ ప్రణాళిక గురించి మన వక్తారులు వివరించిన విషయములు పేర్కొనుము?

యోగ మార్గమని ఎందరో ఎన్నో పద్ధతులను బోధించినారు. కాని మన ప్రభువులు అవి ఏవియు నిజమైన యోగవిద్య కాదని భగవద్గీత మరియు ఉపనిషత్తులయందు బోధించబడినదే నిజమైన యోగవిద్య అని మరియు దానిని ఒక అనుభవముగల గురువుచే మాత్రము తెలిసికొని అభ్యసించుటకు సాధ్యమని, ఆ నిజమైన యోగవిద్య ఇంద్రియాదుల ద్వారా అభ్యసించునది కాదని సెలవిచ్చిరి. నిజమైన యోగవిద్యను తమ శిష్యులకు ఉపదేశించినారు.

శ్రీమద్భగవద్గీత తత్త్వప్రణాళికయే వారి తత్త్వప్రణాళిక. ఒక సందర్భములో ప్రభువుగారే స్వయముగా చెప్పినది ఏమనగా సమగ్రమైన తత్త్వగ్రంథమంటే ప్రపంచములో భగవద్గీత ఒక్కటే. దాని తర్వాత ఉపనిషత్తులు కొంతవరకు తెలియపరుస్తాయి. యోగ విద్యకు పతంజలియోగసూత్రములు అధికార గ్రంథము కాదు. యోగమునకు గీత ఒక్కటే అధికార గ్రంథమని వివరించినారు. శ్రీస్వామిజయతీర్థుల వారు తమ అనుయాయులకు ప్రభువుల వారు వివరించిన విషయములను తెలియజేసినారు భగవద్గీతను చదువుడు కాని ఏ వ్యాఖ్యానమును చదవకూడదు. మూల శ్లోకములు మాత్రమే చదివి వాటియందలి నిజార్థము గ్రహించుటకు ప్రయత్నించండి. ఆ సంస్కృత భాషలో మీకు పరిణతి లేదని బెంగపడవలదు. యోగవిద్యలో సాగుచూ గీతా శ్లోకార్థమును తెలిసికొనవలెనని ప్రయత్నించుచువారికి పరితపించువారికి భగవత్ కృపచే నిజమైన అర్థము తప్పక స్ఫురించును అన్నారట. ఆధ్యాత్మ సాధనయే ముఖ్యమని శ్రీజయతీర్థస్వామివారు అన్నారు.

“ప్రథమ తత్వార్పణము” అనే ఆశ్రమ గ్రంథంలో గీతయందలి కొన్ని శ్లోకములు వాటి అర్థము వ్రాయబడినది. వాటిని అభ్యసించి తెలుసుకొనమని శ్రీస్వాములవారు అన్నారు.

ఆశ్రమములో సాధన విషయమై వివరించుచు “అన్నగతః ప్రాణః ను విశదీకరిస్తూ శ్రీగురువుగారు తెలిపిరి. స్థూల వస్తువు స్థూలమున విలీనము అగునట్లు లేక శుద్ధి అయినట్లు, మాలిన్యము నీటితో శుద్ధి అగునట్లు నీరు త్రాగిన దప్పిక శమనమగునట్లు, స్థూల దేహము ఆకలిని ఆహారముతో పరిహరించుకొన్నట్లు ప్రాణుడు తనకు కావలసిన ఆహారాన్ని సర్వమయమైన వాయువుతో శుద్ధీకరించి ఆ వాయువునే అశనోపాధిగా (అన్నగతఃప్రాణః) భుజించుచు దాని ద్వారానే తన మోక్షమును సాధింపగల ఆప్రాణుని ఆయామ స్థితి అనగా ప్రాణాయామముతో పరమ పదవికి పురోగమించును. దీనినే నేను గ్రహించినంతవరకు తెలుపుటకు పూర్వీకుల మహా వ్యాఖ్యానములనే అతి సూక్ష్మముగా సారాంశం ఇచ్చుచూ చెప్పెదను. మాయా పిపాసులు గాక అసూయలు వదిలి శాంతముగా సాధనలో సాగండి అని ప్రభువుగారు అన్నారు.

90. శ్రీజయతీర్థస్వాములవారు సాంఖ్యాయోగాన్ని ప్రాణశబ్ద నిర్వచనాన్ని ఈశ్వర జీవ శబ్దాన్ని వాయువు విషయాన్ని గురించి సూక్ష్మముగా చెప్పిన విషయాన్ని తెలియజేయుము?

ఆధ్యాత్మ విషయ నిర్ణయములో వేలాది జనులు ఒక్కొక్కరు ఒక్కొక్క విధముగా వ్యాఖ్యానించినారు. ఆ వ్యాఖ్యానములను విమర్శించుకొంటూ మోక్షము పొందుట ఎట్లు సాధ్యమగును? గ్రంథములు చదివి మనము తెలుసుకొన్ననే జ్ఞానోదయమగునా? అట్లైన బ్రహ్మవిద్య(యోగవిద్య) ఎందులకు? అని స్వామి జయతీర్థుల వారు అన్నారు. సాంఖ్య యోగములను



వేదాంతులను వారు ఎప్పుడు ఖండింపసాగిరో అప్పుడే వారు సత్యదూరు లయినారు. సాంఖ్య- యోగములు వేరువేరుగా ఆలోచించుట బాలబుద్ధి. ఏది సాంఖ్యమున జ్ఞానము (జ్ఞానులకు బోధ పడునట్లు చెప్పబడినది). అయ్యది యోగము వలన లభ్యమగుననివారు అన్నారు. ఈ విధముగా గీత ఘోషించుచుండ సాంఖ్య-యోగములను ఖండించి తమదే అయిన పంతాలను స్థాపించువారి బుద్ధిని ఏమనవచ్చును?

జ్ఞాన ప్రాప్తికి సాధనము గ్రంథములు కావు. కేవలము మేధాశక్తితో ఎవ్వరూ సత్యమును గ్రహింపజాలరు. అందుచేతనే మహర్షులు “న మేధయా-న బహుధా శృణోతి, నాయమాత్మా బలహీనేన లభ్యతే” అని హెచ్చరించినారు. తత్త్వము అనుభవ వేద్యము. గ్రంథ పఠన శ్రవణాదులు చాపల్యములు.

వాయువు బ్రహ్మరంధ్రముననే ప్రతిష్ఠితము అని ఎట్లు చెప్పగలరు? ప్రతిష్ఠిత మనగా నేమి? విగ్రహ ప్రతిష్ఠ చేయుదురు అనగా లక్ష్మీ నారాయణాదులను అచ్చట తెచ్చి నిలుపుదురా? తమకిష్టమైన దేవతల ప్రతీకలను అచ్చట స్థిరపరచెదరు. అట్లే వాయువు బ్రహ్మరంధ్రము వరకు వెళ్లుకున్నను వాయు మథనచే ఉత్పత్తి అయిన సారాంశమునే అనగా అశనమును ప్రాణుడు స్వీకరించి బ్రహ్మరంధ్రమునకు పోయిచేరును అని అర్థము చేసుకొనవలెనని శ్రీ స్వామివారు అన్నారు.

ఇచ్చట “దివ్యే బ్రహ్మపురే హ్యేష వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః” “తస్యాః శిఖాయా మధ్యే పరమాత్మా వ్యవస్థితః” అను వేదోపనిషత్తు వాక్కులను గమనించవలెను. బ్రహ్మరంధ్రమున ఆత్మ ప్రతిష్ఠితుడైనాడు. అగ్ని శిఖల మధ్య పరమాత్మ వ్యవస్థితము అను మాటల అర్థమైనను చేతనము (ప్రాణచేతనము) అచ్చట విరమించినప్పుడు ఆత్మ స్వరూపస్థితి యొక్క

జ్ఞానము అనుభవపూర్వకము కాగలదనియు ఆ స్థితిలోనే పరమాత్మ అననేమి అను విషయము తెలియనగును అని శ్రీస్వాములవారు వివరించినారు.

ప్రాణశబ్ద నిర్వచనమేమి? ప్రాణునిలోను సస్వవర్గము నందును ఉన్న క్రియాచరణశక్తియే ప్రాణము. తెలుసుకొను శక్తి అనగా జ్ఞాన శక్తి దీనికి లేదు "అంగానాం రసః ఇతి అంగీరసః" అన్నారు. దేహాంగము లందున్న రసము (శక్తి)అంగీరసము అని ఉపనిషత్కారులు వర్ణించియున్నారు.

వాయువు ద్వారా ప్రాణుని, ప్రాణుని ద్వారా జీవుని, ఆత్మద్వారా పరశ్రేష్ఠుని తెలియుట సుసాధ్యం అని ప్రభువు అచ్యుతులవారు అన్నారు.

జ్ఞాన ప్రాప్తికి సాధన శ్రద్ధయే మూలము. శ్రద్ధతో యోగవిద్య యందు సాగు సాధకులకు తనలోనే పై విషయములు బోధపడును. దీనినే స్వాధ్యాయమనుట. ఆ విధముగా స్వాధ్యాయమున సాగి తెలుసుకొన్నవాడే ప్రవచనమును ఒనర్చు అధికారి. ఆ ప్రవచనము కూడా స్వాధ్యాయేచ్ఛ కలిగించుటకు. స్వానుభవపూర్వకమైన ఎరుక కలుగటయే జ్ఞానము. వినుట చదువుట కాదు అని వివరిస్తూ శ్రీజయతీర్థస్వాములవారు కొన్ని ఉదాహరణలు ఇచ్చియున్నారు. "ఆత్మా వై ఆకాశః" అను మాటకు ఆత్మ వలన ఆకాశముద్భవించినది. అట్లే "ఆకాశాత్ వాయుః" అనగా ఆకాశము వలన వాయువు జనించినది. "వాయో రగ్నిః" అనగా వాయువు వలన అగ్ని ఇత్యాది వ్యాఖ్యానములందలి తుది గల ప్రత్యయములు వేరువేరుగా ఉన్నను అర్థము మాత్రము అన్నింటి నుండియే అని కల్పించినారు. అయ్యది వ్యాకరణ బద్ధమా? దీనిని పేర్కొను ఉద్దేశము ఏమనగా ఏ గ్రంథమున కైనను వ్యాఖ్యానము చదివి అర్థము గావించు



కొనుట కాదు. గ్రంథకర్త భావమును ఒక్కొక్కరు ఒక్కొక విధముగా గ్రహించి వ్రాసియుందురని స్వాములవారు తెలియజేసినారు. జ్ఞానప్రాప్తికి యోగసాధనే ముఖ్యమని మన ప్రభువుగారు పలుమార్లు వివరించి యున్నారు. ఆ సాధనా క్రమాన్ని బోధించియున్నారు.

91. "కర్మ" విషయాన్ని గురించి శ్రీజయతీర్థస్వాములవారు ఇచ్చిన వివరణ తెలియజేయుము?

కర్మ అనెడి మాట ప్రపంచమున అనేకార్థములుగా ఉపయోగించ బడుచున్నది. కర్మ అనగా క్రియాఫలము. ఈ ప్రపంచము ఏర్పడినదే ఒక క్రియవలన అన్నారు స్వామివారు. దానినే యజ్ఞం నుండియే ప్రపంచమును సృష్టించి ఆ యజ్ఞమునే కామధేనువుగా ప్రజలకు ఇవ్వబడినదన్నారు. యజ్ఞము చేయుచూ జీవించుడు. యజ్ఞము కొరకై ఆహార స్వీకారము చేయుడు. ఆ యజ్ఞం నుండియే సమస్త కల్మషములు నాశనమగును. "యజ్ఞక్షపిత కల్మషః" అని భగవద్గీత. దేవతలు ప్రీతి చెందెదరు. లోక కల్యాణము అగునని శ్రీకృష్ణుడు గీతయందు బోధించినాడు. నిత్య దేహి అయిన వానిని దేవునిగా గుర్తించిన వారే "తత్పురోన్నమః" అన్నారు. పురమనగా ఇక్కడ వారి అభిప్రాయము తాము చూచిన దేవుని నిత్యదేహమునే. "ఓం తద్బ్రహ్మ – తద్వాయుః – తదాత్మా – తత్ సత్యం" సృష్టికర్త అయిన బ్రహ్మ సూత్రాత్మకుడైన వాయువు సర్వ దేహములయందు స్థితుడైన చైతన్యము (జీవాత్మ) అని తెలిసి కొనవలెను. ఇదంతయు శాశ్వత సత్యమైన పురంనుండి బహిర్గతమై రూపుగొన్న చైతన్యమునుండియే. అది సదా క్రియాత్మకముగా ఉండును. దాని క్రియయందు ఒక చైతన్యము ఉద్భవించి సమత్వం అయినదన్నపుడు ఈ కర్మ అనుదానిని సంపూర్ణముగా విడచుటకు ఎవరికి సాధ్యము? అది

తెలిసియే "కర్మ మపరిహార్యమని" అన్నారు. సామాన్య విచారణ శక్తికి సామాన్యమైన అంతస్థులో విచారించినపుడు "కర్మ సన్యాసము" అసాధ్యమే. ఎందుకనగా క్రియ అనునది స్థూల సూక్ష్మము నందును ఉన్నది. శారీరకముగా చేయునట్టి స్థూల క్రియలను ప్రయత్నము వలన విడుచుట సాధ్యము కావచ్చును. అయితే దేహమున ప్రయత్నము లేకనే తనకు తానై నడుచు క్రియ మానసిక విచారము భావనలు లేకుండా చేయడము ప్రయత్నముతో సాధ్యమా? అని విచారించగా కర్మత్యాగమునది భ్రమగానే యుండును. జీవి యొక్క జన్మ కర్తవ్యము ముగిసినపుడు విశ్రాంతి దొరకును. అయినను అది కార్య పరిపూర్ణత ఫలమే. కాని కర్మ సన్యాసము కాదు. కర్మ చేయుటయందు మాత్రమే జీవికి అధికారము కలదు. ఫలమిచ్చువాడు వేరు.

ఈ క్రియా కర్మలయందు భేదమున్నది. తనకు ఇతరులకు హితమయ్యెడి క్రియలు సత్కర్మలు. తనకు ఇతరులకు చెడుపు కలిగించునవి కుకర్మలు, లేక దుష్కర్మలు సత్కర్మాచరణ వలన పుణ్యమును, దుష్కర్మా చరణవలన పాపము కలుగునని జ్ఞానులందరు తెలియజేసినారు. సత్కర్మలేవి? దుష్కర్మలేవి అను వాటిని వివరించి వారు బోధించినారు.

మహా సంయములై తపస్సు ఆచరించి ద్వంద్వాతీతులై యుగ యుగములనుండి నిర్వికల్ప సమాధి యందు కూర్చున్న పురుషులందు సూక్ష్మ కర్మలు లేవు కదా అను ప్రశ్న ఏర్పడవచ్చును. నిజమే, ఆత్మరతులైన వారి యందు సూక్ష్మాతి సూక్ష్మమైన ఒక కర్మ ఉన్నది అదే ఆనందానుభవ మనునది. దాని వలన దైవము దూరమగుట సాధ్యము కాదు. అందుకే అతనిని విశ్వానంద స్వరూపుడు అనియు అఖండానంద విగ్రహుడనియు చెప్పిరి.



కర్మయందు అకర్మను, అకర్మయందు కర్మమును తెలిసిననే కర్మ బంధనకారికాదని శ్రీకృష్ణుడు గీతయందు బోధించినాడు. దీని అంతరార్థము గ్రహించవలెను. స్థూల కర్మా చరణమునందున్న యోగి నిర్లిప్త భావముతో జగత్ కల్యాణమునకై రాగ ద్వేషములు లేక క్రియాచరణము చేయుటవలన దాని ఫలమునకు అతీతుడు. బద్ధుడు కాడు. అదియే కర్మయందలి అకర్మ. సదా ఆత్మరతులై జ్ఞానులైన మునులు దేనిని ఇచ్ఛగించని వారు కావున అది కర్మయే. కావున ఇది అకర్మయందలి కర్మము.

అట్లుగాక జ్ఞానము లేక హఠముతో తనకు కావలసినదంతయు చేయుచు పోవు క్రియయు అదే విధముగానే దేనిని చేయబోనని కర్మ సన్యాసముచే ముక్తుడ నగుదునని భ్రమకులోనై క్రియను చేయకుండుటయు బంధకమే అన్నారు స్వామి జయతీర్థులవారు. వీటి వల్ల కార్య సంపూర్ణతగాని ముక్తిగాని లభించదు. హఠముతో దేహకార్యములను విడిచినను జ్ఞానము లేనందువల్ల మనశ్శాంతి లభించక అనేక కోరికలు వికారము జన్మించి జన్మలకు కారణ మగుచున్నది.

అజ్ఞాన జన్యమైన కర్మ బంధనములకు కారణమై కష్టములను కలుగజేయును. ప్రయత్నముచే యోగ మార్గమునందు సాగువారు తమ పాపములన్నింటిని పోగొట్టుకొని శుద్ధుడగును. పరమ పదమును (అత్యంత శ్రేష్ఠ పరిశుద్ధుడు) పొందుట గీతలో చెప్పబడినది.

సత్కర్మాచరణము నుండియే సత్య సామ్రాజ్యం కలుగుచున్నది. అందువలన సర్వులు సత్కర్మా సక్తులు కావలెననియే శ్రీఅచ్యుతులవారు బోధించినారు.

92. శ్రీజయతీర్థ స్వాములవారిని తత్త్వ సమీక్ష విషయమై అడిగినపుడు వారు వివరించిన విషయములను తెలుపుము?

శ్రీ స్వామివారు ప్రపంచ విషయాన్ని వివరిస్తూ యోగము మరియు సాధనాక్రమాన్ని తెలియజేసిరి.

1. ప్రపంచము: ప్రపంచమనగా పంచభూతములు అనిపించుకున్న పృథ్వి, ఆప్, తేజస్సు, వాయువు మరియు ఆకాశముల కలయిక వలన ఏర్పడిన స్థూల ప్రపంచము అదే విధముగా ఆ పంచభూతముల శుద్ధాంశముల కలయిక వలన ఏర్పడిన దేహములు, ఆ దేహములలో చేరి ఆడి ఆడించుచున్న మనస్సు, బుద్ధి, చిత్, అహంకారాత్మకమైన జీవేశ్వరము అంటే ప్రాణము మరియు జీవము కొందరు మాటలతో చెప్పురీతిగా ఆత్మ మరియు జీవము అనగా క్రియాశక్తి అయిన ప్రాణము మరియు ఇచ్ఛాశక్తి అయిన జీవము వీటికి మించి మన దేహములో ఉన్న ఆత్మ స్వరూపాన్ని ప్రత్యగాత్మ అని చెప్పియున్నారు. వీటి అన్నింటి సమూహమే ఈ ప్రపంచము. యోగి యొక్క సృష్టి అని ప్రభువుల వారి అభిప్రాయము (The world is the creation of A yogi) ఇచ్చట ఆకాశాన్ని పంచభూతాల్లో చేర్చి చెప్పియున్నను ప్రభువుల అభిప్రాయములో భూతములు నాలుగే. ఆకాశము భూతము కాదు. అది తత్వము. ఈ సమాగమనము నుండే సృష్టి అయినట్లు ప్రభువులు చెప్పిరని శ్రీ జయతీర్థులు వివరించిరి.

2. సృష్టి మరియు ప్రళయము:- సృష్టి, ప్రళయము అనునవి పగలు రాత్రి వలె సహజమైనవి. సృష్టి సంకల్పము నుండి అయినది కాదు. మూలమునందున్న చేతనము యొక్క స్పందననుండి ఒక శక్తి ఉత్పత్తియై బయటకు వచ్చి ఆ ఒక్కదాని సూక్ష్మాంశము ఇచ్ఛాశక్తి క్రియాశక్తి అని రెండై, దాని సూక్ష్మాంశము అయిదై, ఆ అయిదు నందలి అంశము విభజనమై ఇరవైఐదై భారమైన అంశంలో ఏడై 32 సహజ మిలనమే జడ జగత్తు అయిన క్రమమని వారన్నారు. కాలక్రమములో వస్తువులు క్షీణించుటవలన సూక్ష్మాంశములు మాత్రము మిగిలి అవి విభజనయైన



క్రమములో మరియు చేరువయై ఒక్కటై మూలములో చేరునదే ప్రళయము. ఇది సహజముగా జరుగుచూ వచ్చుచున్నదే కాని సంకల్పముతో కాదు.

3. మూలము:- ఈ సృష్టికి మూలకారణమైన వ్యక్తినే దేవుడనుచున్నారు. అతని చేతనాంశము వలన ఉత్పత్తియై బయటకు వచ్చినది శక్తి. ఆ శక్తియే సర్వత్రా వ్యాపించి సర్వము తానై సర్వభూతముల యందు చేరి "ఈశ్వర" అని అనిపించుకున్నది.

4. ప్రకృతి జీవులు:- ఇవి నిత్యమైనవా? అనిత్యమైనవా? ఒక అర్థములో ఈ రెండు అనిత్యములే. ఎందుకనగా సృష్టి ప్రయాణములో సాగుచూ వచ్చుట వలన. ఇంకొక అర్థములో అవి నిత్యమైనవి. ఎందుకనగా అవి తిరిగి తిరిగి సృష్టియగుచున్నవి.

5. కర్మ:- కర్మ అనగా క్రియ. చేతనము సదాక్రియాత్మకమై నందున కర్మత్యాగమన్నది అసాధ్యము. కర్మ అని గమనించు మనస్సునే శక్తి, సమాధి అను స్థితిలో కూడ యోచన తరంగములు లేకుండా అ లలు లేని నీరు వలె ఉన్న స్థితినే కర్మ సన్యాసము. అమనస్కస్థితి ఇత్యాదిగా కొంతమంది చెప్పియున్నారు. చేయునటువంటి కర్మలు ఉద్దేశ్య పరిణామములను గురించి సత్కర్మకు పుణ్యపాపములైనవి. స్థూల సూక్ష్మములో కూడా పరిశుద్ధత కలిగియుండును. ఈ పద్ధతిలో కూడియున్నదే ధర్మకర్మ. అటువంటి ధర్మ కర్మా చరణమే దేవుని సేవ అనునది. భక్తుల దృష్టిలో మరియు జ్ఞానుల దృష్టిలో అది లోక కల్యాణానికి అవసరమైన మానవ కర్తవ్యము.

6. ఈశ్వర:- యోగ విద్యలో సాగి తత్వానుభవము కలిగినపుడు ఈశ్వర అనగా అన్ని ప్రాణుల లోపల బయట వ్యాప్తి అయినటువంటి ప్రాణవాయువు అని తెలుస్తుంది.

7. ఆత్మ:- జీవ భూతముల ఉత్పత్తికి మూలకారణమైన వాడు ఆత్మ అన్నారు జ్ఞానులు. జ్ఞానశక్తి లేకనే కేవలం ఇచ్ఛాశక్తి క్రియాశక్తి యొక్క కూడికనే జీవిఅన్నారు. అనగా ఇంద్రియ సంబంధమైన సుఖాదులకు చిక్కి చింత, ఆశ, మోహములకు లోనైన స్థితిలో జీవి అన్నారు. ఈ జీవి సాధన చేసినపుడు (ఆధ్యాత్మ సాధన) అనగా ఇంద్రియాతీతమైన అంతర్ముఖతానంద స్థితిలో ఆత్మ అనియు జ్ఞానులు తెలియజేసియున్నారు. జ్ఞానశక్తి అత్యంత హెచ్చుపరిణామములో తపస్వి అయిన జీవినే జ్ఞానులు పరమాత్మ అనియు పరమేశ్వరుడని చెప్పియున్నారు. అతనే సృష్టికి, స్థితికి, లయకు కారణమని త్రిమూర్తుల జనకుడని జ్ఞానులు గురుతించియున్నారు. అతడే కర్త మరియు యోగి అని వివరించినారు.

8. బ్రహ్మ:- త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మ విషయమై పురాణంలో వివరించబడినది. అయితే ఉపనిషత్కారులు అనగా జ్ఞానులు బ్రహ్మ అని పిలువబడు అతనిని జీవాత్మ, పరమాత్మ పైనున్న దైవాన్ని గురించి చెప్పబడినది. మహర్షుల విషయంలో కూడా భిన్నాభిప్రాయములు కనిపించుచున్నవి. మూలకారణమేమనగా శక్తి నిరాకారమని నిర్ణయించు కొన్నవారు దానిని బ్రహ్మ అనియు అది శాశ్వత శరీరమైన వ్యక్తియే అయి ఉన్న అతనిని దేవుడని చెప్పియున్నారు. అచ్యుత ప్రభువులవారు ఈ సృష్టిని రచించినవాడు "విరించి" భ్రమించినవాడు "బ్రహ్మ" అని సెలవిచ్చినారట.

9. ప్రాణాయామము:- వాయువు ప్రాణము కాదు. ప్రాణస్పందన వలన ఉత్పత్తి అయినది వాయువు. ప్రాణము శక్తి. వాయువు భూతము.

10. ధర్మము:- ధర్మమనగా కర్తవ్యము. తప్పక చేయవలసినది. దీని ఆచరణ వల్లనే తన, మరియు జగత్తు యొక్క కల్యాణము.



11. లోక కల్యాణము:- జగత్తులో అందరూ సుఖ సంతోషములతో సహజీవనము చేయుస్థితి.

12. ముక్తి మోక్షము:- జీవి దేహములో ఉండి, జ్ఞానియై కర్మశేషము లేక పరిశుద్ధుడై కూడా జగత్ కల్యాణమునకు సేవించుచూ కర్మచేయుచూ బ్రతుకుచున్న స్థితియే జీవన్ముక్తి. జగత్కల్యాణము గావించి తృప్తిని పొంది దేహత్యాగము చేసి దేవునిలో చేరిపోవునదే మోక్షము.

13. ఆనందము, శాంతి: సమాధి స్థితిలో అనుభవానికి వచ్చు స్థితి ఆనందము. క్రియాత్మక మైనపుడు కూడా మోహ ద్వేషాదులు ద్వంద్వమునకు అతీతమైన స్థితిని శాంతి అన్నారని శ్రీ స్వాములవారు వివరించినారు.

14. పరమ పదవి- శాశ్వత సుఖము :- తన అస్తిత్వాన్ని లేకుండా చేసికొనుట మోక్షము కాదు. కర్తవ్యాన్ని మరచి కూర్చొను ఆనందానుభవము కాదు. శాంతిని సదా కాపాడుకొనుచు లోక కల్యాణమునకు సతతము సేవచేయు స్థితే శాశ్వత సుఖము. అదియే పరమ పదవి.

15. జీవనము యొక్క సార్థకత:- శాంతికి కారణమైన జ్ఞానాన్ని తపస్సునుండి పొంది విజ్ఞానాన్ని పరోపకారమునకు వినియోగించి జీవించునదే జీవనము యొక్క సార్థకత.

16. యోగము:- యోగ మనగా సమత్వము. ఈ స్థితియే సాధనమునకు, భక్తి, కర్మ విజ్ఞానము, ఆవిధంగానే శ్రద్ధ, సహకారమైన అంశములు. వీటినుండి ముక్తుడై యోగవిద్యలో సాధకుని తన స్థూల సూక్ష్మ అశుద్ధతలను పోగొట్టుకొని పరిశుద్ధ సాధన జరిగినపుడు యోగి, యోగారూఢ ఇత్యాది శబ్దములనుండి చెప్పబడినది.

17. యోగి:- యోగములో స్థితి అయిన యోగి తనకొక

ఈశ్వరుడున్నాడని తెలిసికొని సృష్టికి తానే కారణమగుటవలన అతని సృష్టికి చేయు సేవయే తాను చేయు భక్తి యనుకొని కర్మత్యాగము చేయకుండా మోక్షాన్ని ఆశింపక కర్మలో నిలబడిన వాడే యోగి. అతనికి దైవము అత్యంత సమీపము. "నేనే అతను" అని చెప్పుకొను ధీరత, యోగ్యత, అధికారము ఉన్నా కూడా ఆ విధంగా చెప్పకనే "నేను యోగి, అతడు యోగీశ్వరుడు" అని చెప్పుచున్నాడు యోగి. పై విషయములో అనభవానికి వచ్చువరకు సాధ్యము కాదని జయతీర్థ స్వాముల వలన తెలియజేయబడినది. అంటే దీనిని సవాలుగా తీసుకొని ఆధ్యాత్మ సాధనయందు ప్రగతి సాధించవలసినదిగా శ్రీ స్వాములవారి ఆకాంక్ష.

93. జీవనము సమీక్ష విషయమై శ్రీజయతీర్థస్వాములవారు వివరించిన వాటిని తెలుపుము?

శ్రీ అచ్యుత గురువుగారు జీవన సమీక్ష విషయమై ఆధారము చేసికొని జ్ఞానులై తరువాత లోకసేవ చేయు విషయమై మరియు మనలను మనము అర్పించుకొను ప్రణాళికను వివరించి యున్నారు.

నిద్ర స్థితులు మూడు. ఒకటి ప్రారంభములో కలలు కాంచు స్థితి. రెండవది గాఢ నిద్రావస్థ – సుషుప్త స్థితి. మూడు ఆఖరు స్థితి. అనగా కొంత మెలకువ కలిగి కలగాంచు స్థితి. ఈ కలలో కన్పించునది కల్పనా జగత్తు. మనస్సు కల్పించుకొన్న విచారములు స్వప్నములో కన్పించునవి. తనకు తనలో జరుగబోవు కొన్ని సూచనలు. సుషుప్త స్థితిలో మనస్సుకు పూర్ణవిశ్రాంతి కలుగును.

అ లాగే జప ప్రారంభదశలో కనిపించునది విచారతరంగములు తర్వాత కల్పించునవి కల్పనా చిత్రములు. కొందరిలో అనగా బహిర్ముఖ స్థితిలో ఉన్నపుడు దర్శనములు, అదే విధముగా భవిష్యత్తు సూచనలు



కనిపించును. ఈ మధ్య స్థితి సమాధి. దీనినే అచలనమని, అమనస్కమని చెప్పియున్నారు. ఈ స్థితులనే మధ్యస్థితి, సుషుప్తి, సమాధి స్థితులలో సువిచారములు మహత్వము కలిగి వాటినే ఆత్మ యొక్క సహజస్థితి అని చెప్పునంత వరకు వెళ్లినారు. యోగనిద్ర అని జ్ఞానులవల్ల చెప్పబడినది. ఇచ్చట ఆత్మ మెలకువ లేదు. దీనిని గమనించడం వల్ల వారు ఆ విధంగా చెప్పుటకు కారణమైనది. కనుకనే అచ్యుతులవారు సమాధి మాయకు దొరక కూడదు. ఈ మోహాన్ని కొంచెం వదలి లోక కల్యాణానికి శ్రమించండని హెచ్చరించినారు. ఆ విధంగా మెలకువ పొందాలంటే పై మూడు స్థితులను దాటి స్థితప్రజ్ఞులై వ్యవహరించమని బోధించినారు. ఇదే గుణాతీత స్థితి. గీతలో దీనిని తురీయాతీత స్థితి యని చెప్పిరని స్వాములవారు అన్నారు. తమ మూలాన్ని తెలుసుకొన్న జ్ఞానుల దృష్టిలో విజ్ఞానము పూర్ణము కాదు. జప తపస్సులందు ఈ విజ్ఞానము అనుభవానికి వస్తుందని ఉపనిషత్కారులన్నారు. ఈ అనుభవాలకే ఆగక ముందుకు సాగి తురీయాతీత స్థితి అయిన స్థితప్రజ్ఞత పొందవలెను. అట్లుకాక సమాధి స్థితితో ఆగిపోయి వెయ్యారు సంవత్సరములు స్థాణువువలె కూర్చున్న సార్థకమేమి? అనుచూ జ్ఞాన వికాసమునకు అడ్డు అగుచున్న అన్నింటిని అవిద్యయే కాని విద్యకాదన్నారు జ్ఞానులు.

జ్ఞానము లేనివారి యోగవిద్యా స్థితిని దక్షిణాయనానికి, జ్ఞానమున్నవారి స్థితిని ఉత్తరాయణానికి పోల్చియున్నారు. ప్రకృతియొక్క స్థూల స్థితిని అనుసరించి మానవుని మానసిక స్థితిని చాలవరకు స్థిత్యంతరములను పొంది విషయములను గమనించి ఆ రెండు అయనముల మధ్యకాలము(సంధికాలము) సంక్రాంతి శుభసమయము

లందు అవిద్యనుండి విద్యకు మెలకువ కలిగి ఉండవలెనని జ్ఞానుల సందేశమని శ్రీస్వాములవారు అన్నారు.

జ్ఞానులు లోక కల్యాణానికి శ్రమించునప్పుడు యోగులని పించుకొంటున్నారు. జ్ఞానులైనవారి జ్ఞాన వికాసము యొక్క స్థితులు వారు బోధించిన అంశములే లోక కల్యాణానికి గాను పూర్ణస్థితికి చెందువరకు ప్రయత్నమే ఈ విధముగా విడిచిన దానిని పూర్తి చేస్తూ వస్తున్నారు. విభూతి రూపాలు అవతార పురుషులు అట్టివారి సేవ ఫలితముగాప్రపంచము ఇంత వరకు వచ్చి నిలబడినది. ఈ జీవన సమీక్షను పూర్తిగా వివరించి పూర్ణుడు అనిపించుకొన్న అతని పూర్ణహుతంగా లోక కల్యాణానికి తన్ను తాను అర్పించుకొనవలెనని ప్రభువుగారి పిలుపు.

94. జయతీర్థస్వాములవారు సాధకులు అడిగిన ప్రశ్నలకు వివరించిన సారాంశమును తెలియచేయుము?

1. ప్రశ్న:- యోగులు కర్మను నమ్ముతారా? అట్లైతే తపస్సు యొక్క ప్రమేయమెందులకు?

జ్ఞాని కంటె యోగి అధికుడని భగవద్గీత తెలియజేయుచున్నది. ఆత్యంతికమైన సత్యాన్ని తపస్సు ద్వారా తెలుసుకొన్నవాడు జ్ఞాని. జ్ఞానియై అంతటితో తృప్తిపడక లోక కల్యాణమునకై కర్మ (కర్తవ్యము) చేయువాడు యోగి. మరి 'కర్మ' లో యోగికి నమ్మకం లేదనడం ఎట్లా? అతడు చేయునదంతయూ స్వార్థరహిత జ్ఞాన పూర్ణమైన 'కర్మ'. అందువలన కర్మఫలానికి బద్ధుడు కాడు. ఇచ్చట 'కర్మ' అనగా కర్మ ఫలము, ప్రారబ్ధము ఇత్యాది భావమైతే ప్రతిజీవియు తాను చేసిన కర్మ యొక్క పరిణామము (ఫలము) అనుభవించవలసినదేనని జ్ఞానుల భావన. యోగులు కూడా



ఈ కర్మాన్ని అనుభవిస్తారు. జీవి జ్ఞానియగు వరకు ఈ కర్మానుభూతి ఉంటుంది. యోగి యగుటకు భగవద్గీతలో – "ప్రయత్నాత్ యతమానస్తు, యోగీ సంశుద్ధ కిల్బిషః, అనేక జన్మ సంసిద్ధిః, తతో యాంతి పరాంగతిమ్" అను విధముగా జీవియుతన ప్రయత్నము వలన కిల్బిషాన్ని తొలగించుకొని పరమగతిని, పడయును కిల్బిష మనగా వెనుకటి జన్మల యొక్క కర్మ దోషములను పోగొట్టుకొనునని భావన. ఈ కర్మ దోషములు తపస్సులో శుచిత్వాన్ని పొందుతాయి. అనగా తపస్సువల్లనే జ్ఞాని యగుటకు యోగి యగుటకు సాధ్యమగునని వివరించడమైనది. ఈ విషయమై యోగి, యోగీశ్వర కృష్ణుని జీవితమే తార్కాణమని శ్రీజయతీర్థులు అన్నారు.

2. ప్రశ్న :- అజ్ఞానులకు, జ్ఞానులకుగల తారతమ్యము వివరించండి?

అజ్ఞానులైన తపస్వులు రెండు విధములు. తమ దేహం మనస్సు శుచిగా ఉండవలెనను ఆకాంక్షతో తపస్సు చేయువారు ఒక విధము. తమ అజ్ఞానమునుంచి ఏదో ఒకటైన దైవాన్ని ఇష్టం గావించుకొని తపించి (ఉపాసించి) దీని ఫలమై వారినుండి కామ్యాదులు పొంది సుఖించువారు ఒక విధము. తమ ఇష్ట దేవతలనుగూర్చి తపస్సు చేయకుండా జ్ఞాన ప్రాప్తికొరకు తపించువారు వేరు. లోక కల్యాణానికి తపించు సాధనాపరులు వేరు. ఈ విధముగా తపస్వుల భిన్నాభిప్రాయాలు గురించి స్వామిగారు వివరించినారు. తాము అజేయులు కావలెనని ఘోర తపస్సు గావించి దేవతల వరాలు పొంది లోక కంటకులైన రాక్షసులు పూర్వం ఉండేవారు. వారు దైవముచే సంహరింపబడుచుండినారు. కావున జ్ఞానప్రాప్తికై యోగ సాధన తీసికొని సాధన చేసి మనిష్యత్వాన్ని తెలిసికొని జీవించవలెననెడి అభిలాషతో ఉన్నటువంటి వారు వేరు. వారి వల్ల లోకానికి హితమగును.

3. ప్రశ్న:– ఆత్మకులింగ భేద మున్నదా? ఇది ప్రతియొక్క మనసుకు వచ్చి విచారించు విషయము.

లింగభేద మనునది స్థూల సూక్ష్మ స్థితులందు కూడా ఉన్నది. స్థూలతః స్త్రీ పురుష దేహములు కన్పించుచున్నవి. సుఖదుఃఖాను భూతులు ఇరువురకు ఒకటే. స్త్రీల యందున్న పురుషత్వము, పురుషులయందున్న స్త్రీత్వము బాగుగ కన్పించుచున్నది. ఇది మనస్సు యొక్క స్థిత్యంతరములు. స్త్రీలు, పురుషులుగాను, పురుషులు స్త్రీలుగాను జన్మాంతరములో పుట్టవచ్చును. అయితే దేహములో ఉన్న ఆత్మకు లింగభేదము లేకుండినను దేహధ్యాస ఉన్నపుడు జీవికి తాను స్త్రీ అని పురుషునకు తాను పురుషుడననే భావన ఉండును. దేహస్థుడైన ఆత్మ అంతర్ముఖమునందు బ్రహ్మ రంధ్రములో ప్రాణునితో చేరినపుడు తాను తన సహజ స్థితి అయిన ఆనందాన్ని పొందుచున్నాడు. కావున అచట దేహధ్యాస ఉండదు. అందువల్లనే ఆత్మకు లింగభేదం లేదన్నారు.

జీవి, తాను బహిర్ముఖ స్థితికి వచ్చినపుడు లింగభేదము కన్పించుచున్నది. ఇచ్చట ఆత్మ పురుషుడని జీవి స్త్రీయని పరిగణించబడినది. ఈ జీవి ప్రాణునితోకూడి పురుషుని వద్దకు వెళ్లవలసినదేకాని ఆ పురుషస్థితిలో ఉండే ఆత్మ ఎప్పుడూ క్రిందికి దిగిరాదు. కాబట్టి మనదేహమందున్న జీవిని స్త్రీ స్వరూపమని, పురుషుని పురుషప్రవృత్తి యని చెప్పబడినది. ధీరత్వము పురుష లక్షణము. అనగా ఆత్మ యొక్క లక్షణము ధీరత్వము కావున ఆత్మపతి జీవి సతి అనే భావన కలిగియున్నది. అనగా వాయు మథనములో అశనమును పొందిన ప్రాణుడు బలీయుడై మనస్సు ప్రాణ చేతనముతో కలియుట వలన ప్రాణ మిలనమై ఊర్ధ్వగతి



పొంది ఆత్మలో చేరుటవల్ల ఆనందానుభూతికి కారణమైనది. ఈ జీవి ఆత్మలో చేరినపుడు మాత్రమే ఆత్మశాంతి అని పేర్కొనబడినది. ఈ సంప్రదాయాన్ని తెలిసిన ఆచార్యులే వివాహ విషయమునందు స్త్రీ పురుష స్నేహాన్ని వివాహ బంధముగా మార్చినారు. ఇది యుగ యుగముల నుండి వచ్చు మన ఋషి సంప్రదాయము. పై విషయములు అనుభవానికి రావలెనన్నచో ఆధ్యాత్మ సాధన చేసియే తీరవలెనని గురువుగారి ఆకాంక్ష.

95. శివరాత్రి విషయములు చర్చించుచూ శ్రీజయతీర్థస్వాముల వారు లింగోద్భవాన్ని గురించి విశదీకరించిన విషయములను వివరింపుము?

ఆదియందు బయలు (శూన్యము) ఉన్నది. ఈ బయలునందు లింగము ఉద్భవించినది. అది స్పందించనారంభించినది. దీని నుండి నాలుగు మహాభూతములు ఒకదాని తరువాత ఒకటి ఉద్భవించినవి. ఆకాశంలో ఈ నాలుగు మిలనము వలన లోకములు, దేహాదులు ఉత్పత్తి అయినవి. ఈ విధముగా గుణప్రాధాన్యముతో త్రిమూర్తులు వీరికంటే ముందుగా కొంతమంది వ్యక్తులు జన్మించినారు. ఇది సహజ సృష్టి.

త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మ వలన సృష్టి కార్యము ముందుకు సాగినది. ఇది సంకల్ప సృష్టి.

బ్రహ్మ యొక్క మానస పుత్రులలో స్వార్థము మాత్సర్యములు ఆదిగ కలిగి వికల్ప సృష్టియు, స్త్రీ పురుషుల సమాగమము వలన సంతానోత్పత్తి యగుచు వచ్చినది.

లింగోద్భవము కంటె ముందుగా ఉన్న బయలు (ఆకాశము–శూన్యము) లింగ విలాసము యొక్కక్షేత్రమై అంగ–యోగ–భగ– ఇత్యాదిగా చెప్పబడినది. ఏ వ్యక్తి తన అంగములో లింగము యొక్క గుట్టును తెలుసుకొనునో అతను ఆనందముతో అనగా అనుభవముతో అనుభవించి

పరులకు ఆదర్శప్రాయుడుగుచున్నాడు. ఆ విధముగా అగుటకు లింగాంగ సామరస్యమే–సాధన. లింగమే ప్రాణశక్తి (క్రియాశక్తి). అన్నింటి ఉత్పత్తికి మూలకారణ మగుటవలన దానిని లింగమన్నారు.

అయితే బయలులో ఉద్భవించిన ఈ లింగము మొదట ఎక్కడ ఉన్నది? ఆ బయలునందు ఉంటే ఉద్భవించినది అనడం ఎందుకు? అంతేగాక సదా పనిచేయుచున్న అది–నిష్క్రియ అగుచున్నది ఎందుకు? ఈ విధంగా విచారించినపుడు అది మొదట ఆకాశములో కాకుండా – ఆకాశములో స్థితమైన మరొక దేహములో ఉండి, అచటినుండి బయటకు వచ్చి సృష్టికి కారణభూతమగుచున్నదని తెలియనగును. అట్లు అను కొన్నపుడు లింగము ఏ వ్యక్తి దేహము నుండి బయటికి వచ్చినదో ఆ వ్యక్తిని మూలతః లింగమని పిలువ వలసివస్తుంది. అతని శక్తియే కార్యక్షేత్రము. ఈ బయలు అగుటవలన, దీనిని అతనికి భగ మనియే, అనుచూ భగవంతుడని పిలుచుచున్నారు. ఉద్భవించిన అన్ని శక్తులు అంతర్ముఖము బహిర్ముఖములకు లోనయి జంగములు అయినారు. అతను సదా అంతర్ముఖుడై స్థాణు – అచల – సనాతన – శాశ్వత – సదాశివ – ఇత్యాదిగా పిలువబడు చున్నాడు. అతను నిత్య దేహి అని చూపించుటకు "ఆకాశస్థ లింగాత్" అనే విజయీంద్ర స్వాములవారి నిర్ణయాన్ని, ప్రభువు అచ్యుతులవారు "ఆకారస్థ లింగాత్" గా మార్పు చేసినారు. దీనిని తెలిసిన జంగములే గురువులు (యోగులు). అందులో ఆది పురుషుడు అనిపించుకున్న యోగియే "శివా"(హిరణ్యగర్భ) అన్నారు.

అవతారపురుషుడు శివుని అంశము నుండి ఇతర జంగముల అంశము నుండి అగుచు వచ్చినవి. కృష్ణావతారము మాత్రము సదాశివుని అంశము నుండి వచ్చినదని విశ్వసించుచున్నారు. కనుకనే ప్రభువు అచ్యుతులవారు మహత్వమిచ్చి అతనిని యోగీశ్వరుడని చెప్పియున్నారు.



సదాశివుడే ఇష్టలింగము. అతని విషయజ్ఞానమే భావ లింగము. ఆ విషయజ్ఞానానికి కారణమైన ప్రాణశక్తి ప్రాణ లింగము. ఆ శక్తి నిరాకారమనెడి సూచనయే సర్వస్థలములో ''లింగము'' అంటే "దీక్షాలింగము".

సదాశివుని అవతరణ సాధ్యమా? అని ప్రశ్నించి తమ తత్వబోధన ప్రభువులు నిలిపియున్నారు. ఇది సాధ్యము కాదని వెనుకటి జ్ఞానులు సిద్ధపురుషులు నిర్ణయించినారు. అందువల్లనే "నిశ్శబ్దం బ్రహ్మ ముచ్యతే" "ఆనందో బ్రహ్మేతి వ్యజానాత్" అనియు దేవుని విషయమై నిర్ణయించినారు. అవతరణ సాధ్యము కాదు. బహిర్ముఖము సాధ్యము కాదు, అంటే దేవుడు సర్వశక్తుడు అన్నదానికి అర్థమేమిటి? అందువలన అవతరణ సాధ్యము. అది అయినపుడు శాశ్వత ధర్మ స్థాపన సాధ్యమగునని శ్రీజయతీర్థస్వాముల వారి విశ్వాసము. అది జరిగినపుడు జీవించియున్న భక్తులే ధన్యులు అని స్వామి జయతీర్థులు అన్నారు.

96. శ్రీస్వామి జయతీర్థులవారు వివరించిన శ్రీఅచ్యుత ప్రభువులవారి జీవిత విశేషములను కొన్నింటిని తెల్పుము?

భరతవర్షం అనాదిగా తపోభూమి. విశ్వకల్యాణకారకులైన మహర్షుల వాస స్థలము పావనమైన ఈ దేశంలో మనుష్యులుగా జన్మించి మనుష్యులుగా వ్యవహరించి జనుల దోషములను తెలియబరచి మానవపూర్ణత్వమునకు మార్గదర్శకులైన మహనీయుల గూర్చి చదువు చున్నాము. కాని అచ్యుత ప్రభువుల వైశిష్ట్యం ప్రత్యేకమని శ్రీజయతీర్థ స్వాములవారు చెప్పేవారు.

మానవాళిలో ధర్మం–తపస్సు–ముక్తి వీటిపట్ల నిశ్చయ పరిజ్ఞానము కాని తెలుసుకొనవలెనను శ్రద్ధకాని లేని ఈ కాలములో అవతరించి

అనేక శ్రమలకోర్చి గుప్తమైన బ్రహ్మవిద్యను లభ్యము గావించుకొని మానవ సముద్ధరణ జగత్కల్యాణ కార్యములే ధ్యేయముగా హంపి దగ్గర ఆశ్రమము స్థాపించి సహవాస భాగ్యము ఒనర్చి కర్తవ్య పరతను బోధించి తత్వా కాంక్షులెందరికో యోగ విద్యను ప్రసాదించిన పుణ్యమూర్తి అచ్యుతులవారు అని చెప్పారు.

ఆచరణ రహితమైన వేషాడంబరమో, వాగాడంబరములనో ఆదరింపక, పూర్ణ సమర్థుడయిననూ తమ గొప్పతనము మరియు మహిమలు అద్భుతములు ప్రదర్శింపక నిస్వార్థమైన ఈశ్వరార్పణ బుద్ధితో నిర్భయత్వముతో ధర్మ-కర్మ బద్ధమైన పవిత్ర జీవనమును ఆదర్శముగా అనుభవనీయముగా చూపెట్టిన ధీరోదాత్తుడు ప్రభువులవారు.

దేవుని గురించి తత్త్వమును గురించి కేవలము మాటలుకాని కర్తవ్యము పట్ల ఉదాసీనతకాని తగదని హెచ్చరించి, బుద్ధిశక్తితో గ్రంథ పాండిత్యముతో ఉపన్యాస శ్రవణముతో తన్ను తాను ఎఱుంగుట అసాధ్యమని నొక్కి వక్కాణించిన అనుభవ వేత్త ప్రభువులవారు.

ఐహిక సుఖమునకుగాని శాశ్వతానందమునకు గాని దేహ దారుఢ్యము ముఖ్యమని, శుద్ధ సాత్వికాహారము ఉచిత విహార నియమముతో జీవ విద్యాభ్యాసము (యోగవిద్య)తో రాగ రోగములు పోద్రోలుకొని దీర్ఘాయురారోగ్యములతో శాంతి, ఆనందములు అనుభవించ వచ్చుననియు, అనన్య భక్తితో సాగు సాధకుడు నిస్సందేహముగా ఇచ్ఛామరణుడగుట సాధ్యమే అనియు అభయమిచ్చిన సద్గురువు ప్రభువులవారు.

సమున్నత గాత్రము, ఒంపుతీరిన పొడవైన గరుడనాసిక, బాగుగా పెరిగి ఉంగరములుగా భుజములపై వ్రేలాడు కేశపాశములు, వదనానికి



వన్నెతెచ్చు గడ్డము ,నిశితములై కాంతివిరజిమ్ము కన్నులతో క్షాత్ర తేజము-బ్రహ్మత్వ ప్రశాంతత వెలార్చు ముఖవర్చస్సు, సరళతే ప్రత్యేకమైన చిరునగవు కలిగి, ప్రతి దినము తామే ఉతుకు కొనుచున్న తెల్లటి చిన్న వస్త్రము, బనియన్ వంటి అంగరఖా, కుడి ముంజేతి పై (మోచేతి క్రింద) పచ్చ పొడిచిన విష్ణు రూపముతో మృదు మధుర వచో వైఖరితో సదా దర్శనీయులై ఒప్పుచుండెడివారు ప్రభువులు. ప్రకృతి సౌందర్యానికి కాణాచి అయిన కొడగు ప్రాంతము భాగమండలి యందలి బెంగూరులో మధ్యతరగతి కుటుంబములో క్రీ॥ శ॥ 1904 సం॥లో ప్రభువులు జన్మించిరి. తండ్రి భూపవర్మ అను పుణ్యశాలి. క్షత్రియ వంశము. పాశ్చాత్య జీవన పద్ధతిని మెచ్చి ఇంటిని అమర్చు కున్నవారు. పిల్లల జీవనము నియమబద్ధముగా రూపొందించుటలో శ్రద్ధావంతురాలు మాతృమూర్తి పొన్నమ్మ. వీరి పెంపకములో అచ్యుతవర్మ బాల్యము గడిపి విద్యార్థి దశలో ఉపాధ్యాయుల మెప్పు పొంది బుద్ధి కౌశల్యము, వ్యాయామము ఆటల పోటీలలో పేరెన్నిక గాంచిరి. గణితము, విజ్ఞానశాస్త్రము వీరి అభిమాన విషయాలు. సంగీతము, చిత్రలేఖనములో అభిరుచి కలవారు. గుర్రపు స్వారీలో ప్రావీణ్యము కలవారు. విద్యాభ్యాసము పూర్తి అయిన పిదప కాఫీ ఎస్టేట్‌లో ఉద్యోగ నిర్వహణ గావించిరి. అక్కడ యూరోపియన్లు అనేకులతో పరిచయము. వైద్యవృత్తియు నిర్వహించుచుండిరి. ఆయుర్వేదము, అ ల్లోపతి, బయోకెమికల్, హోమియోపతి ఔషధములు తెప్పించి బీదసాదలకు ఉచిత వైద్య సేవ యొనరించుచుండిరి. క్షుద్రోపాసన, అంధానుకరణముల పట్ల చిన్ననాటి నుండియు తిరస్కార భావము, శాశ్వత సత్యము పట్ల దృఢ విశ్వాసము, నిర్దిష్ట మార్గము పట్ల అత్యంత కాంక్ష కలిగి యుండిరి. ఈ కాయము దీని శుద్ధతకంటె ఇంద్రియముల నేలు కల్పము (మనస్సు) వీని ప్రాముఖ్యత ఎరుక పడినదట.

ఆహార విషయములో ఒక్కొక్క రసమునే విడచుచూ చివరకు వండిన ఆహారమే మానివేసి దినమునకొక పర్యాయము మాత్రము పిడికెడు గోధుమ పిండి ఒక అరటిపండు చేర్చి బాగుగ కలిపి తినుచుండిరట. అయినా తమ వేషభాషలు ఆటపాటలలో పరిసర నవనాగరికతకు తగినట్లే యుండెనట. తమ ఆహార నియమము ఇంటివారికి సైతము తెలియదట.

బ్రహ్మవిద్యాకాంక్షియై ఎంతోమంది సాధుసన్యాసులతో చర్చించి ఆ నిజవిద్య వారెవరికీ తెలియదని నిశ్చయించుకొని అడవులలో గుహలలో వేల సంవత్సరములు జీవించియున్న సిద్ధపురుషులను ఆశ్రయించుటకు పెంపుడు కుక్కలను వెంటబెట్టుకొని వేట నెపముతో అడవులను శోధించుచుండిరట. వీరి సంపాదనలో చాల భాగము కుక్కలకు, పేద విద్యార్థులకు చుట్టుపట్లగల పసిపిల్లలకు, సేవకులకు వినియోగించెడి వారట. సొంతానికి అంతగా వాడుకొనేవారు కాదట. పరులకే ఎక్కువ వెచ్చించుచుండిరి. ఈ విధముగా అరణ్య గిరి గహ్వరములలో అన్వేషించుచుండగా చివరకు ఒకనాడు స్వర్ణచ్ఛాయతో బ్రహ్మతేజోమూర్తి అయిన ఒక సిద్ధ పురుషుని వలన ఈ అమృతవిద్యను పొందినారట. అప్పటికి వారి వయస్సు దాదాపు 28 సంవత్సరములు.

వీరి సాధనా జీవనము చాలా క్రమబద్ధముగా అత్యంత పట్టుదలతో సాగేదట. అందరూ నిద్రలో మునిగియున్నపుడు ఆసనస్థులై జపము చేయుచుండిరని తెలిపినారట ప్రభువులు. ప్రాణుని గతాగతి యొక్క గంభీర శబ్దములో గృహమే అదరు చుండెనట. కాని ఎవ్వరికీ తెలియని రీతిగా సాధన నిగూఢముగానే సాగుచుండెనని తెలియజేసినారట ప్రభువులు. పలు ప్రాంతాలు పర్యటించినారట. వారు అనంతపురం జిల్లా రాయదుర్గములో ఉన్నపుడు శ్రీవిజయీంద్రుల వారికి పరిచయ



మైనది. తరువాత హంపీక్షేత్రము చేరుకొని రెండున్నర సంవత్సరములు రత్నకూట గుహలో తపోజీవనం సాగించిరి. ప్రభువుల జీవితాన్ని గురించి నా దైవము అనే పుస్తకములో వివరించబడినది. శ్రీ విజయీంద్ర స్వాములవారి ప్రార్థన మేరకు 1949 వ సంవత్సరములో బ్రహ్మవిద్య ప్రసరణా కేంద్రముగా ఋష్యమూక ఆశ్రమము స్థాపించి తత్త్వాకాంక్షుల పెక్కురకు విద్యోపదేశము అనుగ్రహించినారు. శిష్య సమేతులై ఆశ్రమభూమిలో స్వంత సేద్యము ప్రారంభించినారట. ప్రతి పని తాము ముందుండి చేసి చూపెడివారు. రాత్రి తపస్సు అని చెప్పుచూ ధర్మ-కర్మ బద్ధమైన ఆదర్శ జీవనముతోపాటు ఆధ్యాత్మ సాధనలోను శిష్యులను ముందంజ వేయించినారు.

1952 వ సంవత్సరములో మరొకసారి సంచారము సాగింది. బళ్ళారి వారి ఆహ్వానము మేరకు "థియొసాఫికల్ సొసైటి మందిరము" లో రెండు రోజులు ఉపన్యసించి అదే విధముగా నేమకల్లు ఆదోని శిష్యుల ప్రార్థనమేరకు ఆరెండు చోట్లకు వెళ్లి ఉపన్యసించినారు. ఆ సభలలో మానవ జీవిత మహత్వ లక్ష్యము గురించి చేయవలసిన కర్తవ్యమును గురించి సంక్షిప్తముగా చర్చించి సాధనా మార్గము నిర్దేశించి ఇందుకు ఆధారమైన ఉపనిషత్తుల సారాంశమును బోధించినారట. వారి ఆరోగ్యము కుంటుపడుటవలన 1953 వ సంవత్సరంలో గాలి మార్పుకై బళ్ళారికి విచ్చేసినారు. ఆశ్రమ విధినిర్వహణను శ్రీవిజయీంద్ర స్వాములవారికి అప్పగించినారు. జగత్కళ్యాణానికి కొంతకాలం తమ అజ్ఞాతవాసము అవసరమున్నదని తాము తిరిగి వచ్చి ఆధ్యాత్మ సాధన విషయమై అందరు చేయవలసి ఉన్నదని చెప్పియున్నారని శ్రీజయతీర్థస్వాములవారు వివరించినారు.

1958 వ సంవత్సరంలో ఫిబ్రవరి 4 వ తేది (4-2-1958) మాఘ శుద్ధ పౌర్ణమి రోజున బళ్ళారిలో సమాధి స్థితులయినారు. ఆ తరువాత అనేకులకు వారు కన్పించియున్నారని ఆశ్రమ వక్తారులైన శ్రీవిజయాంద్రస్వాములు, శ్రీజయతీర్థస్వాములు చెప్పియున్నారు. ఆ యోగపూర్ణుని ద్వారా అనుగ్రహించబడిన అమృత విద్యను ఆశ్రయించి సాధించి తీరవలెనని కోరుచూ పరమ దయాళువైన ఆ ప్రభువుని పునరాగమనమునకై భక్తితో ప్రార్థింతము.

97. దేవుని దర్శించు మార్గము ఏది? అను ప్రశ్నకు శ్రీజయతీర్థస్వాముల వారు వివరించిన విషయము తెలియజేయుము?

ఈ ప్రశ్నకు "సనత్సుజాతీయము" అను గ్రంథములో "యోగినః ప్రపస్యంతి భగవంతం సనాతనం" అను వాక్యమే సరియగు సమాధానము. తన మహా తపస్సుతో మహేశ్వరుని మెప్పించి పాశుపతాస్త్రం పొందిన అర్జునునితో శ్రీకృష్ణభగవానుడు-

"తపస్విభ్యోఽధికో యోగీ జ్ఞాని భ్యోఽపి మతోధికః।
కర్మిభ్యశ్చాధికో యోగీ తస్మాద్ యోగీ భవార్జున॥"

అన్నాడు. తపస్వికంటె, జ్ఞానికంటె యోగిమతం గొప్పది. కర్మానుష్ఠానము కంటె యోగమే శ్రేష్ఠము అట్టి యోగివికమ్ము అని నిర్దేశించియున్నాడు. యోగి అయినపుడే మానవత్వ పూర్ణవికాసం అయినట్లు. అట్టి వానికి దేవుని దర్శనం సాధ్యపడును. దేవుని దర్శించు మార్గము యోగ మొక్కటే అని వివరించినారు శ్రీజయతీర్థులు.

అయితే శ్రవణ పఠనములతో తెలుసుకున్నంత మాత్రమున యోగి అగుట సులభము కాదు. "ధీరాఃతేషాంసుఖంశాశ్వతం నేతరేషాం" అనెడు ఉపనిషత్తు వచనం రీతి తన సాధనా పథములో కలిగే ఆటంకముల



నతిక్రమించి ధీరుడై సాగువానికి సాధ్యము. లక్ష్యము చేరువరకు చలితుడుగాక ఏకనిష్ఠతో సాగవలెను. ఎన్ని రోజులు, ఎంత సమయము సాధన సాగించాలి? అనే ఆలోచనలు ఉండకూడదు. శ్రద్ధ, ఏకాగ్రత, నిష్ఠ, జన్మాంతర సుకృతుల ననుసరించి సాధకుడు లక్ష్యము చేరగలడు.

98. మానవ జీవి పుట్టిన ఉద్దేశ్యమేమి? నేనెవరు? నిన్ను నీవు తెలుసుకో అను వాటిని గురించి శ్రీజయతీర్థస్వాముల వారు వివరించిన విషయములను తెలియజేయుము?

మొదటి ప్రశ్నకు సమాధానముగా భక్తులు దేవుని లీల ఇచ్చ అందురు. కాని యోగానుభవముతో చెప్పవలెనన్న జీవభూతమన బడునది దేవుని చేతనకు సహజతవలన ఉద్భవించి అనేక జీవులైనవి.

"మమైవాంశో జీవభూతః జీవలోకః సనాతనః"

సృష్టి సహజముగా అయినదే కాని ఇచ్ఛతోకాదు. అది ఎట్లైనది? అందలి వివిధతలెందుకు? మొదలైన అంశములను వ్రాసి, వివరించుట వలనగాని, వినిగ్రహించుటవలనగాని, నిష్ప్ర యోజనము, యోగానుభవము మూలకముగా ఎరుకబడినపుడే సృష్టి రహస్యము లభ్యమగును. నేనెవరు? అని ప్రశ్నించుకొన్న సమాధానం రాదు. "నిన్ను నీవు తెలుసుకో" అన్నంత మాత్రాన తెలుసుకొనుట సులభము కాదు. అయినను మానవుడు తనను తాను తెలియు వరకు మరియొక దానిని పూర్ణముగా తెలియజాలడనుట నిజము. నేను ఈ దేహము కాదు. మనస్సుకాదు. బుద్ధికాదు. తత్ కాదు. అహంకారము కాదు. సచ్చిదానందరూపమైన ఆత్మయే నేను. గ్రంథములలోని వాక్యములు చదివినగాని, పరులు చెప్పినది వినినగాని తన్ను తాను ఎరిగినట్లు కాదు. ఈ దేహములో ఉండి నేను అనుచున్న చేతనమే (ఆత్మ). దాని సహజ స్థితి సత్ - చిత్ ఆనంద మనెడి

అనుభవజ్ఞుల వాక్కులు సత్యములే కాని ఆ స్థితిని తన సాధనలో పొంది ఆనందానుభూతి పొందినవాడే తన్ను తాను ఎరిగిన వాడు. తనను తాను ఎరుగుటకు యోగ విద్యయే శరణ్యము.

99. దివ్య మానవ సమాజము గురించి శ్రీ అరవిందుల వివరణ తెలియజేయుము?

ఉన్నది ఒకే సత్యము, విప్రులు దానిని అనేక విధాలుగా చెప్పినారు. "ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి" ఛాందోగ్యోపనిషత్తు "తత్త్వమసి" అని చెప్పింది. తత్ –త్వమ్ –అసి. అది నీవే అయి ఉన్నావు అని అర్థము. బృహదారణ్యకోపనిషత్తు "అహం బ్రహ్మాస్మి" అనగా నేనే బ్రహ్మనై ఉన్నాను అని చెప్పింది. పరబ్రహ్మకు జీవాత్మకు భేదము లేదు రెండూ ఒకటే అని అర్థము. మాండూక్యోపనిషత్తు "అయమాత్మా బ్రహ్మ" అయం–ఆత్మా–బ్రహ్మ. ఈ ఆత్మయే పరబ్రహ్మ అని చెప్పింది. ఐతరేయోపనిషత్తు "ప్రజ్ఞానం బ్రహ్మ" ప్రతి మానవునిలో జీవి స్వస్వరూపానికి సంబంధించిన ఎరుకయే బ్రహ్మమని చెప్పింది. ఇది సర్వ ఉపనిషత్తుల సారము. ఇవన్నీ జపమాల తిప్పుకుంటూ వల్లె వేయడమువలన ఏమి ప్రయోజనము లేదు. అంతర్ముఖులై సాధన చేయడం ద్వారా అనుభవానికి తెచ్చుకొన్నపుడు మోక్షం సిద్ధిస్తుంది. అది మానవుడై పుట్టినందుకు సార్థకత అని సారాంశము.

ఈ అనుభవాలకు యోగ విద్యయే శరణ్యమని అచ్యుత ప్రభువులు వివరించినారు.

నేనెవరిని?

సరే ఎవరికి వారు ముక్తి పొందినారు. మరి సమాజం మాటేమిటి? ఇక్కడే మనకు శ్రీ అరవిందులవారి వివరణ అవసరం అవుతుంది. ఈ పై వివరణలలో విశ్వం యొక్క ప్రస్తావన లేదు. మానవుడు జన్మించక ముందు



విశ్వం ఉంది. దాని అవరసమే లేకపోతే ప్రపంచం ఉనికిలోకి ఎందుకు వచ్చింది? శ్రీరాముడు ఆంజనేయ స్వామికి తత్వబోధ చేస్తాడు. అనంతరం ఆంజనేయా! ఇప్పుడు చెప్పు నీవెవరు అని ప్రశ్నిస్తాడు.

"దేహ బుధ్యాతు దాసోకస్మి, జీవ బుధ్యాతు త్వదంశకః

ఆత్మ బుధ్యాతు త్వమేవాహం" అని ఆంజనేయుడు సమాధానం చెప్పాడు. దేహమే నేను అనుకున్నపుడు నీ దాసుడను. నేను ఒక జీవుణ్ణి అనుకున్నపుడు నీలోని అంశను. ఆత్మయే నేను అనుకున్నపుడు నీవే నేను. అన్నీ నిజమేగా, శ్రీ అరవిందులవారి వివరణలో ముందుగా వ్యక్తి తనలోని చేతనముతో తాదాత్మ్యం చెందాలి. ఆ తరువాత విశ్వచేతనముతో ఏకం కావాలి. అపుడు విశ్వాతీతంగా ఉన్న దివ్యచేతనమే ఈ రెండు స్థాయిలతో తనంతట తాను అనుసంధానం చెందుతుంది.

దివ్య చేతనమంటే పరతత్వం తనను తాను అనేకంగా ప్రకటించుకోవాలని సంకల్పించి (బహుస్యామ్ ప్రజాపతి – తైత్తిరీయో పనిషత్తు) విశ్వంగా మారింది. వ్యక్తిగా రూపము దాల్చింది. ఈ విషయాలపై వివరణ ఇచ్చినవారు కొంగన భాస్కరరావుగారు. ఆధ్యాత్మ సాధన చేస్తే పై విషయాలు బోధపడునని ఆశ్రమ వక్తారుల బోధ.

100. మనలోని కోరికల ఉత్పత్తికి కారణమేమి? దీనిని తొలగించు మార్గమేది?

ఈ ప్రశ్నకు శ్రీస్వామి జయతీర్థులవారు వివరణ ఇచ్చినారు. కామ మనగా ఇచ్ఛ, కోరిక. "సంగాత్ సంజాయతే కామః" అను గీతా వాక్యము ప్రకారము సహవాసమే ఇచ్ఛకు మూలము. సహవాసమున లభించు సుఖ దుఃఖముల అనుభవముతో మోహము లేదా దాని నిరసన సంభవించును. మన అధః పతనానికి కారణమయ్యే వ్యక్తి లేదా వస్తువుల

మోహాన్ని సువిచారముతో తొలగించుకొను అవకాశమున్నది. ఇదే బుద్ధియొక్క నిజమైన ఉపయోగము. యోగమార్గములో సాగువానికి బుద్ధి ఈ విధముగా సహాయ పడుతుంది. కనుకనే శ్రీకృష్ణ భగవానుడు “బుద్ధి యోగో విశిష్యతే” అని వక్కాణించినాడు. అదే బుద్ధిని “బుద్ధేః పరతస్తు సః” అని వర్ణించినారు.

101. బ్రహ్మవిద్యను గూర్చి వివరింపుము?

సంస్కృతములో బ్రహ్మ శబ్దము నపుంసకలింగము. పుం లింగముగా కూడ ఉన్నది. తెలుగులో బ్రహ్మ శబ్దము బ్రహ్మము లేదా బ్రహ్మ అవుతుంది. బ్రహ్మము = తత్త్వము, తపస్సు, వేదము అను అర్థములలో నపుంసకలింగము అవుతుంది. బ్రహ్మ = చతుర్ముఖుడు, ఋత్విజుడు, విప్రుడు అను అర్థములలో పుంలింగము అవుతుంది. ఈ పదానికి చేయబడిన ప్రయోగాలవలన విభిన్న విశదీకరణములవలన బ్రహ్మ అంటే ఇటువంటిదని చెప్పలేని ఒక చైతన్య శూన్యమనే అభిప్రాయము ఏర్పడుతుంది. బ్రహ్మ అంటే కల్యాణగుణాలు అనంతంగా కలిగిన పురుషోత్తముడైన నారాయణుడే అని తమ బ్రహ్మ సూత్రాల వ్యాఖ్యానము “శ్రీభాష్యము” లో శ్రీ భగవాన్ రామానుజాచార్యుల వారు నిరూపించి నారట. ఆయనను ఆరాధించే విధానాలు చెప్పేవి “బ్రహ్మ విద్యలు”. ఇవి మొత్తం 32. ఛాందోగ్య, తైత్తిరీయ, బృహదారణ్యక, కఠ, ఇత్యాది ఉపనిషత్తుల సారాన్ని ఈ 32 బ్రహ్మవిద్యలు ప్రతిపాదిస్తాయి. ఇవి వరుసగా సద్విద్య, ఆనంద విద్య, శాండిల్య విద్య, అంతరాదిత్య విద్య,ప్రాణవిద్య, ఇంద్రప్రాణ విద్య, భూమ విద్య, నచికేతన విద్య, గాయత్రి జ్యోతిర్విద్య, ఆకాశ విద్య, అంతర్యామి విద్య, ఉపకోసల విద్య, వైశ్వానర విద్య, అక్షర విద్య, అంగుష్ఠ ప్రమితి విద్య, దహర విద్య, అజా శారీరక విద్య, చాలకీ



విద్య, మైత్రేయి విద్య, మధు విద్య, ప్రణవోపాస్య పరమపురుష విద్య, సంవర్గ విద్య, దేహోపాస్య జ్యోతిర్విద్య, ఈశావాస్యవిద్య, ఆదిత్యస్థాహర్నామక విద్య, అక్షస్థ ఆహవన్నామక విద్య,ఉషక్తి కహోల విద్య, గార్లక్ష విద్య, వ్యాహృతి శారీరక విద్య, పంచాగ్ని విద్య, పురుషవిద్య, ద్రుహిణి రుద్రాది శారీరక విద్య.

శ్రీమధ్వాచార్యులవారు దహర విద్య అన్నారు. ఆశ్రమములో ఈ విద్యను వేదవిద్య, బ్రహ్మావిద్య, అమృతవిద్య, జపము, యోగము అని చెప్పుచున్నాము. విద్యాసాధన ఒక్కటే, అయినా పేర్లు వేర్వేరుగా ఉన్నవి. ఒక్కొక్కరు ఒక్కొక్క రీతిగా ఈ విద్యను పిలిచినట్లు మన ఆశ్రమవక్తారులు శ్రీస్వామి విజయాంద్రులవారు మరియు శ్రీస్వామి జయతీర్థులవారు వివరించినారు.

102. కేనోపనిషత్తునందు బ్రహ్మము (దేవుని)గురించి చెప్పబడిన విషయములపై శ్రీ జయతీర్థస్వాములవారి వివరణ తెలియ జేయుము?

శ్రీ జయతీర్ధ స్వాములవారు వివరించిన విషయము మేరకు ఈ ఉపనిషత్తు యొక్క ముఖ్య సారాంశమేమనగా దేవతలేకాని, మానవులేకాని ఆ పూర్ణునిగూర్చి పూర్తిగా తెలుసుకోలేరు. ఇంద్రియాలు కానీ, మనస్సుకానీ, బుద్ధికానీ, ప్రాణంకానీ మనలోని ఏ శక్తి కూడా అతడిని గ్రహించజాలదు. సృష్టి అంతయు అతడి నుండే ఉద్భవించినది కావున వీటి క్రియాశక్తి, గ్రహణ శక్తులన్నీ మన సొంతాలు కావు. పరమాత్మ అందించినవే. వీటన్నిటికీ భగవంతుడే ఆశ్రయం కావడం వలన అతని జ్ఞానము మనకు అతని దయవల్లనే లభించాలి. బ్రహ్మ అంటే ఏమిటో తెలుసుకుంటే విషయం గోచరిస్తుంది. భగవంతునిలో మనలో వలె బహిర్ముఖస్థితి ఉండదు. క్రియలు

ఉండవు. అతడు నిరంతరం అంతర్ముఖుడు. నిరంతరం ఆనందంలో నిమగ్నుడై ఉంటాడు. అందువలన అతనిని అఖండానంద విగ్రహుడు అనుచున్నారు. "నిశ్శబ్దం బ్రహ్మ ముచ్యతే" అనే వాక్యం దీన్నే సూచిస్తుందని స్ఫురిస్తుంది. పూర్ణుడైన పరమాత్మను పూర్ణంగా తెలుసుకోవడము అపూర్ణులైన జగత్తులోని జనులకు సాధ్యం కాదు. ఆ తత్వం తెలియడం ఆ పూర్ణుడైన పరమాత్మ కృపవల్లనే సాధ్యమన్నారు. ఈవిషయాన్ని గ్రహించినవారు కనుకనే మన పెద్దలు "అనంతా వై వేదాః" అని పలికినారు. మేము బ్రహ్మాన్ని తెలుసుకోలేమని సవినయంగా పలికే వారికి మాత్రము ఆపూర్ణుని కృప లభిస్తుందని, అందువల్ల వాళ్లు తెలుసుకోగల్గుతారనేది ఈ ఉపనిషత్తు బోధ.

ఈ ఉపనిషత్తు శాంతిమంత్రములో "మాహం బ్రహ్మ నిరాకుర్యాం మా మా బ్రహ్మ నిరాకరోద నిరాకరణ మస్త్వ నిరాకరణ మేస్తు" అని ప్రార్థించినారు. అనగా నేను బ్రహ్మత్వాన్ని నిరాకరించకుందును గాక, బ్రహ్మత్వం నన్ను నిరాకరించకుండు గాక అది నాకు బ్రహ్మ దయతోనే లభించనీ నిరాకరణం కాకుండ ఉండవలెను. ఆత్మరతుడనయ్యాక సత్య సామీప్యం వలన ధర్మం నాలో చిరకాలం నిలిచి ఉండాలి అనే ప్రార్థన. తాను బ్రహ్మత్వాన్ని నిరాకరించకుండా ఉండవలెను. అంటే తెలుసుకోవాలనే ఆకాంక్ష ఉండాలి.అది లేకుంటే ఈ మానవ జన్మ వ్యర్థమని వారి భావం. బ్రహ్మజ్ఞానాకాంక్ష పూర్ణం అయ్యేందుకు పరమాత్మ కృప చాలా అవసరం. అందుకే బ్రహ్మ నన్ను నిరాకరించకుండ ఉండనీ అనే మాట వచ్చింది.

ఈ విధంగా పూర్ణుని దయవలన జ్ఞానప్రాప్తి పొందిన తరువాత మనస్సుకు తృప్తి, ప్రాణుని ద్వారా కర్మేంద్రియాలకు అమృతప్రాప్తియై పుష్టి లభిస్తుంది. తిరిగి బహిర్ముఖ స్థితికి వచ్చి లౌకిక వ్యవహారములో



మునిగిన తరువాత మోహాది ద్వంద్వాలకు తగులుకొని ఆ బ్రహ్మత్వపు నిరాకరణం అనగా దానినుండి దూరం కావడం. అనగా ఇంద్రియ లోలత్వం కల్గుతుంది. ఇది సహజం అని అనుభవంతో గ్రహించి జ్ఞానులు పలికిన వాణి "నేను బ్రహ్మత్వాన్ని నిరాకరించకుందును గాక అనేది. మన దేహంలోని ప్రాణశక్తి ఇంద్రియాలకూ, అదే విధంగా మనస్సుకూ కూడ ఆధారమని అనిపిస్తుంది. ఉత్పత్తి అయిన ఆది భూతము వాయువే అని శ్రుతి వాక్యం ఉంది. ఆకాశం భూతమనీ అది ఆత్మలోనుండి ఉత్పత్తి అయినదనీ భ్రమించడం సత్యం కాదు. "ఆత్మా వై ఆకాశః" అనే మాటకు ఆత్మ ఆకాశంలో ఉంటాడని అర్థం. ఆత్మనుండి ఆకాశం ఉత్పత్తి అయిందనీ, ఆ వాయువు నుండి అగ్ని, ఈ విధంగా మిగిలిన భూతాలు పుట్టినవని గ్రహించాలి. మొదటి భూతమైన వాయువు మన దేహంలో ప్రాణశక్తి లేకుంటే పనిచేయదు. ప్రాణంనుండి పోషక ద్రవ్యం లభించకుంటే శక్తి హీనమగునని తెలిసిన తరువాత ఆ వాయువు ప్రాణంలో నుండి ఉత్పన్నమైనదని తెలియనగును. "ప్రాణాత్ వాయు రజాయతే" ఈ విధంగా సమస్త భూతధాతువులఉత్పత్తికీ, పోషణకూ, మూలకారణమైన మరియు మనస్సుకు మూలాధారమైన ఈ ప్రాణశక్తి మొట్టమొదట తన క్రియను ఎవరి ఇచ్ఛతో ప్రారంభించింది. ఇది ఉపనిషన్మంత్రంలోని ప్రశ్న.

బ్రహ్మ ఉండే స్థానం ఏది? అనే దానిని ఉపనిషత్కారులు సూచన ప్రాయంగా చెప్పియున్నారు సత్- అసత్ అవతలి స్థానమనేది వారి భావన. దీనిని అంతర్ముఖ స్థితిలో గ్రహించేందుకు ప్రేరేపించా లన్నది ఋషుల ఉద్దేశం. అనగా ఆధ్యాత్మసాధన చేయవలెననేదే మార్గము. దీన్ని వదలి కేవలము గ్రంథ పాండిత్యముతో సాధ్యము కాదని అన్నారు శ్రీ జయతీర్థస్వాములవారు.

103. ఉపనిషత్తు సమీక్షలో శ్రీ జయతీర్థస్వాముల వారి అభిప్రాయము తెలియజేయుము?

ఉపనిషత్తులను దర్శించిన మహర్షులు ఈ విశ్వంలో సర్వశ్రేష్ఠం అన్నిటికంటే గొప్పది ప్రాణమే అంటారు. ఈ ప్రాణమే మనస్సుతో కలిసినపుడు వాక్కు ఉత్పన్నమవుతుంది. ఈ వాణి ఇంద్రియాలద్వారా ఉద్భవిస్తుంది. ఈ వాక్కుకు మూలకారణమైన ప్రాణం స్థాయిలోనే ప్రకటింపబడేది.

ప్రాణం స్వయం ప్రకాశమానమైనది. దాన్నే సవిత అంటారు. ఇదే గాయత్రి. మూడు స్థాయిలలో గానం చేయబడేది. ఆ త్రిస్థాయి గానమే ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము. ఈ 3 విద్యలను ఉపాసించడమే ఉద్గీథ. ప్రాణుడే ఉద్గాత. ఆ ప్రాణునిలో పుట్టే స్వరమే (శబ్దమే) ప్రణవము. ఆ ప్రణవోపాసనయే కారకం. దీనినే అమృత విద్య, బ్రహ్మవిద్య అంటారు. ఇది ఒక్కటే "విద్య". వ్యాకరణము, ఛందస్సు, వేదాలు, ఇతిహాస పురాణాదుల నన్నిటినీ "అవిద్య" అని, జ్ఞానరహితమైన కర్మకాండను "ఉవిద్య" అని ఉపనిషత్కారులు ప్రకటించారు. ఉపనిషత్తులు వేదాల్లోని భాగాలే. మరి ఆ ఉపనిషత్తులను కంఠస్థం చేసి చెప్పడం కూడా అవిద్యే కదా? ఈ అవిద్య "ఏది విద్య" అనే విషయాన్ని తెలిపే సంకేతం మాత్రమే అనే విషయాన్ని మరువరాదు.

ప్రాణోపాసన చేస్తున్నామనే వ్యక్తులలో ముక్కు, నోరు మొదలైన బాహ్యేంద్రియముల ద్వారా విచిత్రమైన చేష్టలు చేస్తూ దాన్నే "విద్య" అని పలికేవారున్నారు. ఉపనిషత్తుల్లో దేవతలు ముక్కు, నోరు, కన్ను చెవి, మనస్సు మొదలైన వాటి ద్వారా ఉద్గీథం కావించినపుడు రాక్షసులు దాన్ని భేదించారు. అయితే ముఖ్యప్రాణుని ద్వారా ఉద్గీథం చేశాక రాక్షసులు



ఇంద్రియాల ద్వారా అభ్యసించటం లేదు అనే విషయాన్ని అర్థం చేసుకోవాలి. దేహానికి మూలాధారమైన ప్రాణం తన ఉప ప్రాణాలైన ప్రాణ, అపాన, వ్యాన, సమాన, ఉదానాలనే ఐదింటి సహాయంతో దేహంలో వ్యవహరిస్తోంది.

ప్రాణంలో అపానాన్ని చేర్చి వేరే వేరే గతుల్ని కల్గిన ప్రాణ అపానాలను నిరోధించి ఒకే గతిలో ఉండే విధంగా చేయవలెను. ఈ విధంగా చేసినపుడు వ్యానం-ప్రాణ అపానాలతో చేరి వీటన్నిటిలో ఊర్ధ్వముఖమై ఉదానంలో కలిసి సాగిపోతూ సమానంలో (సమాన స్థితిలో) ఈ వాయువుల మథనంలో ఉద్భవించే అశనాన్ని ప్రాణుడు గ్రహించినట్లు చేయడమే విద్యోపాసన. వాయువు అగ్నికి మూలం కావడంతో ఈ పంచ వాయువుల పూజయే పంచాగ్ని పూజగా వర్ణింపబడింది. ఇది ఆధ్యాత్మికం. స్థూలమైన అగ్ని పూజ. వాతావరణ శుద్ధి (అధి భౌతికం) దేవతలను ప్రార్థించడం, అగ్నిని ప్రార్థించడం, స్వర్గాది లోకాల ప్రాప్తి కోసం చేయవలసినటువంటి వాటిని (అధి దైవికం) ఉపనిషత్తుల్లో గమనించాలి. దేహేంద్రియాలపై ఆధిపత్యం కలిగిన మనస్సు మరియు దేహంలోని శక్తుల్లో జ్యేష్ఠమూ, శ్రేష్ఠమూ అయిన ప్రాణాల సంగమమే యోగము యొక్క తొలిమెట్టు. దీనిని మనోప్రాణ మిలనమని గ్రహించ వలయును. ఆ విధంగా కలిసిపోయి బ్రహ్మ స్థానంలో ఆత్మతో చేరినపుడు ఆత్మకు తన సహజావస్థలోని ఆనందపు అనుభూతి కలుగును.

ఆ అనుభవంతో ఇంతకు మునుపు ఉండే అజ్ఞానపు తెరలు క్రమంగా తొలగిపోయి, కన్నులలో చిత్ శక్తి ప్రజ్వలించి తనకు మూలమైన "సత్యం" అనే దాన్ని గ్రహించి అందులో చేరిపోవడమే మోక్షం. "సత్తు" అనే దాన్ని గ్రహించి తనలో తాను నిమగ్నుడై ఆనందించేవాడే బ్రహ్మజ్ఞాని. బ్రహ్మ

జ్ఞానియై మోక్షాన్ని పొందే ముందు లోక కల్యాణం కోసం పని చేసే వ్యక్తి బ్రహ్మవేత్తల్లో వరిష్ఠుడు అనే అభిప్రాయాన్ని ఉపనిషత్కారులు చెప్పారు. దానినే గీతలో "జ్ఞానిభ్యోకపి మతోధికః, తస్మాద్యోగీ భవార్జున" అని అన్నారు. బ్రహ్మజ్ఞానుల్లో వరిష్ఠుడై క్రియాశీలుడైన వాడే యోగి. నీవు అటువంటి యోగివి కమ్మని చెప్పాడు పరమాత్మ.

దీని వలన యోగి అయిన వ్యక్తి వల్లనే లోక కల్యాణం జరుగుతుందని తెలుస్తుంది. బ్రహ్మ జ్ఞానులైన క్రియాశీలురుగా ఉండే వాళ్లలో సాత్విక ప్రధాన కార్యాలు చేసేది బ్రహ్మర్షులు. రాజస ప్రధాన కర్మలు చేసేవారు రాజర్షులు. గుణాతీతులై లోక కల్యాణానికి అవసరమైన అన్ని రకాల కార్యాలను చేస్తూ సమత్వస్థితిలో నిర్లిప్త స్థితిలో దైవానికి ప్రాతినిధ్యం వహించేవారే యోగులు. అ లాంటి యోగ్యులైన యోగి అచ్యుతులు మా గురువుగారు. వారు ఉపనిషత్తుల గురించి నీవు ఒక పుస్తకం వ్రాయాలి అని నన్ను ఆదేశించారు. అయితే నేనేం వ్రాయగలను, నాకు సంస్కృతంలో పాండిత్యమే లేదు స్వామీ అన్నాను. అప్పుడు ప్రభువులవారు అవసరం లేదు. విద్యలో కొనసాగుతూ సుసంస్కృతుడవైనట్లయిన జ్ఞానుల భాష అయిన సంస్కృతం తనకు తానే స్ఫురిస్తుందని చెప్పారు. వారి ఆదేశానుసారంగా ఈ రచనకు ఉపక్రమించాను. నాకు స్ఫురించిన రీతిలో అవసరమైన వాక్యాల్ని మాత్రమే ఉద్ధరించి, వాటి అర్ధాన్ని వివరించాను. ఉపనిషత్ వాక్యాలకు ప్రతిపదార్ధము తాత్పర్యము వ్రాయడము నాఉద్దేశ్యము కాదు. ఆ పనిని ఎంతోమంది చేశారు. ఉపనిషత్కారుల వాక్యాల ప్రకారం ఆత్యంతిక సత్యం అంటే ఏమిటి? దానిని గ్రహించుటకు ఉపయోగపడే విద్య ఏది? అనే అంశాన్ని వివరించడమే నా ప్రధానాశయము అన్నారు శ్రీజయతీర్ధస్వామివారు.



ఉపనిషత్కారులు బోధించిన తత్వాలన్నీ ఒకే స్థాయికి చెందినవని చెప్పడం సాధ్యం కాదు. ఉపనిషత్తుల్ని చదువుతూ పోయినట్లయిన అక్కడ చెప్పబడిన వాక్యాల ద్వారా వాళ్ళ విభిన్న విషయాల్ని గ్రహించగల్గుతారు. సత్ నుండి అసత్ పుట్టిందని ఒకరు, తొలుత మృత్యువు ఒక్కటే ఉన్నది అది అన్నిటినీ సృష్టించిందనే వాళ్లొకరు. క్షర అక్షర బ్రహ్మ గురించి వివరిస్తూ అక్షరమే తురీయమనే వాళ్లు ఒకరైతే, అక్షరం ఆత్మనుండి పుట్టిందనే వాళ్లొకరు. ఆత్మలు (దేహధారులు) అసంఖ్యాకులనే వాళ్లొకరు . ఆత్మ ఒక్కడే అని మరికొందరు. ఒకరు ఆత్మ నిర్లిప్తం అంటే మరొకరు కర్మానుగుణంగా ఆత్మ లిప్తమవుతుందని మరొకరు. ఇహంలో (దేహంలో) పరంలో (జగత్తుకు అవతల) ఉండే ఆత్మ ఒక్కటే అని, వేర్వేరని, ఒక్కొక్కరూ ఒక్కోరకంగా చెప్పడం గోచరిస్తుంది. గీతలో కన్పించే "సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" అనే ఆదేశం ఉపనిషత్తులో దొరకదు. ఉపనిషత్కారులు చెప్పేదేమనగా "మాలోని మంచి ఆలోచనలను మాత్రము గ్రహించండి" అని. ఇది సమంజసం కూడా. తమ జ్ఞానం అసంపూర్ణం అని గ్రహించారు కాబట్టే సత్యాన్ని కప్పిపుచ్చకుండా ఆవిధంగా చెప్పడం వారి ఔదార్యాన్ని సూచిస్తుంది.

మనస్సు విషయంలో కూడా ఉపనిషత్కారుల్లో ఏకాభిప్రాయము కనిపించదు. "యన్మనసానమనుతే"అని ఒకరంటే – మనస్సుతోనే బ్రహ్మను తెలుసుకోవాలి వేరే మార్గం లేదు అని మరొకరు అన్నారు. చాంచల్యానికి గురై అది కావాలి, ఇది కావాలి అని అడిగేదే మనస్సు కాదు. సత్యాన్ని యథాతథంగా గ్రహించే మనన శక్తియే మనస్సు. బుద్ధి, మనస్సు ఇవన్నీ ఆత్మ శక్తులే. వాటికన్న భిన్నమైనవి కానే కావు. ఈ విషయాన్ని గ్రహించినట్లయితే ఆత్మ గురించి "నేతి నేతి" (ఇదికాదు ఇదికాదు) అనే

పద్ధతిని అవలంబించవలసిన అవసరమే రాదు. “ఇది ఇలాగే” అని చెప్పడము సాధ్యమవుతుంది.

మనస్సంటే ఏమిటో తెలుసుకొన్నవారే ఆత్మను మనో మయుడిగా ప్రాణమయుడిగా వర్ణించారు. దేహంలోని పది ఇంద్రియాలూ మనస్సులో చేరితే అంటే జ్ఞానశక్తి ఆదేశాల్ని పాలించినపుడే యోగం అంటే జ్ఞానకర్మ ఉద్భవిస్తుంది. అందువలన ముక్తిని పొందేందుకు ఏకాదశీ వ్రతమే మంచిదన్నారు జ్ఞానులు. ఆయితే జ్ఞానపు ఇచ్ఛయే లేకుండా ఏదేదో చేస్తే అది ఏకాదశీ వ్రతము ఎలా అవుతుంది?

ఉపనిషత్తుల్లో యజ్ఞాలకు ప్రాధాన్యం లేదు. అగ్నిలో పది వస్తువుల్ని కలిపి ఆజ్యంతో ఆహుతి అందించే యజ్ఞాల వర్ణన ఉంది. అ లాగే మోక్షమే మన ముఖ్య లక్ష్యమైననూ ధూమ్రాది మార్గాల వర్ణన ఉంది. అ లాగే 33 దేవతలు, 6 దేవతలు, 3 దేవతలు, ఇద్దరు, ఒకటిన్నర దేవతలు, ఒక్కడే దేవుడు– ఇలా విచిత్రంగా చెప్పేవేళ దేవుడొక్కడే అని ప్రాణం గురించి చెప్పారు. ఆత్మను కాని, బ్రహ్మను కాని వర్ణించలేదు. ఇక్కడ అష్టవసువులనే వేళలో ఆదిత్యుడు, అగ్ని వంటి అధిభూతాల గురించి చెప్పారేకాని తదభిమానీ దేవతల గురించి చెప్పలేదు. ఆ మునులు తమ దగ్గరకు అడిగేందుకు వచ్చినవాళ్లకు తమకు తెలిసిన దానిలో అవసరమనిపించిన వాటిని వివరించియుండవచ్చు. ఏదేమైనా ఉపనిషత్తులనేవి ప్రజలలో జ్ఞానాకాంక్షను పెంపొందించడంలో బాగా ఉపకరిస్తాయనే మాట మాత్రం వాస్తవం.

ఉపనిషత్తులను చదివి జ్ఞానాకాంక్షప్రబలమై, జ్ఞానులైన గురువులను ఆశ్రయించి విద్యనుపొంది, శ్రద్ధతో ఆ మార్గములో సాగుచూ సత్య సామీప్యాన్ని అనుభవించి, ఇతరులకు తెలిపి జిజ్ఞాసువులుగా మార్చే



జ్ఞానులు ఈ రోజు కావాలి. అ లాంటివారి బోధలే ఉపనిషత్తులు. అయితే గ్రంథ పఠనంతోనే సంశయాలు తొలగవు. ఎందుకంటే రహస్యాలను వివరించేందుకు ఆ ఉపనిషత్కారులు ఇపుడు సజీవంగా లేరు. విద్య మాత్రం ఎల్లప్పుడూ ఉంటుంది. దానిని తెలిసినవారి దగ్గరినుండి పొంది ముందుకు వెళ్ళి వేరే వాళ్లను ముందుకు నడిపించే జ్ఞానులు కందని సత్పురుషులకు నేను విన్నవించుకుంటున్నాను అని శ్రీజయతీర్థస్వామివారు చెప్పియున్నారు.

104. అశనోత్పత్తికంటె ముందుగా సాధనలో మన దేహమునందు కలుగు అనుభవమును తెలుపుము? ఐతరేయ మరియు తైత్తిరీయోపనిషత్తుల శ్లోకములపై వివరణ ఇచ్చిన శ్రీజయతీర్థులవారి అభిప్రాయము తెలియజేయుము?

“సోపో భ్యత పత్తాభ్యో భితప్తాభ్యో

“మూర్తి రజాయత యావైసా మూర్తి రజాయత అన్నం వైతత్” (ఐతరేయ ఉపనిషత్తు) పురుషుడు తపించగా నీటి నుండి అన్నం ఉత్పన్నమైనదని ఉపనిషత్కారులు చెప్పారు. ఘనీభవించిన అప్ (జలం) పృధ్వి కావడంవలన జలం పృధ్వీసారం. ఆ జలం యొక్క సూక్ష్మసారమే అన్నం (అశనం) ఇది ప్రాణునికి ఆహారం. యోగవిద్యాభ్యాసం చేసే వారికి మొదట తమ దేహంలో లాలాజలం అధికంగా పుట్టి తరువాత అశనం ఉత్పత్తి కావడం అనుభవ వేద్యమే. అదే విధంగా స్థూల వస్తువుల్లో అన్నం (ఆహారం) ఉత్పత్తి కావడానికి జలమే ముఖ్యమైన ఆధారం అని తెలియజేసినారు. అన్నాన్ని ఎక్కువగా ఉత్పత్తి చేయాలి. సూక్ష్మంగా అశనం తన కోసం. స్థూలాహారం అతిథుల కోసం. కేవలం తన కోసం కాదని తైత్తిరీయ ఉపనిషత్తులో తెలుపబడినదని శ్రీస్వామివారు అన్నారు.

ఈ సందర్భంలో ఈశావాస్య ఉపనిషత్తు బోధన తెలియజేశారు.

"ఈశావాస్య మిదం సర్వం యత్కించ జగత్యాం జగత్‌
తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్యస్విద్ధనం॥

ఈ ప్రపంచంలో పుట్టి నశించే ప్రతిదీ ఈశునిచే వ్యాపించబడింది. అందువల్ల మీకు లభించినదాన్ని స్వీకరించి నిన్ను నీవు రక్షించుకో. దాన్ని వదలి వేరే దాన్ని అనుభవించవద్దు. వేరే వారి సంపదకు ఆశ పడవద్దు. ఈశ అంటే దేవుడు అనికాదు. సమస్తంలో వ్యాప్తమైన వాయువు. ఇది మన శరీరంలో ఉంది బయటా ఉంది. మన దేహంలోని ముఖ్యశక్తి అయిన ప్రాణుడు అశనాధారి. మన దేహంలోని గాలిని చిలకడం వలన ఈ అశనం ఉత్పత్తి అవుతుంది. ఈ అశనాన్ని మానవుడు మాత్రమే తయారు చేసుకోగల్గుతాడు. ఇతర ప్రాణులు బ్రతకడానికి కావలసిన అశనం కోసం దేహానికి బయట ఉండే వాయువుపైన మాత్రం ఆధారపడతాయి. అందువలన మానవ ప్రాణులకు అది పరధనం. దానిని ఆశించరాదు అనే అర్థం ఇక్కడ స్ఫురిస్తుంది. ఈ వాయు మథనం ద్వారా తన దేహంలోనే అశనోత్పత్తి చేసుకొనే ప్రక్రియే ప్రాణవిద్య. దీనిని తెలిసిన గురువుల వద్ద అభ్యసించాలి. దీనిని మాటలతో వర్ణించడం అసాధ్యమని శ్రీస్వామి జయతీర్థులు తెలియజేసినారు.

105. విద్యా సాధన లేనివారికి ప్రాణసంచారము, అశనోత్పత్తి విషయమై స్వామి జయతీర్థులవారు ఈశావాస్య ఉపనిషత్తు తెలియజేసిన విషయాన్ని ఎట్లు వివరించిరి?

బ్రహ్మ విద్య తెలియనివారిలో కూడా ప్రాణం చలిస్తుంది. ఈ విషయమై జయతీర్థులవారు ఈశావాస్య ఉపనిషత్తునందు చెప్పబడిన విషయాన్ని వివరించినారు.



"తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే।
తదంతరస్య సర్వస్య తదుసర్వస్యాస్య బాహ్యతః"॥

అది కదలుతుంది. కదలదు. అది దూరంలో ఉంది. అది చాలా దగ్గరలో ఉంది. అది అందరి లోపల ఉంది. వెలుపల ఉంది. ఇచట కూడా ప్రాణుని గురించే వర్ణించబడింది. ఈ మన దేహంలో జీవాత్మకు ముఖ్యసారథిలా ఉండే ఈ ప్రాణమనే శక్తి మన దేహంలో ఉండడం వల్లనే ఇది శవం కాకుండా సజీవంగా ఉంటున్నది. ఆ ప్రాణశక్తి మన దేహాల వెలుపల కూడా ఉంది. మన దేహాలను వదలి అది ఒకసారి బయటకు పోతుందికదా. మానవ శరీరాల్లో ఉన్నట్లే అది ప్రాణులన్నిటి దేహాల్లోనూ ఉంది. బయటా ఉంటుంది. ఆ ప్రాణం జడం కాదు. శక్తి. అందువలన చలిస్తుంది. అయినా అది మన దేహంలో ఏ స్థానంలో ఉండి గాలి ద్వారా పనిచేయిస్తుందనే విషయాన్ని యోగ విద్యాభ్యాసంతో లభించే అనుభవం ద్వారానే తెలుసుకోగల్గుతాము. మరో విధంగా తెలుసుకోలేము. గాఢనిద్రలో (సుషుప్తి) ఈ ప్రాణం చలించి (పైకి వెళ్లి) దేహంలో బ్రహ్మరంధ్రంలోకి చేరుతుంది. మళ్లీ అది అక్కడ నుండి క్రిందికి దిగి వచ్చిన తరువాతనే మనకు స్వప్నం కానీ జాగ్రదవస్థ అనే స్థితికానీ లభిస్తుంది. గాఢనిద్రలో అన్ని కార్యకలపాలు చేయుటకు, గమనించుటకు ముఖ్యమైన మనస్సుకు మెలకువ ఉండదు. కాబట్టి ఈ ప్రాణశక్తి సంచారం దానికి తోచదు. అందువలన అది చలించదని సామాన్యుల దృష్టిలో చెప్పబడింది. ఆ ప్రాణం మనకు దేహంలోని జీవాత్మకు సమీప స్థానంలోనే అన్నట్లుగా ఉంటుంది. అయినా హెచ్చరిక లేకపోవడం వలన మనస్సుకు అది తెలియదు. కావున అది తననుండి చాలా దూరంలో ఉందని అనిపిస్తుంది.

దేహంలో జీవాత్మ స్థానం బ్రహ్మరంధ్రమే అనేది యోగవిద్యా సాధనానుభవం వల్లనే తెలుస్తుందని గ్రహించాలి. యోగవిద్యలో ముందుకు వెళ్లి అనుభవాన్ని పొందడం వలననే ఉపనిషత్ ఋషులు ఆ ప్రాణం గురించి వర్ణించగలిగారు. ఆ విద్య గురించి తెలియని వారికి ఆ ఉపనిషత్ వాక్యాల అర్థం ఎలా బోధపడుతుంది? అందువలన వారి వాక్యాలను ఒక్కొక్కరు ఒక్కో విధంగా కల్పించి, వ్యాఖ్యానించి, గ్రంథాలు వ్రాసి వివిధ పంథాలు పుట్టి – అనేక వివాదాలు చెలరేగాయి. అందువల్ల ఆత్మజ్ఞానం, సృష్టి విజ్ఞానం – వీటి గురించి గ్రహించాలనుకొనేవాళ్లు యోగవిద్యనుపొంది, శ్రద్ధతో సాధించి, అనుభవ జ్ఞానాన్ని సంపాదించి, తర్వాత ఉపనిషద్వాక్యాల అర్థాన్ని జన సామాన్యులకు బోధిస్తే అపుడు అది ప్రజల్లోని అజ్ఞానాన్ని నివారించడంలో సహాయపడుతుంది. ఈ సూక్ష్మ విషయాలు తెలియాలంటే విజ్ఞాని కూడా యోగవిద్యనే ఆశ్రయించడము తప్ప వేరే మార్గం లేదు. ఆవిధంగానే ఆత్మజ్ఞానము పొంది ముక్తి కావాలనేవారు కూడా ఈ విద్యనే ఆశ్రయించాలి. గ్రంథాలు చదివి వ్రాసి మాట్లాడే వాచాల వ్యక్తుల కార్యకలాపాలు పిల్లల పిచ్చి అరుపులతో సమానమని శ్రీజయతీర్థస్వాముల వారు పేర్కొన్నారు. ఇట్టివారి సంఖ్య మున్ముందు బాగా పెరుగుతుందని గ్రహించిన మహర్షులు "కలౌ వేదాంతినో ఘల్గుణోయువా" అన్నారు. అనగా కలిప్రాధాన్యత ఉన్నకాలంలో వేదాంతులు వచ్చి నోరు బాదుకున్నా వినేవారుండరని వాపోయినారు.

106. పరమాత్ముని దయతో అయ్యే దర్శనం, పరమపదవి, (అమృతత్వము – స్థిరశాంతి– మోక్షము) గూర్చి ప్రభుయోగి అచ్యుతులవారి అభిప్రాయమేమిటో శ్రీజయతీర్థస్వాములవారు విశదపరచిన



భావనలు వివరింపుము? ఈ విషయములో శ్రీజయతీర్థస్వాముల వారు ఈ విధంగా వివరించిరి.

"విద్యాంచావిద్యాం చ యస్తద్వేదో భయం సహ
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయా ఽ మృతమశ్నుతే"

ఎవరైతే విద్యను అవిద్యను ఏక కాలంలో గ్రహిస్తారో వారు అవిద్య ద్వారా మృత్యువును దాటి విద్య ద్వారా అమృతత్వాన్ని పొందుతారు. విద్య–అవిద్య ఈరెంటినీ ఏక కాలంలో ఉపాసించాలనే అభిప్రాయం సూచ్యంగా ఈ మంత్రంలో వివరించబడింది. కేవలం స్థూలమైన ధర్మ కర్మలతో, వేదశాస్త్రాధ్యయనంతో మృత్యువును దాటడం– అంటే ఇచ్ఛామరణం పొందడం సాధ్యమా? అదే సాధ్యం కానపుడు ఇక అజ్ఞానాంధకారాన్ని దాటడం సాధ్యమా? ఈ ప్రశ్నకు ఇక్కడ జవాబు లభించదు.

ఈ విషయంలో ప్రభువుల అభిప్రాయం ఏమంటే– అవిద్యతో అంధకారంనుండి బయటపడటం సాధ్యం కాదని అందరికీ తెలుసు. మృత్యువును దాటేందుకు, జ్ఞానాన్ని పొందేందుకు విద్యయే ఆశ్రయమని వారికి తెలుసు. విద్యోపాసనలోనే స్థూలం, సూక్ష్మం అనే విభాగాలున్నాయి. విద్యయొక్క స్థూలోపాసనతో మృత్యువును తరించి అంటే ఇచ్ఛామరణ స్థితినిపొంది, విద్య యొక్క సూక్ష్మోపాసన ద్వారా అమృతత్వాన్ని (జ్ఞానాన్ని) పొందడం సాధ్యం.

విద్యోపాసనలో జపతపాలు ఉంటాయి. జపం ప్రాణా యామంతో ప్రారంభమై ఆనందాను భవందాకా సాగుతుంది. ఆ స్థితిలోనే అమృతపానం అవుతుంది. కాబట్టి ఇచ్ఛామరణస్థితి లభ్యమవుతుంది. అంతటితో ఆగకుండా మున్ముందు విద్యయొక్క సూక్ష్మోపాసన సాగాలి. అనగా

అంతర్ముఖ స్థితిలో తన (ఆత్మయొక్క) మూలాన్ని దర్శించి తెలుసుకునేందుకు ప్రయత్నించాలి. అదే తపస్సు. ఆ పరమాత్మ దయతో అయ్యే ఆదర్శనం, ఆజ్ఞానం–వీటి ద్వారానే పరమపదం (అమృతత్వం–చిరశాంతి–మోక్షం) సుసాధ్యమగును.

అయితే ఇక్కడ కర్మను వదలిపెట్ట కూడదనే అంశాన్ని విస్మరించ రాదు. జ్ఞానం లభించిన తరువాత, దేహత్యాగం అయ్యేవరకు కూడ కర్మను ఆచరించవలసిన అవసరం ఉందన్న విషయము జ్ఞానులకు తెలుసు. ఇక అజ్ఞాన స్థితిలో ఉండే సాధకులు కర్మత్యాగం చేయడం అంటే కేవలము భ్రమతో కూడిన నాస్తికత్వమే తప్ప ఇంకేమీకాదు అని శ్రీజయతీర్థ స్వాములవారు అన్నారు.

107. పరమాత్మ దర్శనాన్ని గూర్చి ఉపనిషత్ ఋషులు వివరించిన విషయమై శ్రీజయతీర్థులవారు విశదపరచిన వాటిని తెలియ జేయుము?

ఈ విషయంలో శ్రీజయతీర్థులవారు ఈ క్రింది ఉపనిషత్ శ్లోకమును వివరించినారు.

"హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపి హితం ముఖం
తత్వం పూష న్న పావృణు సత్యధర్మాయ దృష్టయే"

బంగారు పాత్రతో సత్యపు ముఖము మూయబడినది. పూషుడా ఆ మూతను తొలగించి సత్యధర్ముడవైన నిన్ను దర్శించు సత్తు– అసత్తులకు అవతల ఉండే పరమాత్మ గురించి ఇక్కడ సూచ్యంగా వివరించబడింది. అసత్ అంటే ఆకారముండే జగత్తు. అందులోనిదంతా అసత్తు. సత్ అంటే – ఈ సమస్తానికి కారణమైన శక్తి (నిరాకార బ్రహ్మ) దానినే "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" అని చెప్పారు. "ఏకో వశీ సర్వ భూతాంతరాత్మా



ఏకం రూపం బహుధా యః కరోతి, తమాత్మస్థం యేనుపశ్యంతి ధీరాః తేషాం సుఖం శాశ్వతం నేతరేషాం" అని జ్ఞానులు చెప్పారు. ఈ రెంటికీ మూలమైన ఈరెంటికీ అవతల ఉండే పరమాత్మ గురించి ఇక్కడ చెప్పబడినది.

ఆ శాశ్వత సత్యపు ముఖం, అతనిని దర్శించే మార్గం బంగారు మూతతో మూయబడినది. అంటే – అతని చుట్టూ ప్రసరించే కాంతి కిరణాలతో ఆవృతమైనది. అందువలన దేవుని దర్శనం అసాధ్యమైనది. ఆస్థితికి చేరిన ఋషి, దేవుని ప్రార్థిస్తున్నాడు.

పూషా! నీ దర్శనంలో అవరోధంగా ఉన్న ఆ హిరణ్మయ పాత్రను (కాంతి కిరణసమూహాన్ని) తొలగించి, శాశ్వతుడవు, సమస్తాన్ని ధరించే నీ దైవరూప దర్శనము కలిగించుము.

108. మన దేహంలోని ప్రాణశక్తి జ్ఞానేంద్రియాలు కర్మేంద్రియాలు ఎవరి ప్రేరణవలన పనిచేయుచున్నవనే విషయమై కేనోపనిషత్తునందు చెప్పబడిన విషయాన్ని శ్రీజయతీర్థస్వామి వారు ఎట్లు వివరించిరి?

"ఓం కేనేషితం పతతి ప్రేషితం మనః
కేన ప్రాణః ప్రథమః ప్రైతియుక్తః
కేనేషితాం వాచమిమాం వదంతి
చక్షుః శ్రోత్రం క ఉదేవోయునక్తి॥"

ఎవరి ప్రేరణతో మనస్సు విషయంలో ప్రవృత్తమవుతున్నది? ఎవరివలన మొట్టమొదటి ప్రాణం తన క్రియను ప్రారంభించింది? ఎవరి ఇచ్ఛతో వాక్కు పల్కుతుంది? కన్నులు, చెవులు – వీటిని ఆదేశించే దేవతలెవరు? తన అనుభవ వేద్యమైన వస్తువులు, విషయాల వలన

అనుభవానికి రాని వాటి మూలాలను తెలుసుకునేందుకు మానవునిలో జిజ్ఞాస కల్గుతుంది.

వస్తువుల సహవాసంతో మనస్సులో కోరిక పుడుతుందని చెప్పవచ్చు. సహవాసం కల్గినా అనుభవించే కోరిక కొందరిలో కొన్నిసార్లు మాత్రమే కల్గుతుంది. కొన్నిసార్లు కల్గదు. ఇలా కోర్కె పుట్టడానికి పుట్టకుండా ఉండటానికి కారణం ఏమిటి? దీనికి బదులుగా జన్మ సంస్కారం, పూర్వజన్మ వాసన, అంటే జీవియొక్క మొట్టమొదటి జన్మలో ప్రవృత్తి ఎందుకు కల్గింది? అనే ప్రశ్న ఉద్భవిస్తుంది. అ లాగే సృష్టి కార్యాన్ని ప్రారంభించిన ప్రథమ వృత్తిలోని ఆ కోర్కె ఎందుకు కల్గిందనే ప్రశ్న వస్తుంది. మనస్సుకు మరియు కర్మేంద్రియాలకు జ్ఞానేంద్రియాలకు ఈ శక్తి అవసరము.

ఈ శక్తిని ప్రాణశక్తినుండే పొందే విధానం మనస్సుకు తెలియక పోవడమే కారణం. దానికి కారణమేమిటంటే ప్రాణంనుండి మనస్సు దూరమై, దాన్ని గ్రహించి ప్రాణాన్ని ఆశ్రయిస్తే ప్రాణం ద్వారా వాయువుకు ఆ శక్తి కల్గునట్లు చేసి కర్మేంద్రియాల, అ లాగే బ్రహ్మేంద్రియాల అసామర్థ్యాన్ని తొలగించవచ్చు. అంతే కాకుండా ఇంద్రియ లోలత్వంలో పడిపోయి తనలో కలిగిన అశాంతి, అధైర్యం, అసంతృప్తి వీటన్నిటినీ తొలగించుకోవచ్చు.

ఇక్కడ మన దేహంలోని ప్రాణమనే శక్తి ఇంద్రియాలకూ, అ లాగే మనస్సుకు కూడా ఆధారమనిపిస్తుంది. ఉత్పత్తి అయిన ఆదిభూతవాయువనే (ఆకాశంలో) శ్రుతి వాక్యం ఉంది. ఆకాశం భూతమనీ అది ఆత్మలో నుండి ఉత్పత్తి అయిందనీ భ్రమించడం సత్యం కాదు. "ఆత్మా వై ఆకాశః" అనే మాటకు ఆత్మ ఆకాశంలో ఉంటుందని అర్థం. ఆత్మనుండి ఆకాశం ఉత్పత్తి అయిందనీ, ఆ వాయువు నుండి అగ్ని – ఈ విధంగా



మిగిలిన భూతాల పుట్టుకను గ్రహించాలి. మొదటి భూతమైన వాయువు మన దేహంలో ప్రాణశక్తి లేకుంటే పనిచేయుదు.

ప్రాణంనుండి పోషక ద్రవ్యం లభించకుంటే శక్తిహీన మవుతుంది అన్నాక ఆ వాయువు ప్రాణంలో నుండి ఉత్పన్నమైనదని తెలుస్తుంది కదా.

"ప్రాణాత్ వాయు రజాయతే" అన్నారు కదా.

ఈ విధంగా సమస్త భూతాల, ధాతువుల ఉత్పత్తికీ, పోషణకు మూలకారణమైన మరియు మనస్సుకు మూలాధారమైన ఈ ప్రాణశక్తి మొదట తన క్రియను ఎవరి ఇచ్ఛతో ప్రారంభించినది? ఇది ఉపనిషత్ మంత్రములోని ప్రశ్న. ఇచ్చట మహర్షులు పై ప్రశ్నకు సూక్ష్మంగా ఉత్తరమిచ్చినారు. ఇంద్రియాలు, వాటిని పాలించే మనస్సు దానికి మూలాధారమైన, అన్నిటికీ మూలమైన బ్రహ్మమునుండే వీటన్నిటికీ శక్తి ప్రవృత్తులు ఉంటాయనేదే వారి భావన.

109\. ఆత్యంతికమైన బ్రహ్మను గురించి ఉపనిషత్తు మహర్షులు సూక్ష్మముగా వివరించిన విషయములను గురించి తెలియ జేయుము?

ఈ విషయంలో స్వామి జయతీర్థులవారు కొన్నింటిని వివరిస్తూ కేనోపనిషత్తు మంత్రభావమును తెలియజేసినారు.

"న తత్ర చక్షునర్గచ్ఛతి నవాగచ్ఛతి
నో మనో నవిద్మోన విజానీమో
యద్యైతదను శిష్యా దన్యదేవ తద్విదితా
దధో అవిదితాదాధి ఇతి శుశ్రుమ
పూర్వేషాం యేనస్తద్వ్యా చచక్షిరే॥"

మనకు ఇంద్రియ గోచరమైన, అ లాగే బుద్ధి గమ్యమైన వస్తువుల కవతల ఇంద్రియ గోచరంకాని, బుద్ధి గ్రాహ్యం కాని వస్తువులు ఎన్నో ఉన్నాయి. ఇలా తెలిసిన, మరియు తెలియని వస్తువుల కవతల ఉండేదే బ్రహ్మస్థానమనేది వారి భావన. సత్తు అసత్తుల అవతలి స్థానమనేదే వారి భావము. దాన్నే గీతలో ఎక్కడ సూర్యుడు ప్రకాశించడో గాలి వీచదో మొదలైన వాక్యాలలో వర్ణించడమైనది. ఆ బ్రహ్మను ఋషులు దర్శించినా దాన్ని మేమెరుగము అనడంలో వాళ్ల వినమ్రత గోచరిస్తుంది. వారికి ఆ విషయంలో పరిజ్ఞానమే లేకుంటే ఆ విషయం గురించి వాళ్లు చెప్పేవాళ్లు కాదు. లేదా ఎరుగమని చెప్పి అక్కడితో దాన్ని ఆపివేసే వాళ్లు. అ లా చేయకుండా వాళ్లు. శిష్యులకు అర్థమయ్యే రీతులలో బోధించే స్థాయిలో మా జ్ఞానం లేదు. అంతేకాదు తమకు ఉపదేశించిన పూర్వీకులు అ లాగే చెప్పారన్న ఋషి వాక్యంలో పూర్ణమయిన బ్రహ్మను ఎవరూ పూర్ణంగా తెలుసుకోలేరు. ఎందుకంటే - సృష్టిలో అణుప్రాయుడైన వ్యక్తి యొక్క సర్వశక్తులూ పరిమితమైనవి. అందువలన బ్రహ్మ గురించి తెలుసుకోవాలి అనుకొనే వారికి తెలిసిన వారు చెబుతూ కూర్చోరు. వారే దాన్ని అంతర్ముఖస్థితిలో గ్రహించేందుకు ప్రేరేపించాలన్న ఋషుల ఉద్దేశం ఇక్కడ తేటతెల్లమవు తుంది. ఇదే నిజమైన మార్గదర్శనం అని శ్రీస్వాములవారు ముగించినారు.

110. ముండకోపనిషత్తునందు బ్రహ్మవిద్యావిషయముపై శ్రీజయతీర్థస్వామి వారు ఇచ్చిన వివరణను తెలియజేయుము?

బ్రహ్మవిద్యా విషయమై మన దేహము నందలి జీవాత్మ (ప్రత్యగాత్మ) విషయమై ఈ విధముగా వివరించినారు.

"ప్రణవోధనుః శరో హ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్తన్మయో భవేత్॥"



ప్రణవమే విల్లు. మనస్సే బాణం. బ్రహ్మమే లక్ష్యం. (జీవాత్మ ఉండే బ్రహ్మరంధ్రం) వింటినుండి వదలబడిన బాణంలా ఒకే లక్ష్యాన్ని ఉంచుకొని ప్రణవంతో తన్మయం కావాలి.

"అరా ఇవ రథనాభౌ సంహతా యత్ర నాడ్యః
సఏషో అంతశ్చరతే బహుధా జాయమానః ఓమిత్యేవం
ధ్యాయథ ఆత్మానం స్వస్తివః పారాయ తమసః పరస్తాత్"

రథ చక్రం మధ్యలో అన్ని ఆకులు చేరునట్లు ఈ దేహంలోని నాడులన్నీ చేరే స్థానాన్ని ప్రాణుడు సంచరించే స్థానంగా చెబుతారు. ప్రణవంతో ఏకాగ్రచిత్తుడవు కమ్ము. అనంతజ్ఞానప్రాప్తి జరిగి అంధకారం నుండి బయట పడతావు.

"యః సర్వజ్ఞః సర్వవిద్య స్యేష మహిమాభువి - దివ్యే బ్రహ్మపురే హ్యేష వ్యోమ్న్యాత్మా ప్రతిష్ఠితః
మనోమయః ప్రాణశరీర నేతా ప్రతిష్ఠితోఽన్నే
హృదయం సన్నిధాయ తద్విజ్ఞానేన పరిపశ్యంతి
ధీరా ఆనంద రూప మమృతం యద్విభాతి"॥

అపుడతడు సర్వజ్ఞుడవుతాడు. సర్వవిద్యల్ని గ్రహించి ఈ భూమిలో మహిమాన్వితుడనిపించుకుంటాడు. ఆ ఆత్మ దివ్యమైన బ్రహ్మపురిలో (బ్రహ్మరంధ్రంలో) ప్రతిష్ఠించబడి ఉంటాడు. మనోమయుడై (ఇచ్ఛావంతుడై, జ్ఞానవంతుడై) ప్రణవమే శరీరంగా ఉండే శక్తి ఇతడు. ప్రాణమే ఇతని క్రియాశక్తి. శరీరాన్ని నియమించే ఈ ముఖ్యశక్తి హృదయంలో ఆత్మచేత ప్రతిష్ఠింపబడింది. ప్రాణమే అక్కడుండక ప్రాణంచేత ఉత్పత్తి అయిన ఈశ్వరుడు (వాయువు యొక్క ఒక అంశం) ఉన్నాడు. దీన్ని విజ్ఞానాన్ని ఆ ఈశ్వర శక్తి ద్వారా అంటే వాయువు ద్వారా ప్రాణాన్ని, అప్రాణం ద్వారా

ఆత్మను తెలుసుకుని ఆనందమే తమ సహజతగా పొందినవారై అమృతులై సర్వత్రవిరాజిల్లుతుంటారు.

"యత్ దృష్టం తత్ నష్టం" అనే మాట స్థూల దృష్టికి కన్పించే పాంచభౌతిక రూపాలకు మాత్రమే అన్వయిస్తుందే కాని "యోగి హృద్ధ్యాన గమ్యం" (యోగులు ధ్యానములో దర్శించే) దేవుని నిత్య దేహానికి అన్వయించదు. "సనత్సుజాతీయంలో" చెప్పినట్లు "యోగినస్తం ప్రపద్యంతి భగవంతం సనాతనం" శాశ్వతుడైన భగవంతుని యోగులు మాత్రమే ఉన్నది ఉన్నట్లుగా చూడ గలుగుతారు. యోగులు కానివారు తాము కల్పించుకొన్న రూపాలను కలగంటారు. స్వప్నమనేది మనస్సుయొక్క భ్రాంతివల్ల కలిగింది కాబట్టి బుద్ధిమంతులు ఆ కల్పిత రూపం చూచినట్లయితే ఆ విషయానికి అంతగా ప్రాధాన్యత ఇవ్వరు.

బుద్ధికి అందని దేవుని విషయంలో బుద్ధిమంతులు ప్రాముఖ్యత నివ్వరు. అయితే తపస్సు ద్వారా అంతరదృష్టి పొందిన యోగులు మాత్రం సృష్టి రహస్యాన్ని గ్రహించకలుగుతారు. సృష్టికి మూల కారణమైన దైవాన్ని చూడగల్గుతారు.

ఇక్కడ విధిలేని స్థితిలో చెప్పవలసివచ్చిన మాట ఒక టుందన్నారు శ్రీస్వాములవారు. వేదాంత మనేది షడ్దర్శనాల్లో ఒకటి. ఇందులో మూడు శాఖలున్నాయి. ఈ మూడు శాఖలదీ పరస్పర భిన్నమైన తత్వప్రణాళిక. అయితే మూడింటికి ఆధారగ్రంథాలు మాత్రము ప్రస్థానత్రయము (ఉపనిషత్తులు– భగవద్గీత – బ్రహ్మసూత్రాలు) ఈ గ్రంథాలలో చెప్పబడిన ప్రతి శ్లోకానికి ఈ మూడు శాఖల ప్రవక్తలు (శంకరాచార్య, మధ్వాచార్య, రామానుజా చార్య) విభిన్నమైన అర్థాన్ని కల్పించి యున్నారు. కారణం ఆలోచించగా వీరెవ్వరు పరబ్రహ్మను దైవాన్ని దర్శించిన యోగులేమీ



కాదు. అంతేకాదు తమకన్న పూర్వీకులైన తపస్వులు, జ్ఞానులు చెప్పినదాన్నే వినాలనే వినమ్రులు కాదు. అ లా వినమ్రులై ఉండి ఉంటే వీరు కపిల మహర్షి చెప్పిన "సాంఖ్యాన్ని" మరియు హిరణ్యగర్భుడు పలికిన "యోగ" దర్శనాన్ని ఖండించేవారు కాదు. వేదాలు మానవుని ముఖమునుండి వెలువడినవి కాక పోవడంతో (అపౌరుషేయాలని విశ్వాసం) అవి శ్రేష్ఠమైనవనే మోహం. వ్యాసుడు (బ్రహ్మ సూత్రాల కర్త) అవతార పురుషుడనీ వారి భ్రమ. అందువలన బ్రహ్మ సూత్రాలను వేదాలను ఖండించిన శ్రీకృష్ణుని ముఖము నుండి వెలువడిందే భగవద్గీత. "త్రైగుణ్య విషయా వేదా నిస్త్రైగుణ్యో భవార్జున" సాంఖ్య, యోగాల్లాగే, గీతను కూడా వీరు నిషేధించి ఉండవచ్చును. అందులకు ధైర్యం చాలదు. దేవకీ వసుదేవులు కంసుని కారాగారంలో మగ్గేవేళ భగవంతుడు అవతరించి వీరి కష్టాలను తొలగిస్తాడని భవిష్యాన్ని చెప్పారే కాని వారి కష్టాలను తొలగించడానికి వ్యాసులవారు ఎన్నడూ ప్రయత్నించలేదు. ఎందుకనగా ఆయన జ్ఞాని అయి ఉండవచ్చును కాని యోగి కాదు. అందుకనే గీతలో "జ్ఞాని భ్యోకపి మతోధికః తస్మాద్యోగీ భవార్జున" (ఆర్తుని కష్ట నివారణకై శ్రమించే యోగి మనస్సు (స్వభావ సహజత్వం) జ్ఞాని మనస్సు కంటె శ్రేష్ఠం అన్నారు స్వామి జయతీర్థులవారు. వీరి అభిప్రాయం అంటే శ్రీ అచ్యుతస్వాములవారి నిర్ణయం మేరకు, భగవంతుని బోధ గీత వచ్చింది కృష్ణుని ముఖంలోనుండి. అ లాగే కృష్ణుడు భగవంతుని ప్రతినిధిగా వ్యవహరించాడు. అందుకే అతడు అవతార పురుషుడు. యోగీశ్వరుడన్నారు. యోగమంటే ప్రాణ మనస్సుల సంగమం (తొలి దశలో) జీవాత్మల కలయిక (మలిదశలో) అని తెలిసికోకుండా కొంతమంది భగవద్గీత ఆత్యంతిక విషయాలను ఖండించిన వారికి ఆ స్థితి తెలియకపోవుట వలననే అని శ్రీ అచ్యుత యోగులు వివరించినారు.

111. మానవుడు వైశ్వానరస్థితి నుండి అనగా మనస్సు బాహ్య జగత్తులో ఉండే స్థితి నుండి ప్రాజ్ఞ స్థితిని పొందాలంటే ఏమి చేయవలెనని (మాండూక్యోపనిషత్) వివరించిన శ్రీ జయతీర్థ స్వాములవారి వివరణ తెలియజేయుము?

వారు ఇచ్చిన వివరణ మేరకు ప్రాణం బ్రహ్మరంధ్రములోని ఆత్మతో కలిసిపోవలెను. దీనినే యోగధారణ మన్నారు. గీతలో "ఈశ్వరః సర్వ భూతానాం హృద్దేశేర్జున తిష్ఠతి" అనే వాక్యంలో హృదయంలో ఈశ్వరుదున్నాడని చెప్పబడిందే కాని ప్రాణముంటుందని చెప్పబడలేదు.

"సర్వ ద్వారాణి సంయమ్య మనోహృది నిరుధ్యచ
మూర్ధ్నాధాయాత్మనఃప్రాణమాస్థితో యోగధారణాం"

అనే శ్లోకంలో సర్వద్వారాల్ని నిగ్రహించుకుని మనస్సును హృదయంతో నిరోధించి, అంటే ప్రతిష్ఠించకుండా ప్రాణాన్ని ఆత్మతో బ్రహ్మరంధ్రంలో చేర్చడమే యోగధారణ అని తేటతెల్లమవుతుంది. అయితే ప్రాణం వాయువు కాదు. ముక్కు నోరు చెవుల్లో సంచరించేది వాయువు. ప్రాణం కాదు.

"న ప్రాణేన నాపానేన మర్త్యో జీవతి కశ్చన
ఇతరేణతు జీవంతి యస్మిన్నే తావుపాశ్రితౌ"

ఇక్కడ ఈ ప్రాణ,అపానాలతో మర్త్యులు (మనుషులు) జీవించజాలరు. ఇవి రెండూ దేన్ని ఆశ్రయించుకొని ఉన్నాయో అతని ద్వారా బ్రతికి ఉన్నారని చెప్పడం జరిగింది. ముఖ్య ప్రాణుని ద్వారా జీవించుచున్నారు. మన దేహంలో ముఖ్యప్రాణం ఎచ్చట ఉన్నదని విశదీకరించిన విషయాన్ని స్వామి జయతీర్థుల వారు విశదీకరించినారు.



"ఊర్ధ్వ ప్రాణమున్నయత్యపానం ప్రతిగస్యతి
మధ్యే వామన మాసీనం విశ్వేదేవా ఉపాసతే॥"

అది ప్రాణవాయువును పైకి లేపుతుంది. అపాన వాయువును వ్యతిరేక దిశలో క్రిందికి తోస్తుంది. మధ్యలో ప్రతిష్ఠితమైన ఈ వామనుణ్ణి విశ్వంలోని దేవతలంతా ఉపాసిస్తారు. ఇక్కడ వామన అనే శబ్దం చెప్పడం ఈ పంచవాయువుల ఉత్పత్తికి కారణమైన ప్రాణచేతనను సూచించేందుకే. ఆ ప్రాణం మధ్యలో కూర్చుందని అంటే ప్రాణాపానాల మధ్యలో లేదు. దేహం మధ్యలో కాదు (నాభి, హృదయం) మరి ఎక్కడ? తనలోనుంచి ఉత్పత్తి అయిన పంచ వాయువుల వ్యాప్తి కల్గిన పృధ్వికి, ఆత్మప్రతిష్ఠితమైన బ్రహ్మరంధ్రానికీ మధ్య. ఈ ప్రాణం తాను కూర్చున్న ఆ స్థలంలో నుండి బ్రహ్మరంధ్రంలోకి (ఆత్మ ఉండే చోటికి) చేరాలి. అపుడు ప్రాజ్ఞ స్థితి లభిస్తుంది. అదే యోగ స్థితి. అయితే ఇది ఎలా సాధ్యం. మనస్సు ద్వారానే. కేవలం సంకల్పం ద్వారా సాధ్యం కాదు. ఈ ప్రాణం యొక్క ఊర్ధ్వ గమనానికి అతనికి శక్తి అవసరం. అతడు అశనాధారి. ఇక్కడ అశనం అంటే స్థూలమైన ఆహారం కాదు. సూక్ష్మాహారం. దాన్ని పంచాగ్ని పూజతో (పంచాగ్ని హోత్ర, పంచయజ్ఞ) అంటే పంచ వాయువుల్ని చేర్చి ప్రాణాపానగతులలో (దేహంలో మూడు గతుల్లో ఋక్, యజుర్, సామలలో) మథించాలి. ఆ మథనంలో ఆ వాయువు యొక్క శుద్ధసారం. అశన మనే సూక్ష్మాంశంగా పైకి వెళ్లి ప్రాణం ద్వారా గ్రహించబడుతుంది. ఆ అశనాన్నే "పృధివ్యాం పుణ్యగంధోస్మి" పృధ్విలో ఉత్పత్తి అయ్యే పుణ్యగంధం అని చెప్పడం జరిగింది.

ఆ గంధం ప్రాణ నుంచి స్వీకరించబడ్డాక, ఆ ప్రాణునికి శక్తి కల్గి ఊర్ధ్వగమనం లభించి, బ్రహ్మరంధ్రంలో ఆత్మతో కలిశాక యోగస్థితి

కలుగుతుంది. కేవలము వాయు మథనమే యోగం కాదు. కేవల మానసిక చింత విచారం– ఇవే యోగ క్రియలు కావు అన్నారు జయతీర్థులు. ఈ గంధాన్ని గురించి శ్రీసూక్తం ఋగ్వేదంలో తెలుపబడినది.

"గంధ ద్వారాం దురాధర్షాం నిత్య పుష్పాం కరీషిణీం
ఈశ్వరీ సర్వభూతానాం తామిహోపహ్వయే శ్రియం।"

అంటే సర్వత్ర వ్యాప్తమై గూఢంగా ఉండే విభూతి (గంధ) ద్వారాన్ని గ్రహిస్తే శాశ్వత చైతన్యాన్ని తెలుసుకున్నట్లవుతుందని చెప్పబడింది. దేవుని దర్శనం వలన కర్మ నశిస్తుందా? కర్మఫలాన్ని అనుభవిస్తూ క్రమంగా అది తగ్గుతూ చివరికి నాశనమౌతుంది. దేవుని దర్శనానంతరం తపస్సుగా మారి జ్ఞానం సంప్రాప్తించి – దాని ఫలితంగా అతడు బంధాన్ని కల్గించే కర్మ చేయజాలడు. క్రితం జన్మలో చేసిన కర్మ ఫలాన్ని అనుభవించి దాన్ని ముగించాల్సిందే. "తప్పు చేయవద్దు క్షమాపణ వద్దే వద్దు" అనేది ప్రభు అచ్యుతుల భోధ. దానికి కారణం కర్మఫలం. దాన్ని అనుభవించక తప్పదు.

112. ఆత్మ దర్శనాన్ని గురించి శ్రీజయతీర్థస్వాములవారు వివరించిన విషయాలను వివరింపుము?

ఇచ్చట బ్రహ్మ సూత్రముల యందు "ఆత్మ సర్వోత్తమః ఓం" అన్నారు. అనగా ఇచ్చట మానవ దేహములో ఉన్న ప్రత్యగాత్మను గురించిన విషయము కాదు– విశ్వాత్మ గురించి తెలిసికోవలెనన్నారు ముండక ఉపనిషత్తు నందు ఉపనిషత్కారులు వివరించిన విషయాన్ని విశదీకరించి నారు. బంగారు రంగు కల్గిన సర్వకర్త అయిన పరమాత్మను, నాశరహితమైన ప్రాణశక్తికి మూలకారణమైన పురుషుణ్ణి చూచిన విద్యావంతుడు



పాపపుణ్యాల నుండి విముక్తుడై నిర్లిప్తుడై (అజ్ఞానాన్ని తొలగించుకొని) పరమ సామ్య స్థితిని పొందుతాడు.

"ఆత్మరతః ఆత్మక్రీడః క్రియావానేష బ్రహ్మవిదాం వరిష్ఠః"

ఆత్మయొక్క సహజ స్థితియైన ఆనందానుభవాన్ని పొందుతూ తనలో తాను క్రీడిస్తూ (జ్ఞాన వికాసాన్ని పొందుతూ) లోక కల్యాణం కోసం కర్మల్ని చేసే వ్యక్తి బ్రహ్మజ్ఞానుల్లో శ్రేష్ఠుడు. అతడే యోగి అనిపించు కుంటాడు.

"బృహచ్చ తద్దివ్య మచింత్య రూపం
సూక్ష్మాచ్చ తత్సూక్ష్మతరం విభాతి
దూరాత్సుదూరే తదిహాంతికేచ
పశ్యత్స్విహైవ నిహితం గుహాయాం"

పరమ పురుషుని (దేవుని) రూపం చాలా పెద్దది (శ్రేష్ఠం) అది ఊహకు అందనిది. చాలా దూరంలో ఉండేది. అయినా చాలా దగ్గరలో ఉంది. ఎందుకంటే అదిమాలోనే (అంతర్ముఖ స్థితిలో) ఉన్నట్లు కనిపిస్తుంది. ఆత్మ (దేవుడు)కనులకు కన్పించేవాడు కాదు. మాటల ద్వారా అతణ్ణి గ్రహించలేము. కర్మలతోగాని కేవలం ఇచ్ఛా శక్తితో గాని (తపస్సు) ఇతర దేవతల సహాయంతో కాని లభించదు. జ్ఞానాన్ని పొంది శుద్ధుడైన వ్యక్తికి ధ్యాన స్థితిలో కళాతీతుడైన ఆత్మ కన్పిస్తుంది.

"నాయమాత్మా ప్రవచనేన లభ్యో
నమేధయా న బహునా శ్రుతేన
య మేవైష వృణుతే తేన లభ్య
స్త స్యైష ఆత్మా వివృణుతే తనుం స్వామ్।"

ఈ ఆత్మను ప్రవచనం ద్వారా, మేధస్సు ద్వారా, పాండిత్యం ద్వారా పొందలేము. ఆత్మ ఎవరినైతే వరిస్తుందో అతనికి మాత్రమే లభ్యమౌతుంది. అ లాంటి వ్యక్తికి మాత్రమే ఆత్మ తన వివరాలనన్నిటినీ అందిస్తుంది. ఇక్కడ దేవుడు దర్శనమిస్తాడని చెప్పడం వలన భక్తి యొక్క గొప్పతనం వివరించబడింది. జ్ఞానప్రాప్తి అయిన ఋషులు తృప్తులు, శుద్ధులు, మోహరహితులు, ప్రశాంతులై సర్వాత్ముని సామీప్యాన్ని (భగవంతుని దర్శనానందం) అన్నిచోట్ల అనుభవిస్తూ యోగ్యులై, అందరి కళ్యాణం కోసం శ్రమిస్తారని సెలవిచ్చారు శ్రీజయతీర్థస్వాములవారు.

113. ఉపనిషత్తు విషయములను చర్చిస్తూ దేవుని విషయమై మరియు పురుషుని విషయమై శ్రీజయతీర్థస్వాములవారు సూక్ష్మముగా తెలియజేసిన అభిప్రాయము తెలియజేయుము?

ఉపనిషత్తుల్లో అత్యంత ప్రధానమైనది ప్రశ్నోపనిషత్తు. ఆరుగురు జిజ్ఞాసువులు పిప్పలాద మహర్షిని తత్వ రహస్యాన్ని ఉపదేశించమని అడుగుతారు. మహర్షి వారికి సమాధానం చెప్తాడు. ఇక్కడ గమనించవలసినది 1. ఆత్మ నుండి ప్రాణ చైతన్యం వచ్చింది. అది వాయువును సృష్టించింది. ఆ వాయువే ఐదు పేర్లతో మన శరీరాల్లో వేర్వేరు భాగాల్లో ఉందనే అంశం. 2. స్వప్న స్థితిలో మనస్సే సర్వాన్ని చూచే దేవత. 3. 16 కళలతో కూడిన పురుషుడు మనదేహంలో ఉండే పురుషుడే. ఆత్యంతిక పురుషుణ్ణి సూర్యునితో పోలిస్తే, ఈ పురుషుణ్ణి (ప్రత్యగాత్మ–జీవాత్మ) చంద్రునితో పోల్చవచ్చు. అతడు (దైవము) నాదబిందు కళాతీతుడు. ఇతడు (జీవాత్మ) నాదం ద్వారా (ప్రణవ) బిందువులో (బ్రహ్మరంధ్రం) చేరాక తన సహజ స్థితిని పొంది, 16 కళలతో విరాజిల్లుతాడు. ఈ జీవాత్మకు వృద్ధి క్షయాలున్నాయి. దైవానికి



లేవు. ప్రణవం ద్వారా పరమపురుషుని ధ్యానం చేసే వ్యక్తి శరీరస్థ పరాత్పర పురుషుణ్ణి చూస్తాడని వివరణ ఇవ్వడం ద్వారా దేవుడంటే నిత్యదేహి అయిన ఆత్యంతిక పురుషుడే, నిరాకార చైతన్యం కాదని ఉపనిషత్కారులు బోధించారు. ఈ దృష్టితో చూస్తే ఈ ప్రశ్నోపనిషత్తు చాలా మహత్వపూర్ణమైన దన్నారు శ్రీస్వామి జయతీర్థులవారు.

జ్ఞాన వివరణల్ని శబ్దాల ద్వారా అందిస్తే స్థూల ప్రకృతి దోషం వలన బుద్ధిమాంద్యం, వికారాలు ఆ వాక్కులో చేరిపోతాయి. ఆ మాటలు నమ్మశక్యంగా ఉండవు. స్థూల ప్రకృతి దోష నివారణకై ఒక ఏడాదిపాటు శ్రద్ధతో బ్రహ్మచర్యంలో ఉండి తపించడం అవసరం. ఈ మాటనే మా గురువర్యులు శ్రీ అచ్యుతులవారు అంటూ ఉండేవారు. ఏ కాలంలోనైనా తపస్సుకు సంబంధించిన అనుభవాలు, జ్ఞానాలు ఒకే రకంగా ఉంటా యనడానికి దీనికి మించిన నిదర్శనం ఇంకేం కావాలి అన్నారు శ్రీ జయతీర్థస్వాములవారు.

ప్రజాపతి యొక్క శరీర నిర్మాణానికి కారణమైన ప్రాణశక్తి కూడ పరాత్పర పురుషుని నిత్య దేహంలో ఉండే చైతన్య స్పందనంలోంచి ఉత్పత్తి అయి బయటికి వచ్చిన ఒక శక్తి. ఆశక్తి సహజంగా ఆ నిత్య దేహంలో ఉత్పత్తి అయి బయటికి వచ్చింది. అతనిలో సంకల్పం లేదు. అందువల్ల అతడు లిప్తుడుకాదు. నిరంతరం ఆనందంగా ఉంటాడు. అఖండానంద విగ్రహుడు. అయితే కర్త అనిపించుకున్న ప్రజాపతి కాడు. ఇతనినే ఆత్మ అని కొందరన్నారు. దేవుడు అంటారు. ఈ ఉపనిషత్తులో వివరించబడినదని సెలవిచ్చారు శ్రీజయతీర్థస్వాములవారు.

ఆత్మ అంటే శుద్ధ చైతన్యం. అదే ప్రజ్ఞానం. విశ్వానికి మూలం ఈ శుద్ధ చైతన్యమే. దీని స్వయం స్ఫూర్తితో విశ్వం వ్యక్తమై వ్యాప్తమైంది.

"ఆత్మావా ఇదమేక ఏవాగ్ర ఆసీత్ నాన్యత్ కించనమిషత్। స ఈక్షత లోకాన్ను సృజా ఇతి।"

(ఐతరేయోపనిషత్ 1-1)

ప్రజాపతి విషయాన్ని వివరిస్తూ శ్రీజయతీర్థస్వాములవారు వివరించినారు. ఈ ప్రజాపతిలో విచారము, సంకల్పము, తపస్సు ఇవన్నీ ఉన్నవి. ఇతను దేవతలందరి యజమాని, పరమేశ్వరుడని పరమేష్ఠి, ఆదిపురుషుడనియు, ఆది దేవుడనియు ప్రార్థించినారు ఉపనిషత్కారులు. ఇతడు సర్వేశ్వరుడైనా, సర్వాతీతుడు కాదు. అనాది పురుషుడు కాదు. ఇది చాలమంది తపస్వులకు గోచరముకాని సృష్టికే మూలమైన రహస్యమని జయతీర్థస్వాములన్నారు. ఇతనిని ఆది దేవుడైన హిరణ్య గర్భుడనియు పురుషరూపి అయిన పరమాత్ముడని అంటారు. ఈ బ్రహ్మను కేవలము "విశ్వకర్తా" విశ్వాన్ని సృష్టించినవాడు అని మాత్రమే కాకుండ "భువనస్యగోప్తా" లోకాలను రక్షించేవాడని చెప్పబడింది. ఇతడు త్రిమూర్తులలో ఒకడైన బ్రహ్మ కాదని ఉపనిషత్తులలో చెప్పబడినది. విశ్వ నిర్మాణానికి కారణమైన ఈ పురుషుణ్ణే విరాట్ పురుషుడని ఈశ్వరుడని అంటారు. అతనిలో కోరిక కల్గి ఆ కోర్కెతో ఇచ్ఛాశక్తి వ్యాప్తమై విశ్వంగా రూపొందించడము వలన అతనిని, అనగా పురుషుణ్ణి కాముడని జ్ఞానులు పిలుస్తారన్నారు. "నాహం కర్తా, కర్తా కామః" అనే శ్రుతి వాక్య రహస్యం కూడా ఇదే అని సెలవిచ్చారు స్వామివారు.

ఈశావాస్య ఉపనిషత్తు నందు ఆ పరమపురుషుడని అతనొక్కడే సర్వజ్ఞుడు కావడము వలన అతనినే గురువని, గురు శక్తుడు కావడము వలన ప్రభువనీ, సమానత్వం అధికముగా ఉండుటవలన యోగి అని సహజముగా శాంతిమయుడు కావడము వల్ల శివుడని జ్ఞానులు వర్ణించిరి.



"పురుష ఏ వేదం విశ్వకర్మ తపో బ్రహ్మ పరామృతం
ఏతద్యో వేద నిహితం గుహాయాం
సోక విద్యా గ్రంథిం వికిరతీహ సౌమ్య"

(ముండకోపనిషత్ 2-2-10)

పురుషుడే ఈ విశ్వం. అంటే ఈ విశ్వమంతా పురుషుని శక్తిలో నుండే పుట్టినది. కర్మ, తపస్సు, బ్రహ్మత్వం, అమృతత్వం వీటన్నిటిలోనూ అతడే. అతని ద్వారానే గూఢమైన ఈ జ్ఞానాన్ని పొందితే, అజ్ఞాన గ్రంథిని ఛేదించి ముక్తుడవుతాడని శ్రీజయతీర్థ స్వాములవారు బోధించినారు.

అచ్యుతాశ్రమము

లీలీలీ

శ్రీ అచ్యుతాశ్రమము